
శుక్రవారం 8-12-2023



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 257

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తెలంగాణ ప్రగతికి తోడ్పాటు
సీఎం రేవంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ ట్వీట్ - 2లో



సహజీవనం ప్రమాదకరమైన జబ్బు
లోక్‌సభలో బీజేపీ ఎంపీ ధరంబీర్ సింగ్ వ్యాఖ్యలు - 6లో

• న్యూ టీమ్
మంత్రులు వీరే..
నేడు శాఖల కేటాయింపు? 3లో



ఉత్తమ్ కుమార్ రెడ్డి | దామోదర రాజనర్సింహ | కోమటిరెడ్డి వెంకటరెడ్డి | శ్రీధర్ బాబు | పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి | సీతక్క | కొండా సురేఖ | జూపల్లి కృష్ణారావు | తుమ్మల నాగేశ్వరరావు | పొన్నం ప్రభాకర్



గురువారం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క

రేవంత్ అనే నేను..

• ప్రమాణం
ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క

మరో 10 మంది మంత్రులతోనూ ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళిసై

- పవిత్ర హృదయంతో అంటూ ప్రమాణం చేసిన పొంగులేటి, సీతక్క.. ఇంగ్లిష్‌లో దామోదర రాజనర్సింహ
- 28 నిమిషాలు కొనసాగిన కార్యక్రమం
- ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక, కర్ణాటక, హిమాచల్ సీఎంలు, ఏఐసీసీ పెద్దల హాజరు
- ఓపెన్‌టాప్ జీప్‌లో సోనియాతో కలసి మైదానంలోకి వచ్చిన రేవంత్ 2లో

• కేబినెట్ భేటీ రేపటి నుంచే ఆర్టీసీ బస్సుల్లో..
మహిళలకు ఉచిత ప్రయాణం

- ఆరోగ్యశ్రీ చికిత్సల పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ భేటీ
- ఆరు గ్యారంటీలలో రెండింటి అమలుకు పచ్చజెండా
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదలకు నిర్ణయం
- 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రభుత్వ ఖర్చు, జరిగిన ప్రయోజనాల వివరాలు ప్రజల ముందుకు..

10లో

హాట్ హాట్‌గా కేబినెట్!
- ఆర్థిక, విద్యుత్ రంగాలపై చర్చ
- నేటి సమీక్షకు సీఎండీ ప్రభాకర్‌రావును పిలవాలని ఆదేశం

ఉదయం నుంచి కాంగ్రెస్ అగ్రనేతల రాక, ఆహ్వానాలు.. మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారాలు, సభ.. కొత్త సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం.. అధిష్టానం నేతలకు వీడ్కోలు.. సాయంత్రం సచివాలయం వద్ద హడావుడి.. సీఎం చాంబర్‌లో రేవంత్ బాధ్యతల స్వీకరణ.. తర్వాత కాసేపటికే కొత్త కేబినెట్ తొలి సమావేశం.. రాత్రిదాకా వాడీవేడిగా చర్చలు.. మొత్తంగా రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలిరోజు హడావుడిగా కనిపించింది. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం ఉదయం హైదరాబాద్‌కు వచ్చిన సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గేలకు రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. వారంతా తాజ్‌కృష్ణ హోటల్‌కు వెళ్లగా.. రేవంత్ తన నివాసానికి వెళ్లి, అక్కడి నుంచి కుటుంబంతో కలసి జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మళ్లీ తాజ్ కృష్ణ హోటల్‌కు చేరుకుని, కాంగ్రెస్ అగ్రనేతలతో కలసి ఎల్బీ స్టేడియానికి వచ్చారు. గవర్నర్ తమిళిసై సీఎంగా రేవంత్‌తో, ఇతర మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారాలు ముగిశాక గవర్నర్, ఏఐసీసీ నేతలు వెళ్లిపోగా.. రేవంత్ ప్రజలను ఉద్దేశించి సీఎంగా తొలి ప్రసంగం చేశారు. తర్వాత మళ్లీ తాజ్ కృష్ణ హోటల్‌కు వెళ్లారు. ఏఐసీసీ పెద్దలతో కలసి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లి వీడ్కోలు పలికారు. అనంతరం రేవంత్‌రెడ్డి సచివాలయానికి వచ్చారు. గౌరవ వందనం స్వీకరించి, సచివాలయమంతా కలియతిరిగారు. సీఎం చాంబర్‌లో లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత తొలి కేబినెట్ భేటీ నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై మంత్రివర్గం చర్చించింది. ఇక శనివారం అసెంబ్లీ సమావేశం నిర్వహించి కొత్త ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

• ఫస్ట్ డే



దివ్యాంగురాలు రజినికి నియామక పత్రం ఇస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, సీఎస్ శాంతికుమారి

అభయహస్తంపై తొలి సంతకం

రెవెన్యూ గ్రామంగా జయశంకర్ ఊరు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ఇంద్రవెల్లి గ్రామంలో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం సుందరీకరణ, అభివృద్ధి కోసం ఎకరం భూమి కేటాయింపు

• కంచె కట్



ప్రజాభవన్ ఎదుటి ఇనుప కంచె తొలగింపు 14లో

సామాజిక 'కూర్పు'
- తొలి విడత కేబినెట్‌లో అన్ని సామాజిక వర్గాలకూ అవకాశం.. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాతినిధ్యం -2లో

మేం మీ సేవకులం..
సీఎంగా తన తొలి ప్రసంగంలో రేవంత్‌రెడ్డి

ప్రజల ఆలోచనలతో సంక్షేమ రాజ్యం 2లో

నేడు ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్

బీజేఎల్పీ నేతగా రాజాసింగ్?



- ఉప నాయకుడిగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి?
- కొత్త ఎమ్మెల్యేలకు పార్టీ విప్‌లు, ఇతర పదవులు

- వివరాలు 10లో

జీవన్‌రెడ్డికి షాక్‌ల మీద షాక్‌లు
ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యేకు ఏకకాలంలో ఆర్టీసీ, ట్రాన్స్‌కో నోటీసులు



- జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి పేరిట ఆర్టీసీతో లీజ్ అగ్రిమెంట్
- టీఎస్ఆర్టీసీకి అద్దె రూపంలో రూ.7 కోట్ల 23 లక్షల బకాయి
- ట్రాన్స్‌కోకు రూ. 2 కోట్ల 57 లక్షల బకాయి
- వాటిని వెంటనే చెల్లించాలని తాఖీదులు
- విద్యుత్ సరఫరా నిలిపివేసిన ట్రాన్స్‌కో

10లో



'ధరణి' పోర్టల్‌లో దొంగలు పడ్డారు!
- రంగారెడ్డి జిల్లాలో భారీ భూ బాగోతం
- అక్టోబర్ 14 నుంచి నవంబర్ 11 మధ్య 98 దరఖాస్తులకు ఆమోదం
- కలెక్టర్ అనుమతి, క్షేత్రస్థాయి రిపోర్టు లేకుండా వ్యవహారం
- ఇద్దరు ఉద్యోగులపై వేటు.. పోలీసులకు ఫిర్యాదు

14లో

సీఎం ముఖ్యకార్యదర్శిగా వి.శేషాద్రి



- ఇంటెలిజెన్స్ విభాగాధిపతిగా బి.శివధర్‌రెడ్డి
- సొంత జట్టు కూర్పుపై రేవంత్ దృష్టి
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

- వివరాలు 3లో

లోక్‌సభ ఎన్నికలకు కొత్త ఓటర్ల జాబితా
ప్రత్యేక సవరణ-2024 షెడ్యూల్ ప్రకటించిన ఈసీ



- 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- జనవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ

- వివరాలు 10లో

ఇదం జగత్



మీరు కనిపిస్తే చాలు పారిపోతున్నార్సార్! అప్పు అడుగుతారనుకుంటున్నట్లున్నారు!

మేలో ఎంసెట్!

ఇదే నెలలో అన్ని ప్రవేశ పరీక్షలు నిర్వహించేందుకు కసరత్తు
వీసీలతో ఉన్నతాధికారుల సమావేశం.. వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం (2024)లో నిర్వహించాల్సిన ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ప్రవేశ పరీక్షల కన్వీనర్ల ఎంపికకు సంబంధించిన అర్హులైన వారి జాబితాలను ఆయా వర్సిటీల వీసీలు ఉన్నత విద్యామండలికి పంపాల్సి ఉంటుంది. దీనిపై అన్ని స్థాయిల్లో చర్చించి, పరీక్షల షెడ్యూల్ ఖరారు చేస్తారు. మండలి పరిధిలో ఎంసెట్, ఎడ్‌సెట్, ఐసెట్, ఈసెట్, లాసెట్, పాలిసెట్, పీజీ సెట్ ఉంటాయి. సాధారణంగా వీటిని మే నెల నుంచి మొదలు పెడతారు. వీటిల్లో ఎంసెట్ కీలకమైంది. కేంద్రస్థాయిలో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ తేదీలు ఇప్పటికే ఖరారయ్యాయి. జనవరి, ఏప్రిల్ నెలల్లో మెయిన్స్, ఆ తర్వాత అడ్వాన్స్‌డ్ చేపట్టాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయించింది. దీని తర్వాత జాతీయ ఇంజనీరింగ్, ఐఐటీల్లో సీట్ల భర్తీకి జోసా కౌన్సెలింగ్ చేపడుతుంది. దీన్ని పరిగణనలోనికి తీసుకునే ఎంసెట్ తేదీలు ఖరారు చేస్తారు. కోవిడ్ సమయం నుంచి జేఈఈతో పాటు, ఎంసెట్ కూడా ఆలస్యంగా జరిగాయి. గత ఏడాది మాత్రం సకాలంలో నిర్వహించారు. ఇప్పుడూ ప్రతిబంధకం లేకపోవడంతో మే



నెలలోనే ఎంసెట్ చేపట్టాలని అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. ఎంసెట్ సిలబస్, ఇంటర్ మార్కుల వెయిటేజీపై మండలి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కోవిడ్ కాలంలో ఇంటర్ పరీక్షలు లేకపోవడంతో వెయిటేజీని ఎత్తివేశారు. ఆ తర్వాత ఇంటర్ పరీక్షలు జరిగినా వెయిటేజీ ఇవ్వలేదు. ఈ ఏడాది కూడా వెయిటేజ్ లేకుండా చేయడమా? అనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, కొత్త విద్యాశాఖ మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఏదేమైనా వారం రోజుల్లో అన్ని సెట్స్‌పైన స్పష్టమైన విధానం వెల్లడించే వీలుందని కౌన్సిల్ వర్గాలు తెలిపాయి.



ఎల్బీ స్టేడియంలో ఓపెన్ టాప్ జీపులో నిలబడి రేవంత్‌రెడ్డితో కలసి ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న సోనియాగాంధీ



ప్రమాణస్వీకారం అనంతరం వేదికపై ఉన్న సోనియా ఆశీర్వాదం కోసం సతీమణితో వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



వేదికపై చిరునవ్వులు చిందిస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ, సోనియాగాంధీ



సీఎం ప్రమాణస్వీకారోత్సవానికి హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

క్లుప్తంగా...

తెలంగాణ ప్రగతికి తోడ్పాటు

రేవంత్‌కు మోదీ అభినందనలు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ప్రగతికి అన్నివిధాలా సహకారం అందిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. 'తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి అభినందనలు. రాష్ట్ర ప్రగతికి, పౌరుల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తానని నేను హామీ ఇస్తున్నాను'.. అని మోదీ పేర్కొన్నారు.

మీ సహకారం కావాలి: రేవంత్‌రెడ్డి
ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ప్రధాని సహకారం ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.

కొత్త ప్రభుత్వానికి ఏపీ సీఎం జగన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొలువు దీరిన కొత్త ప్రభుత్వానికి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, మంత్రులకు శుభాకాంక్షలు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు గురువారం సీఎం జగన్ ట్వీట్ చేశారు.

సీఎం రేవంత్‌కు హరీశ్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులకు ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.

మలి విడతలో మరికొందరికి చాన్స్

రాజగోపాల్‌రెడ్డికి హైకమాండ్ భరోసా

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరిగే రాష్ట్ర కేబినెట్ విస్తరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అవకాశం ఇవ్వనున్నారు. ఈ మేరకు గురువారం పార్టీ ముఖ్య నాయకులు రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడి భరోసా ఇచ్చారు. గురువారం నాటి విస్తరణలో ఆయనకు అవకాశం ఇవ్వటం లేదని, త్వరలో జరిగే మలివిడత విస్తరణలో చాన్స్ ఉంటుందని ఏఐసీసీ ముఖ్య నాయకులు రాజగోపాల్‌రెడ్డికి చెప్పారు. త్వరలో జరిగే విస్తరణలో ఆదిలాబాద్, నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి కూడా మరికొందరిని కేబినెట్‌లోకి తీసుకోనున్నారు.

సీఎం రేవంత్‌కు జాజుల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతిభవన్‌ను సామాజిక సంఘసంస్కర్త, మహాత్మా జ్యోతిబాపూలే భవన్‌గా పేరు మార్చడాన్ని స్వాగతిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పట్నానికి ప్రజా జాతర

సాక్షి, హైదరాబాద్: ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన రేవంత్‌రెడ్డి సీఎం పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవం ప్రజా జాతరను తలపించింది. ఈ కార్యక్రమానికి పార్టీ ఢిల్లీ పెద్దలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, మంత్రులు, పార్టీ బాధ్యులు కూడా హాజరు కావడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర నలు మూలల నుంచి నగరానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చాయి. దారిపొడవునా సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలతో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో త్రివర్ణ రంజితమైంది. ఎల్బీ స్టేడియం లోపల, బయట జై సోనియా, జై కాంగ్రెస్.. జై రేవంత్ అనే నినాదాలతో హోరెత్తింది. 'మూడు రంగుల జెండా పట్టి'.. అనే పాట పార్టీ శ్రేణులో జోష్ నింపింది. కాగా.. రాష్ట్రాల్లో సీఎంల పదవీ ప్రమాణ స్వీకారానికి పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ హాజరు కావడం గమనార్హం. ప్రమాణ స్వీకారానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖ్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల మంత్రులు, పీసీసీ అధ్యక్షులు హాజరయ్యారు.

రేవంత్‌రెడ్డి అనే నేను..

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

మరో 11 మంది మంత్రులతోనూ ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళిసై



ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గురువారం మధ్యాహ్నం 1:19 గంటలకు ఆయనతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణం చేయించారు. రేవంత్‌తో పాటు ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, కేబినెట్ మంత్రులుగా ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు ప్రమాణం చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ, కర్ణాటక, హిమాచల్ సీఎంలు సిద్ధరామయ్య, సుఖ్విందర్‌సింగ్ సుక్కు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

పవిత్ర హృదయంతో అంటూ ఇద్దరు.. ఒకరు ఇంగ్లిష్‌లో..

సీఎం రేవంత్‌రెడ్డితోపాటు 9 మంది మంత్రులు దైవసాక్షిగా ప్రమాణం చేయగా.. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క మాత్రం పవిత్ర హృదయంతో అంటూ ప్రతిజ్ఞ చేశారు. దామోదర రాజనర్సింహ ఇంగ్లిష్‌లో, మిగతా అందరూ తెలుగులో ప్రమాణం చేశారు. మధ్యాహ్నం 1:04 గంటలకు రేవంత్ ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉన్నా కొంత ఆలస్యమైంది. ట్రాఫిక్ సమస్య కారణంగా గవర్నర్ 1:17 గంటలకు సభా వేదిక వద్దకు వచ్చారు. రేవంత్ వేదిక దిగి వెళ్లి ఆమెకు స్వాగతం పలికారు. ఆ వెంటనే ప్రమాణ స్వీకారాలు మొదలయ్యాయి. 28 నిమిషాల పాటు కొనసాగిన ఈ కార్యక్రమం 1:46 గంటలకు ముగిసింది. తర్వాత గవర్నర్ తమిళిసై, కాంగ్రెస్ అగ్రనేతలు వెళ్లిపోయారు.

ఓపెన్ టాప్ జీపులో.. కలియదిరిగి..

సోనియాగాంధీతో కలసి రేవంత్‌రెడ్డి ఓపెన్‌టాప్ జీప్‌లో ఎల్బీ స్టేడియంలోకి వచ్చారు. సోనియా గాంధీ ముందు నిలబడగా.. ఆమెకు కాస్త వెనుకగా రేవంత్ నిలబడి స్టేడియంలో కలియదిరిగారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు. తర్వాత రేవంత్ స్వయంగా సోనియాను తోడ్కొని వేదికపైకి వచ్చారు. రాహుల్, ప్రియాంక నడుచుకుంటూ, ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. కార్యక్రమం ముగిశాక సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గేలకు రేవంత్ స్వయంగా వీడ్కోలు పలికారు. తర్వాత మళ్లీ వేదికపైకి వచ్చి ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగం చేశారు.

అగ్రనేతలతో.. ఒకే వాహనంలో..

గురువారం ఉదయం రేవంత్‌రెడ్డి తన నివాసం నుంచి బయలుదేరి పెద్దమ్మ గుడికి వెళ్లారు. అక్కడ పూజలు చేసిన తర్వాత తాజ్‌కృష్ణ హోటల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌గా ఎల్బీ స్టేడియానికి బయలుదేరారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకలతో కలసి రేవంత్ ఒకే వాహనంలో కూర్చున్నారు. సోనియా సభా వేదికపై వచ్చాక రేవంత్‌రెడ్డి మనువరాలిని చూసి ముద్దాడారు. ప్రమాణ స్వీకారాలు ముగిశాక.. రేవంత్‌రెడ్డి వేదికపైనే ఉన్న తన సతీమణితో కలసి సోనియా దగ్గరికి వెళ్లి పాదాభివందనం చేశారు. తన కుమార్తెను, అల్లుడిని సోనియా, రాహుల్, ప్రియాంకలకు పరిచయం చేశారు.

సీతక్క.. హోరెత్తిన స్టేడియం

మంత్రులందరిలో సీతక్క ప్రమాణ స్వీకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రిగా సీతక్క పేరు ప్రకటించగానే ఎల్బీ స్టేడియం మొత్తం హర్షధ్వానాలతో హోరెత్తింది. ఆ హోరులో సీతక్క ఒక నిమిషం పాటు ఆగిపోవాల్సి వచ్చింది. ఇది చూసి వేదికపై ఉన్న పెద్దలు, నేతలంతా ఆశ్చర్యపోయారు. ప్రమాణం కొనసాగించాలంటూ గవర్నర్ తమిళిసై సైగ చేయడంతో సీతక్క ఆ హోరులోనే ప్రమాణ స్వీకారం కొనసాగించారు. తర్వాత సోనియా వద్దకు వెళ్లి పాదాభివందనం చేశారు. సోనియా లేచి నిలబడి సీతక్కను హత్తుకుని అభినందించారు.

ప్రమాణ స్వీకారం.. పదనిసలు

- గురువారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు.
- ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మొదట, చివరిలో నల్లగొండ గద్దర్ స్వయంగా రాసి, పాడిన 'మూడు రంగుల జెండా పట్టి' పాట పార్టీ శ్రేణులకు హుషారెక్కించింది.
- సాధారణంగా ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దూరంగా ఉండే సోనియాగాంధీ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరే సందర్భంగా హాజరవడం గమనార్హం. గురువారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆమెతోపాటు, రాహుల్, ప్రియాంక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
- మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రతి ఒక్కరిని రేవంత్‌రెడ్డి దగ్గరికి తీసుకుని శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత మంత్రులు వేదికపై ఉన్న సోనియా, రాహుల్, ప్రియాంక, ఇతర అగ్రనేతలకు మర్యాదపూర్వకంగా నమస్కరించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రతి మంత్రిని భుజం తట్టి ఆశీర్వదించారు.
- ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరయ్యారు.
- రేవంత్ ప్రసంగిస్తూ.. 'ఇక్కడ ప్రమాణ స్వీకారం జరుగుతుంటే, అక్కడ ప్రగతిభవన్ చుట్టూ ఉన్న కంచెలు బద్దలుగొట్టాం. ఇకపై అందరూ ప్రగతిభవన్‌కు రావొచ్చు' అని పేర్కొన్నారు. ఈ సమయంలో స్టేడియం మొత్తం చప్పట్లతో మారుమోగింది.
- ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారానికి వస్తున్న పలువురు ప్రముఖుల వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. కాగా,ఏపీకి చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీ జెండాలు పట్టుకొని స్టేడియంలో హల్‌చల్ చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై కాంగ్రెస్ కార్యకర్తలు మండిపడుతూ.. టీడీపీ కార్యకర్తలను చితకబాదడంతో అక్కడి నుంచి పారిపోయారు. కాంగ్రెస్ సభలో టీడీపీ జెండాలు ఏమిటని, మళ్లీ టీడీపీ జెండాలు కనిపిస్తే పీకి పారేయాలని సీనియర్ లీడర్లు కార్యకర్తలకు సూచించారు.

సామాజిక 'కూర్పు'

- తొలి విడత కేబినెట్‌లో అన్ని సామాజిక వర్గాలకూ అవకాశం
- ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాతినిధ్యం
- ఎమ్మెల్యే లేకపోవడంతో మైనార్టీలకు దక్కని స్థానం
- రెడ్డి సామాజిక వర్గం నుంచి సీఎంతో పాటు మరో ముగ్గురు మంత్రులు
- ఎస్సీల నుంచి ఇద్దరు, బ్రాహ్మణ, కమ్మ, వెలమ, ఎస్టీ వర్గాలకు ఒక్కో బెర్తు
- ఇద్దరు బీసీలకు అవకాశం..12 మందిలో ఇద్దరు మహిళలు
- తొలిసారి మంత్రులుగా భట్టి, పొంగులేటి, పొన్నం, సీతక్క
- మంత్రి కాకుండానే సీఎంగా రేవంత్, డిప్యూటీ సీఎంగా భట్టి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నూతన కేబినెట్‌ను సామాజిక కోణంలో ఏర్పాటుచేసినట్టు స్పష్టమవుతోంది. సీనియార్టీ ప్రాతిపదికతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన నేతలతో తొలిదఫా మంత్రివర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారు. కొత్త కేబినెట్‌లో దళిత వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు మల్లు భట్టి విక్రమార్కకు మాత్రమే డిప్యూటీ సీఎం హోదా కల్పించారు. కనీసం ఇద్దరికి ఈ హోదా వస్తుందనే ప్రచారం జరిగినప్పటికీ రేవంత్‌రెడ్డితో పాటు సీఎం పదవి కోసం పోటీ పడిన భట్టికి మాత్రమే ఈ హోదా లభించడం గమనార్హం .ఇక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు మంత్రులుగా ప్రమాణం చేశారు. దీంతో సీఎంతో కలిపి నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకు కేబినెట్‌లో అవకాశం లభించినట్లైంది. కొండా సురేఖ (పద్మశాలి), పొన్నం ప్రభాకర్ (గౌడ్) లను బీసీ వర్గాల నుంచి ఎంపిక చేయగా, దళిత వర్గాల నుంచి దామోదర రాజనర్సింహకు కూడా అవకాశం ఇచ్చారు. ఇక దుద్దిళ్ల శ్రీధర్‌బాబు (బ్రాహ్మణ), తుమ్మల నాగేశ్వరరావు (కమ్మ), జూపల్లి కృష్ణారావు (వెలమ), ధనసరి అనసూయ (ఎస్టీ)లకు మంత్రిమండలిలో స్థానం లభించింది. మొత్తం మీద అగ్రవర్ణాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మొత్తం 12 మందితో తెలంగాణ మంత్రిమండలి కొలువు దీరడం విశేషం. కాగా వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన ఒక్కరు కూడా ఈ ఎన్నికల్లో గెలవకపోవడంతో తొలి దఫా కేబినెట్‌లో ఆ వర్గానికి స్థానం లభించలేదు.

నాలుగు జిల్లాలకు నో..

జిల్లాల వారీగా పరిశీలిస్తే రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు గాను 6 జిల్లాల నేతలకు మాత్రమే కేబినెట్‌లో ప్రాతినిధ్యం లభించింది. ఖమ్మం నుంచి ముగ్గురు, నల్లగొండ నుంచి ఇద్దరు, మహబూబ్‌నగర్ నుంచి సీఎంతో కలిపి ఇద్దరు, కరీంనగర్ నుంచి ఇద్దరు, వరంగల్ నుంచి ఇద్దరు, మెదక్ నుంచి ఒకరు మంత్రులుగా ప్రమాణం చేశారు. హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందకపోవడంతో ఆ జిల్లాకు అవకాశం లభించలేదు. రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలా బాద్ జిల్లాల నుంచి పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ వారికి తొలి విడతలో అవకాశం ఇవ్వలేదు. కేబి నెట్‌లో మరో 17 మంది మంత్రులుగా ఉండే అవ కాశం ఉండగా ప్రస్తుతం 12 మంది ప్రమాణం చేశారు. ఖాళీగా ఉన్న ఆరు బెర్తులను వీలును బట్టి భర్తీ చేస్తారని, పూర్తిస్థాయి కేబినెట్ కొలువు తీరేలోపు అన్ని సామాజిక వర్గాలు, ప్రాంతాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెపుతున్నాయి.

ఫస్ట్ టైమర్స్ నలుగురు..

భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క మొదటిసారి మంత్రులయ్యారు. ఇక రేవంత్‌రెడ్డి కూడా ఇంతకుముందు మంత్రిగా పని చేయకుండానే ఏకంగా సీఎం కావడం గమనార్హం. జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా పని చేసిన ఆయన ఇప్పటివరకు రాష్ట్ర మంత్రి పదవి బాధ్యతలు మాత్రం నిర్వర్తించలేదు. ఇక డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన భట్టి ఆంధ్రాబ్యాంక్ డైరెక్టర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్, సీఎల్పీ నేత పదవుల్లో పనిచేశారు. ఒక్కసారి కూడా మంత్రి కాకుండానే ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. పొంగులేటి, పొన్నం ఎమ్మెల్యేలుగా ఎన్నికవడం కూడా తొలిసారే కావడం గమనార్హం.

'అభయ హస్తం'పై తొలి సంతకం

- ఆరు గ్యారంటీలకు మార్గం సుగమం చేస్తూ సంతకం చేసిన రేవంత్
- దివ్యాంగురాలు రజనికి విత్తన ధ్రువీకరణ సంస్థలో ప్రాజెక్టు మేనేజర్‌గా కాంట్రాక్టు ఉద్యోగం
- సీఎం మాట నిలబెట్టుకున్నారంటూ కృతజ్ఞతలు తెలిపిన రజని కుటుంబ సభ్యులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక రేవంత్‌రెడ్డి 'అభయ హస్తం' ఫైలుపై తొలి సంతకం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 6 గ్యారంటీల హామీల అమలును సుగమం చేసేలా దానిని రూపొందించారు. గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగురాలు రజనికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తూ నియామక పత్రాలను సీఎస్ శాంతికుమారితో కలసి రేవంత్‌రెడ్డి అందజేశారు.

మాట నిలబెట్టుకున్న సీఎం: హైదరాబాద్‌లోని న్యూ బోయిగూడ కమాన్ ప్రాంతానికి చెందిన వెంకటస్వామి కుమార్తె రజని. అక్టోబర్ 17న గాంధీ భవన్‌కు వచ్చిన ఆమె.. తన వైకల్యం వల్ల ఉద్యోగం దొరకడం లేదని, ఆదుకోవాలని రేవంత్‌రెడ్డికి విన్నవించుకున్నారు. ఆమె వివరాలు తెలుసుకున్న రేవంత్.. అధికారంలోకి రాగానే ఉద్యోగం ఇస్తామని మాటిచ్చారు. గురువారం రేవంత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక.. రజనిని వేదికపైకి ఆహ్వానించి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఆమెకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థలో ప్రాజెక్టు మేనేజర్‌గా నెలకు రూ.50వేల వేతనంతో కాంట్రాక్టు ఉద్యోగం ఇచ్చారు. మాటను నిలబెట్టుకున్నారంటూ సీఎం రేవంత్‌కు రజని, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రుల శాఖలపై గందరగోళం

- ఫలానా మంత్రికి ఫలానా శాఖ అంటూ ప్రచారం
- అలాంటిదేమీ లేదని కాంగ్రెస్ వర్గాల వివరణ
- నేడు కేటాయించే అవకాశం

సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వంలోని 11 మంది మంత్రులు ప్రమాణం చేసినప్పటికీ వారికి గురువారం ఎలాంటి శాఖలు కేటాయించలేదు. ముఖ్యమంత్రి రేవంత్ అభీష్టం మేరకు జరిగే శాఖల కేటాయింపు అధికారికంగా జరగకపోవడం గమనార్హం. వాస్తవానికి, మంత్రులు ప్రమాణం చేసిన రోజునే సాయంత్రానికి సాధారణ పరిపాలన శాఖ ఆయా మంత్రులకు కేటాయించిన శాఖలపై అధికారిక ఉత్తర్వులు జారీ చేస్తుంది. కానీ నూతన ప్రభుత్వంలో అలా జరగలేదు. మధ్యాహ్నం 2 గంటల లోపే ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసినప్పటికీ రాత్రి వరకు ఇలాంటి ఉత్తర్వులేవీ రాలేదు. ఈలోపే ఫలానా మంత్రికి ఫలానా శాఖ కేటాయించారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ఈ ప్రచారం ఆధారంగా పలువురు మంత్రుల అనుచరులు, సన్నిహితులు తమ నేతకు ఫలానా శాఖ కేటాయించారనే నిర్ధారణకు వచ్చారు. కానీ అలాంటిదేమీ లేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు నిజం కావని తెలిపాయి. 'ప్రభుత్వంలోని మంత్రులకు శాఖలు కేటాయించినట్టు వస్తున్న వార్తలు అవాస్తవం. ప్రభుత్వం ఇంకా మంత్రులకు శాఖలు కేటాయించలేదు. శాఖల కేటాయింపు వార్తలను ప్రజలు నమ్మొద్దు. మంత్రులకు శాఖల కేటాయింపు విషయంలో ప్రభుత్వం ఆదేశాలిస్తుంది. ఆ ఆదేశాలు జారీ చేసేంతవరకు శాఖల కేటాయింపుపై ప్రచారాలు నమ్మవద్దు.' అని గాంధీభవన్ నుంచి ప్రకటన వెలువడింది. కాగా కొత్త మంత్రులకు శుక్రవారం శాఖల కేటాయింపు జరిపే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

మేం మీ సేవకులం..

- ప్రజల ఆలోచనలు, అభివృద్ధిని మిళితం చేసి సంక్షేమ రాజ్యం తెస్తాం
- ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగంలో రేవంత్‌రెడ్డి
- ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని బాధ్యతగా వినియోగిస్తా..
- కాంగ్రెస్ తానే సమిధగా మారి తెలంగాణ ఏర్పాటు చేసింది
- నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఇన్నాళ్లు మౌనంగా భరించారు
- ప్రగతిభవన్ చుట్టూ ఇనుప కంచెలను పగలగొట్టి ప్రజాభవన్ చేశాం
- నేడు ఉదయం అక్కడ ప్రజా దర్బార్ నిర్వహిస్తాం
- ప్రజలెవరైనా వచ్చి తమ ఆలోచనలు, ఆకాంక్షలు పంచుకోవచ్చు
- విద్యార్థి, నిరుద్యోగ, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేస్తాం
- కాంగ్రెస్ కార్యకర్తల శ్రమను, కష్టాన్ని గుర్తుపెట్టుకుంటానని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: తాము పాలకులం కాదని, సేవకులమని.. తమ ప్రజా ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములుగా పాలన సాగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సేవ చేసేందుకు ప్రజలు తమకు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా, ఎంతో గౌరవంగా నిర్వర్తిస్తానని చెప్పారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని, తెలంగాణ నలుమూలలా సమాన అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. పోరాటాలు, త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో దశాబ్దకాలంగా ప్రజాస్వామ్యం హత్యకు గురైందని, మానవ హక్కులకు భంగం కలిగిందని ఆరోపించారు. అందుకే ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుండగానే ప్రగతిభవన్ గడీ చుట్టూ నిర్మించిన ఇనుప కంచెలను బద్దలు కొట్టామని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలను, ఆలోచనలను, అభివృద్ధిని మిళితం చేసి తెలంగాణను సంక్షేమ రాజ్యంగా మారుస్తామన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"మిత్రులారా.. తెలంగాణ ఆషామాషీగా ఏర్పడ్డ రాష్ట్రం కాదు. పోరాటాలతో, త్యాగాల పునాదులపై ఏర్పడింది. ఎన్నో ఆకాంక్షలు, ఎన్నో ఆలోచనలతో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు స్వేచ్ఛనివ్వాలని, సామాజిక న్యాయం చేయాలని, ఆసిఫాబాద్ నుంచి అలంపూర్ వరకు, ఖమ్మం నుంచి కొడంగల్ వరకు సమాన అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో సోనియాగాంధీ ఉక్కు సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఏర్పాటు చేసింది. కానీ దశాబ్దకాలంగా తెలంగాణలో ప్రజాస్వామ్యం హత్యకు లోనైంది. మానవహక్కులకు భంగం కలిగింది. ఈ ప్రాంతంలో ప్రజలు బాధలు చెప్పుకొందామనుకున్నా.. ప్రభుత్వం నుంచి వినేవారు లేక దశాబ్దకాలంగా మౌనంగా భరించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు తమ ఆలోచనను ఉక్కు సంకల్పంగా మార్చి, ఎన్నికల్లో ఎన్నో త్యాగాలు చేసి, తమ రక్తాన్ని చెమటగా మార్చి, భుజాలు కాయలు కాసేలా కాంగ్రెస్ పార్టీ జెండాను మోశారు.

తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది

ప్రజల రాజ్యాన్ని, ప్రజల పరిపాలనను అందించడానికి.. తెలంగాణ రైతాంగం, విద్యార్థి, నిరుద్యోగ యువత, ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఇందిరమ్మ రాజ్యం ప్రతినబూనింది. ఈ ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు ప్రక్రియతో తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. కొత్త మంత్రివర్గంతో తెలంగాణ ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుంది. కొత్త ప్రభుత్వంలో నలుమూలలా సమాన అభివృద్ధి జరుగుతుంది. ఇక్కడ ప్రమాణస్వీకారం మొదలైనప్పుడే గడీగా ఏర్పాటు చేసుకున్న ప్రగతిభవన్ చుట్టూ నిర్మించుకున్న ఇనుప కంచెలను బద్దలు కొట్టించాం. ఈ వేదికపై నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాట ఇస్తున్నా.. నా తెలంగాణ కుటుంబం ఎప్పుడు రావాలనుకున్నా నిరభ్యంతరంగా ప్రగతిభవన్‌లోకి ప్రవేశించి తమ ఆలోచనలు, ఆకాంక్షలు, అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వంలో మీరు భాగస్వాములు. మీ ఆలోచనలను, ఈ ప్రాంత అభివృద్ధిని మిళితం చేసి సంక్షేమ రాజ్యంగా, అభివృద్ధి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే బాధ్యత మీ అభిమాన నేతగా, మీ రేవంతన్నగా నేను తీసుకుంటా. మాట నిలబెట్టుకుంటా.

కార్యకర్తలకు అండగా ఉంటా..

కాంగ్రెస్ ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం, సోనియా అండతో, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో, రాహుల్‌గాంధీ సూచనలతో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తాం. ఈ ప్రభుత్వం ఏర్పడేందుకు లక్షలాది మంది కార్యకర్తలు ప్రాణాలను త్యాగం చేసేందుకు సిద్ధమయ్యారే తప్ప మువ్వన్నెల జెండాను విడిచిపెట్టలేదు. మీ కష్టాన్ని, శ్రమను గుర్తుపెట్టుకుంటా. గుండెల నిండా మీరిచ్చిన శక్తిని నింపుకొని ఈ పదేళ్లు కష్టపడ్డ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత తీసుకుంటా" అని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణకు పట్టిన చీడ నుంచి విముక్తి కలిగించిన ప్రజలకు, కాంగ్రెస్ జాతీయ నేతలు, సీఎంలు, రాజకీయ పార్టీల నేతలు, సహచర ఎంపీలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. జై కాంగ్రెస్.. జై సోనియమ్మ అంటూ ప్రసంగాన్ని ముగించారు.

ప్రజాభవన్‌లో ప్రజా దర్బార్

ప్రగతిభవన్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను ఈరోజు బద్దలు కొట్టాం. రేపు (శుక్రవారం) ఉదయం పదిగంటలకు జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహిస్తాం. తెలంగాణలోని ప్రతి ఒక్కరి హక్కులను కాపాడుతాం. అభివృద్ధి కోసం శాంతిభద్రతలను కాపాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంతోనే పోటీపడేలా చేస్తాం. పేదలకు, నిస్సహాయులకు సహాయకారిగా ఉంటాం. నిస్సహాయులెవరూ తమకెవరూ లేరని, తమకే దిక్కూ లేదని అనుకునే పరిస్థితి రానివ్వం. మీ సోదరుడిగా, మీ బిడ్డగా మీ బాధ్యతలను నేను నిర్వహిస్తా. ఈ రోజు నుంచి విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంది.



ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం సభావేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సభ్యులతో కలసి గ్రూప్ ఫొటో దిగుతున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్. చిత్రంలో కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క


ప్రమాణ స్వీకారానికి బయలుదేరే ముందు ఇంట్లోని పూజ గదిలో ఉన్న వైఎస్ చిత్రపటానికి నమస్కరిస్తున్న భట్టి

సీఎం కుర్చీలో రేవంత్

- సచివాలయంలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో బాధ్యతల స్వీకారం
- సతీమణి గీతతో కలసి ప్రత్యేక పూజలు
- సచివాలయంలోకి జర్నలిస్టుల ప్రవేశంపై ఆంక్షలు ఎత్తివేత


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఎం రేవంత్


అధికారులతో కలిసి సచివాలయంలోకి వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్, డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో లాంఛనంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. సాయంత్రం 4.20 గంటలకు సతీమణితో కలసి సచివాలయానికి చేరుకున్న రేవంత్‌కు.. ప్రధానద్వారం వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, పలువురు ఉన్నతాధికారులు పోలీసు అధికార బ్యాండ్ మోగుతుండగా ఘనంగా స్వాగతం పలికారు. రేవంత్ అక్కడి నుంచి నడుచుకుంటూనే సచివాలయం లోపలికి వెళ్లారు. సీఎం చాంబర్ వద్ద ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తర్వాత సతీమణి గీతతో కలసి రేవంత్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం సాయంత్రం 4.46 నిమిషాలకు ముఖ్యమంత్రి అధికారిక కుర్చీలో ఆసీనులయ్యారు. సీఎం దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతిధులు సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత సచివాలయంలోనే రేవంత్ అధ్యక్షతన నూతన మంత్రివర్గ తొలి సమావేశం జరిగింది.

తెరుచుకున్న సచివాలయం ద్వారాలు

రాష్ట్ర నూతన సచివాలయం ద్వారాలు గురువారం ప్రజలందరి కోసం తెరుచుకున్నాయి. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక సచివాలయానికి వస్తారని తెలియడంతో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సచివాలయానికి చేరుకున్నారు. అధికారులు పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలకు పాస్‌లు ఇచ్చి లోపలికి అనుమతించారు. దీంతో సచివాలయం లోపల సందడి కనిపించింది. తొలిసారిగా జర్నలిస్టులను పాస్‌ల అవసరం లేకుండా మీడియా గుర్తింపు కార్డులు చూసి కొత్త సచివాలయంలోకి అనుమతించారు. గతంలో సచివాలయంలోకి జర్నలిస్టుల ప్రవేశంపై పెట్టిన ఆంక్షలను ఎత్తివేయడం, ప్రధాన భవనం లోపలే మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించడంపై మీడియా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మహానేతను తలచుకొని..

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్, సాక్షి ప్రతినిధి, ఖమ్మం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద పూజలు చేసి మొక్కుకుని ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు భట్టి విక్రమార్క. తెలంగాణ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేందుకు ముందు ఆయన బంజారాహిల్స్‌లోని తన నివాసంలోని పూజగదిలో ఉన్న దేవుళ్ల ఫొటోలతో పాటు మహానేత వైఎస్ చిత్రపటానికి సతీమణి నందినితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన రాజకీయ గురువైన వైఎస్‌ను తలుచుకుని ఫొటోకు దండం పెట్టుకుని గురుభక్తిని చాటుకున్నారు. అనంతరం తెలంగాణ మంత్రిమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు భట్టి ఘన స్వాగతం పలికారు. హోటల్ తాజ్‌కృష్ణాలో వారిని కలిసి డిప్యూటీ సీఎంగా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎల్పీ కార్యాలయానికి భట్టి

ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) కార్యాలయానికి వచ్చారు. సీఎల్పీ కార్యదర్శి పూర్ణబోధ శ్రీకాంత్, స్వాగతం పలకగా, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, ఎం.కోదండరెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి భట్టిని అభినందించారు.

స్పీకర్‌గా గడ్డం ప్రసాద్?

- డిప్యూటీ స్పీకర్‌గా రాజ్‌ఠాకూర్!
- ప్రొటెం స్పీకర్‌గా కేసీఆర్ కాదంటే అక్బరుద్దీన్ ఒవైసీ!



సాక్షి, హైదరాబాద్: శాసనసభ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అధికారపక్షం ప్రతిపాదించే అవకాశాలున్నాయి. దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రసాద్‌కుమార్ గతంలో మంత్రిగా పనిచేశారు. కేబినెట్ విస్తరణలో రంగారెడ్డికి ప్రాతినిధ్యం దక్కలేదు. దీంతో ఆ జిల్లాకు తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రసాద్‌ను స్పీకర్‌గా ప్రతిపాదించే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది. డిప్యూటీ స్పీకర్‌గా బీసీ వర్గాలకు చెందిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ పేరు వినిపిస్తోంది. అసెంబ్లీలో సీనియర్ ఎమ్మెల్యేలను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం ఆనవాయితీ. మాజీ సీఎం కేసీఆర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిల తర్వాత ఎక్కువసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారిలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఉన్నారు. అయితే పోచారం తాజా మాజీగా కావడంతో కొన్ని సాంకేతిక కారణాలు అడ్డొస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేసీఆర్ కాదంటే అక్బరుద్దీన్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు.

ఇదీ అమాత్యుల బయోడేటా

మల్లు భట్టి విక్రమార్క



పుట్టిన తేదీ: జూన్ 15, 1961
స్వస్థలం: స్నానాల లక్ష్మీపురం, వైరా, ఖమ్మం జిల్లా.
విద్యార్హత: ఎంఏ
తల్లిదండ్రులు: మాణిక్యమ్మ – అఖిలాండ
భార్య, పిల్లలు: నందిని, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య
రాజకీయ నేపథ్యం: మధిర సెగ్మెంట్ నుంచి 2009 నుంచి వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఆయన సోదరులైన మల్లు అనంతరాములు, మల్లు రవిలు నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీలుగా ఎన్నికయ్యారు. అనంతరాములు పీసీసీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.
ఎమ్మెల్సీ: ఖమ్మం స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున 2007లో ఎమ్మెల్సీగా గెలిచారు.
ఎమ్మెల్యే: మధిర నుంచి 2009, 2014, 2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున వరుసగా గెలిచారు.
ఉమ్మడి ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్: 2009 నుంచి 2011
ఉమ్మడి ఏపీ డిప్యూటీ స్పీకర్: 2011 నుంచి 2014 వరకు
సీఎల్పీ నేత: 2019 నుంచి 2023
పార్టీ పదవులు: పీసీసీ కార్యదర్శి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

జూపల్లి కృష్ణారావు



పుట్టిన తేదీ: ఆగస్టు 10, 1955
స్వస్థలం: పెద్దదగడ, చిన్నంబావి మండలం (వనపర్తి జిల్లా)
విద్యార్హత: బీఏ
తల్లిదండ్రులు: జూపల్లి రత్నమ్మ – శేషగిరిరావు
భార్య, పిల్లలు: జె.సుజన, వరుణ్, అరుణ్
రాజకీయ నేపథ్యం: బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి కొంతకాలం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు.
ఎమ్మెల్యే: కొల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 1999 (కాంగ్రెస్), 2004 (స్వతంత్ర), 2009 (కాంగ్రెస్), 2012 ఉపఎన్నిక, 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
మంత్రి: 2009 నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య కేబినెట్‌లలో ఆహార, పౌరసరఫరాలు, తూనికలు – కొలతలు, వినిమయ వ్యవహారాల శాఖల మంత్రిగా, ఆ తర్వాత నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో దేవాదాయ, ధర్మాదాయ, వినియోగదారుల వ్యవహారాల శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014లో కేసీఆర్ కేబినెట్‌లో తొలుత ఐటీ, పరిశ్రమలు, ఆ తర్వాత పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేశారు.

కొండా సురేఖ


సోనియాను ఆలింగనం చేసుకుంటున్న కొండా సురేఖ

పుట్టిన తేదీ: 19 ఆగస్టు 1965
స్వస్థలం: వంచనగిరి, గీసుకొండ మండలం (వరంగల్ జిల్లా)
విద్యార్హత: బీకాం
తల్లిదండ్రులు: తుమ్మ రాధ – చంద్రమౌళి
భర్త: కొండా మురళీధర్ రావు మాజీ ఎమ్మెల్సీ
కూతురు: సుష్మితాపటేల్
రాజకీయ నేపథ్యం: 1995లో వంచనగిరి ఎంపీటీసీగా రాజకీయ జీవితం ప్రారంభించి గీసుకొండ ఎంపీపీ నుంచి మంత్రి దాకా ఆమె ప్రస్థానం కొనసాగింది.
ఎమ్మెల్యే: శాయంపేట సెగ్మెంట్ నుంచి 1999, 2004 (కాంగ్రెస్), పరకాల నుంచి 2009 (కాంగ్రెస్), వరంగల్ తూర్పు నుంచి 2014 (టీఆర్ఎస్), 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు.
మంత్రి: 2009 వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో శిశు మహిళా సంక్షేమ అభివృద్ధిశాఖ మంత్రి.
పార్టీ పదవులు: పీసీసీ సభ్యురాలు, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కోశాధికారి, ఏఐసీసీ సభ్యురాలు.

కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పుట్టిన తేదీ: జూన్ 20, 1962
స్వస్థలం: తాటిపాముల, తిరుమలగిరి మండలం (సూర్యాపేట జిల్లా)
విద్యార్హత: నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుంచి బీఎస్సీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. (సీనియర్ కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్నారు)
తల్లిదండ్రులు: ఉషాదేవి– పురుషోత్తంరెడ్డి
భార్య: పద్మావతి (కోదాడ ఎమ్మెల్యే)
రాజకీయ నేపథ్యం: రాష్ట్రపతి భవన్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసి 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరారు.
ఎమ్మెల్యే: 1999, 2004లో కోదాడ నుంచి, 2009, 2014, 2018, 2023 ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు
మంత్రి: ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు.
ఎంపీ: 2019 లోక్‌సభఎన్నికల్లో నల్లగొండ నుంచి ఎన్నిక
పార్టీ పదవులు: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ ప్రెసిడెంట్‌గా పనిచేశారు.

తుమ్మల నాగేశ్వరరావు



పుట్టిన తేదీ: మే 20, 1953, **స్వస్థలం:** గండుగులపల్లి, దమ్మపేట మండలం (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)
తల్లిదండ్రులు: మాణిక్యమ్మ– లక్ష్మయ్య, **విద్యాభ్యాసం:** బీకాం
భార్య: భ్రమరాంబ, కుమారుడు యుగంధర్, కుమార్తెలు డాక్టర్ జగన్మోహిని, చంద్రిక
రాజకీయ నేపథ్యం: టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా, టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా పనిచేశారు. తాజాగా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ హయాంలో ఉమ్మడి ఏపీలో చిన్ననీటి పారుదల శాఖ, ప్రొహిబిషన్, భారీ, మధ్యతరహా నీటి పారుదలశాఖ, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా పనిచేశారు.
ఎమ్మెల్యే: 1985, 1994, 1999 (సత్తుపల్లి), 2009 (ఖమ్మం), 2016 (పాలేరు), 2023 (ఖమ్మం)
మంత్రి: ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, కేసీఆర్ కేబినెట్‌లలో
ఎమ్మెల్సీ: టీఆర్ఎస్ నుంచి 2015లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పుట్టిన తేదీ: జూన్ 6, 1969
స్వస్థలం: మంథని (పెద్దపల్లి జిల్లా)
విద్యార్హత: ఢిల్లీ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రం, హెచ్‌సీయూ నుంచి పొలిటికల్ సైన్స్‌లో పీజీ
తల్లిదండ్రులు : జయశ్రీ – దుద్దిళ్ల శ్రీపాదరావు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్)
భార్య, పిల్లలు: శైలజ రామయ్యర్ (సీనియర్ ఐఏఎస్), ఆదిత శ్రీపాద, అనిరుధ్ శ్రీపాద
రాజకీయ నేపథ్యం: దుద్దిళ్ల శ్రీపాదరావును నక్సలైట్లు హత్య చేయడంతో ఆకస్మికంగా రాజకీయాల్లోకి వచ్చారు.
ఎమ్మెల్యే: మంథని అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ తరఫున 1999, 2004, 2009, 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు.
విప్: ఉమ్మడి ఏపీలో 2004–2009 వరకు
మంత్రి: 2009–14లో వైఎస్.రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లలో ఉన్నత విద్యా శాఖ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖల మంత్రిగా పనిచేశారు.
పార్టీ పదవులు: ఏఐసీసీ సెక్రటరీ

సీఎం ముఖ్యకార్యదర్శిగా వి.శేషాద్రి

ఇంటెలిజెన్స్ విభాగాధిపతిగా బి.శివధర్‌రెడ్డి

- సొంత జట్టు కూర్పుపై రేవంత్ దృష్టి
- తొలి విడతగా ఇరువురు అధికారుల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి


శేషాద్రి


శివధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి వి.శేషాద్రి, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం అధిపతిగా బి.శివధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సొంత జట్టు కూర్పుపై దృష్టి సారించిన రేవంత్‌రెడ్డి తన తొలి ఎంపికగా ఇద్దరు సమర్థులైన అధికారులనే నియమించుకున్నారు. ఇద్దరు అధికారులూ ఆయా పదవుల్లో విశేష అనుభవం కలిగి ఉన్నారు. 1999 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వి.శేషాద్రి సమర్థుడైన అధికారిగా పేరుతెచ్చుకున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆయనకు రెవెన్యూ వ్యవహారాలు, భూ చట్టాలపై పట్టు ఉంది. 2013 ఆగస్టు 22 నుంచి 2020 ఆగస్టు 22 వరకు ప్రధానమంత్రి కార్యాలయంలోని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో డైరెక్టర్, జాయింట్ సెక్రటరీల హోదాల్లో ఆయన డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2020 సెప్టెంబర్ నుంచి 2022 మే వరకు నాటి సీఎం కేసీఆర్‌కు ముఖ్యకార్యదర్శిగా వ్యవహరించారు. ఈ సమయంలో భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపట్టిన ధరణి ప్రాజెక్టు అమలులో కీలకంగా వ్యవహరించారు. 2022 మే నుంచి సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. 2009–12 మధ్య చిత్తూరు, రంగారెడ్డి, విశాఖపట్నం కలెక్టర్‌గా పనిచేశారు. మరోవైపు ఇంటెలిజెన్స్ విభాగం అధిపతిగా నియమితులైన శివధర్‌రెడ్డి ప్రస్తుతం రైల్వే, రోడ్డు భద్రతా విభాగం అదనపు డీజీగా వ్యవహరిస్తున్నారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శివధర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో ఇంటెలిజెన్స్ విభాగంలో అత్యంత కీలకంగా పనిచేశారు. అంతకుముందు ఆయన ఎస్ఐబీలో డీఐజీగా, నల్లగొండ, నెల్లూరు, గుంటూరులో ఎస్పీగా పలు కీలక పోస్టింగ్‌లలో పనిచేశారు. సమర్థుడైన అధికారిగా పోలీస్‌శాఖలో శివధర్‌రెడ్డికి పేరు ఉంది. ఆయనకు రేవంత్‌రెడ్డి సర్కార్ నిఘా విభాగాధిపతిగా కీలక బాధ్యతలు అప్పగించింది.

పుష్కరకాలం తర్వాత కేబినెట్‌లోకి కోమటిరెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: దాదాపు పన్నెండేళ్ల తర్వాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నాడు తెలంగాణ రాష్ట్ర ప్రకటన వెంటనే చేయాలన్న డిమాండ్‌తో విద్యుత్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంత్రి హోదాలో ధర్నాలో పాల్గొని, ఆపై అరెస్ట్ అయ్యారు. అనంతరం ఉద్యమంలో మరింత క్రియాశీలకం అయ్యేందుకు ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేసి పూర్తిస్థాయి ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో ''నాకు తెలంగాణ కంటే ఏ పదవీ పెద్దది కాదు..తెలంగాణ రాష్ట్రమిస్తే ఏ పదవీ నాకొద్దు''అని వ్యాఖ్యలు చేశారు. తిరిగి పన్నెండేళ్ల తర్వాత మంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు.

ధనసరి అనసూయ (సీతక్క)



పుట్టిన తేదీ: జూలై 9, 1971
స్వస్థలం: జగన్నపేట, ములుగు మండలం (ములుగు జిల్లా)
విద్యార్హత : ఎల్ఎల్‌బీ, ఆదివాసీల జీవనం – సంప్రదాయాలు – నైపుణ్యంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు.
తల్లిదండ్రులు: సమ్మక్క–సారయ్య, **భర్త, పిల్లలు:** రామన్న, సూర్య (కుమారుడు)
రాజకీయ నేపథ్యం: 10వ తరగతి పూర్తయ్యాక 1988లో విప్లవోద్యమంలో చేరిక. సీపీఐ (ఎంఎల్) జనశక్తిలో చేరిక, ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనశక్తి దళ లీడర్‌గా ప్రధాన భూమిక. 1997లో సాధారణ క్షమాభిక్ష పథకం కింద పోలీసులకు లొంగిపోయారు. 2001లో టీడీపీలో చేరారు.
ఎమ్మెల్యే: ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు 2009 (టీడీపీ), 2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే.
పార్టీ పదవులు: తెలుగు మహిళా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, ప్రస్తుతం ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి.

పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పుట్టిన తేదీ: అక్టోబర్ 28, 1965,
స్వస్థలం: నారాయణపురం, కల్లూరు మండలం(ఖమ్మం జిల్లా)
తల్లిదండ్రులు: స్వరాజ్యం– రాఘవరెడ్డి, **విద్యాభ్యాసం:** బీఏ
భార్య: మాధురి, కుమారుడు హర్షారెడ్డి, కుమార్తె సప్నిరెడ్డి
రాజకీయ నేపథ్యం: 2013లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2014లో ఖమ్మం లోక్‌సభ స్థానంలో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2016 బీఆర్ఎస్‌లో చేరిన ఆయన 2014 సెప్టెంబర్ 1 నుంచి 2019 వరకు రవాణా, పర్యాటక శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది జూలై 2న రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి, ఆ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమితులయ్యారు.
ఎంపీ: 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఖమ్మం ఎంపీగా గెలిచారు.
ఎమ్మెల్యే: 2023 పాలేరు సెగ్మెంట్‌కు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే అయ్యారు.

సీలారపు దామోదర రాజనర్సింహ



పుట్టిన తేదీ: డిసెంబర్ 5, 1958
స్వస్థలం: జోగిపేట (సంగారెడ్డి జిల్లా)
విద్యార్హత: ఇంజనీరింగ్
తల్లిదండ్రులు: జానాబాయి– రాజనర్సింహ (మాజీ మంత్రి)
భార్య, కూతురు: పద్మిని, త్రిష
రాజకీయ నేపథ్యం: వారసత్వంగా రాజకీయాల్లో వచ్చారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.
ఎమ్మెల్యే: అందోల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 1989, 2004, 2009, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
మంత్రి: 2006 వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్ విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రోశయ్య కేబినెట్‌లోనూ పనిచేశారు. 2010–2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు.
పార్టీ పదవులు: సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు

పొన్నం ప్రభాకర్ గౌడ్



పుట్టిన తేదీ: డిసెంబర్ 9, 1967
స్వస్థలం: కరీంనగర్
విద్యార్హత: ఎంఏ, ఎల్ఎల్‌బీ
తల్లిదండ్రులు: మల్లమ్మ–సత్తయ్యగౌడ్
భార్య, పిల్లలు: మంజుల, పృథ్వీ, ప్రణవ్
రాజకీయ నేపథ్యం: ఎస్ఆర్ఆర్ కాలేజీకి కాంగ్రెస్ అనుబంధ విభాగమైన ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2005–09 మధ్యకాలంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పనిచేశారు.
ఎంపీ: 2009 లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. **ఎమ్మెల్యే:** 2023 ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
పార్టీ పదవులు: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పుట్టినతేదీ: మే, 23 1965
స్వస్థలం: బ్రాహ్మణవెల్లెంల, నార్కట్‌పల్లి మండలం (నల్లగొండ జిల్లా)
విద్యార్హత: ఇంజనీరింగ్ (సివిల్)
తల్లిదండ్రులు: సుశీలమ్మ–పాపిరెడ్డి
భార్య, పిల్లలు: భార్య సబిత, కూతురు శ్రీనిధిరెడ్డి, కుమారుడు ప్రతీక్‌రెడ్డి (కుమారుడు 2011లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు)
రాజకీయ నేపథ్యం: 1986–1993 వరకు ఎన్ఎస్‌యూఐ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్‌గా, 1993– 1998 వరకు యువజన కాంగ్రెస్ రాష్ట్రనేతగా పనిచేశారు.
ఎమ్మెల్యే: నల్లగొండ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 1999, 2004, 2009, 2014, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
మంత్రి: వైఎస్.రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లో.
ఎంపీ: 2019 లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి ఎంపీగా గెలిచారు.

నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేశారో,
మేము అలాంటి వారి మంచి పనుల ప్రతిఫలాన్ని వ్యర్థం కానివ్వము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 8 డిసెంబర్ 2023

కాంగ్రెస్ సర్కారుకు సవాళ్లు

తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ఏలుబడి మొదలైంది. ఎన్నికల ఫలితాలు వెలువడగానే ముఖ్యమంత్రిని నిర్ణయించటం మొదలు మంత్రుల ఖరారు వరకూ కొనసాగే కాంగ్రెస్ మార్కు అనిశ్చితికి పెద్దగా తావు లేకుండానే అంతా పూర్తికావటం గమనించదగ్గది. మరో అయిదు నెలల్లో లోక్‌సభ ఎన్నికలుండటం, తెలంగాణలో గరిష్ఠ స్థాయిలో సీట్లు రాబట్టుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఉండటం ఇందుకు కారణం కావొచ్చు. కేబినెట్ కూర్పులో రాజకీయ, పాలనానుభవం పుష్కలంగా వున్నవారితోపాటు కొత్త నెత్తురుకు కూడా చోటిచ్చారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గతంలో కాంగ్రెస్ ఏలుబడిలో మంత్రులుగా పనిచేశారు. జూపల్లి టీఆర్ఎస్ కేబినెట్‌లో కూడా మంత్రిగా ఉన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గతంలో డిప్యూటీ స్పీకర్‌గా, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా వ్యవహరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుది ప్రత్యేక రికార్డు. ఆయన ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు దనసరి అనసూయ అలియాస్ సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాత్రం అమాత్యులుగా పరిపాలనకు కొత్త వారు. శాఖల కేటాయింపుపై ఊహాగానాలు వస్తున్నా అధికారిక ప్రకటనపై మాత్రం సస్పెన్స్ ప్రస్తుతానికి కొనసాగుతోంది.

కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాక తెలంగాణలో ఆ పార్టీకి కొంత ఊపూ ఉత్సాహం వచ్చిన సంగతి నిజమే అయినా... అది అధికారాన్ని అందుకునే స్థాయికి ఎదుగుతుందని మొదట్లో ఎవరికీ అంచనాలు లేవు. బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా, పార్టీ శాసనసభ్యుల పైనా ప్రజానీకంలో గూడుకట్టుకున్న అసంతృప్తిని పసిగట్టడంలో పార్టీ సారథి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలం అయ్యారు. వివిధ స్థాయుల్లో అవినీతి, సర్కారీ కొలువుల భర్తీలో ప్రదర్శించిన అలసత్వం, పోటీ పరీక్షల నిర్వహణలో వైఫల్యం, ధరణి పోర్టల్‌తో వచ్చిన సమస్యలు ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెచ్చాయి. సీఎం ఎవరికీ అందుబాటులో వుండరన్న అభిప్రాయం ఏర్పడటం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దెబ్బతీసింది. వీటన్నిటి పర్యవసానంగా ప్రత్యామ్నాయం కోసం తెలంగాణ ప్రజానీకం ఎదురుచూసింది. దీన్ని అందిపుచ్చుకుంటున్నట్టే మొదట్లో కనబడిన భారతీయ జనతా పార్టీ స్వీయతప్పిదాల వల్ల క్రమేపీ వెనక్కిపోయింది. ఇది కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ఇక ఆ పార్టీ మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలు గెలుపును సునాయాసం చేశాయి. రైతు భరోసా కింద ఏటా రూ. 15,000, వ్యవసాయ కూలీలకు రూ. 12,000, రైతులకు అయిదేళ్ల వ్యవధిలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఇంటింటికీ 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు, ప్రతి మహిళకూ నెలకు రూ. 2,500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500 కే గ్యాస్ సిలెండర్, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సొంతిల్లు లేనివారికి ఉచితంగా స్థలం, రూ. 5 లక్షల సాయం, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యాభరోసా కార్డు, చేయూత పథకం కింద నెలకు రూ. 4 వేల పెన్షన్, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా తదితర హామీలు కూడా సగటు ఓటరును బాగా ఆకట్టుకున్నాయి. ఈ ఆరు గ్యారెంటీలకు సంబంధించిన ఫైలు పైనే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తొలి సంతకం చేశారు. అయితే ఏటా రూ. 88,000 కోట్లు అవసరమని అంచనా వేస్తున్న ఈ పథకాల అమలుకు నిధులు సమకూర్చటం ప్రభుత్వం ముందున్న పెద్ద సవాలు. ఇవిగాక ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలు ఉండనే ఉన్నాయి. ప్రస్తుతం రూ. 5 లక్షల కోట్ల రుణభారం ఉన్న తెలంగాణలో ఇదంతా కత్తిమీది సామే. ఎందుకంటే 2023–24 బడ్జెట్‌లో రాష్ట్ర ఆదాయాన్ని 2.16 లక్షల కోట్లుగా చూపారు. ఇక రెవెన్యూ వ్యయం రూ. 2.12 లక్షల కోట్లుంది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం కింద రుణ పరిమితిని పెంచుకోవటానికి అనుమతించాలన్న బీఆర్ఎస్ సర్కారు వినతిని కేంద్రం తిరస్కరిస్తూ వచ్చింది. బహుశా అందువల్లే కావొచ్చు... తొలి కేబినెట్ భేటీలో అధిక భారం పడని రెండు గ్యారెంటీలు – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా అమలుచేయాలని నిర్ణయించారు. ఇవి రెండూ ఈ 9వ తేదీ నుంచి అమల్లోకి రాబోతున్నాయి. అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 64 కాగా, మిత్రపక్షం సీపీఐకి ఒక స్థానం వుంది. నిన్నటివరకూ పాలించిన బీఆర్ఎస్ 39 స్థానాలతో బలమైన ప్రతిపక్షంగా ఉంది. 8 స్థానాలు గెల్చుకున్న బీజేపీ, ఏడు స్థానాలున్న ఎంఐఎంలు సైతం పాలనా నిర్వహణను నిశితంగా గమనిస్తుంటాయి. వాగ్దానాల అమలులో విఫలమైతే నిలదీయటానికి విపక్షాలు సిద్ధంగా ఉంటాయి. బీఆర్ఎస్ ప్రాంతీయపార్టీ గనుక కేసీఆర్ స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోగలిగారు. పాలించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సారథిగా రేవంత్‌కి పరిమితులు తప్పవు.

రాజకీయాలపై ఆసక్తి, అనురక్తి మినహా మరే నేపథ్యమూ లేని రేవంత్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగిన తీరు ఎన్నదగ్గది. విద్యార్థి దశలో ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఏబీవీపీతో, ఆ తర్వాత టీఆర్ఎస్‌తో, అటుపై తెలుగుదేశంతో ప్రయాణించిన రేవంత్ రెడ్డి 2017లో అనూహ్యంగా కాంగ్రెస్‌లో కొచ్చి స్వల్పవ్యవధిలోనే పీసీసీ అధ్యక్షుడు కాగలిగారు. ఇంటా బయటా సమస్యలు ఎదుర్కొన్నారు. అయితే ఓటుకు కోట్లు కేసు, తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో ఇప్పటికీ ఉందంటున్న సాన్నిహిత్యం రేవంత్‌కు గుదిబండలే. వాటినుంచి ఎంత త్వరగా విముక్తులైతే అంత త్వరగా నవ తెలంగాణలో ఏర్పడిన తొలి కాంగ్రెస్ ప్రభుత్వ సారథిగా ఆయన తనదైన ముద్ర వేయగలుగుతారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** బ.ఏకాదశి తె.4.12 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** హస్త ఉ.7.22 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** సా.4.00 నుండి 5.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.31 నుండి 9.19 వరకు, తదుపరి ప.12.14 నుండి 1.02 వరకు, **అమృత ఘడియలు:** రా.2.20 నుండి 4.03 వరకు.

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇక రైతులకు మంచిరోజులేనా?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

రైతులను శాశ్వత పేదరికంలో ఉంచిన ప్రధాన స్రవంతి ఆర్థిక ఆలోచనల నుండి బయటపడటానికి ప్రస్తుత రాజకీయాలు పోరాడుతున్నాయి. అనేక దశాబ్దాలుగా, ప్రధానమైన ఆర్థిక ఆలోచన ఏమిటంటే, పంటల ధరలను తక్కువగా ఉంచడమే! దీనివల్ల ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందని దీని భావం. ఆర్థికవేత్తలతో సంబంధం లేకుండా, ఇప్పుడు రాజకీయ పార్టీలు రైతు సమాజం కోసం అదనపు కృషి చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. తీవ్ర సంక్షోభం నుండి వ్యవసాయాన్ని బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందనీ, అధిక భరోసాతో కూడిన ఆదాయాన్ని అందించడమే కీలకమనీ పార్టీలు గ్రహించాయి. రైతుల చేతిలో ఎక్కువ డబ్బు ఉండడం అంటే, గ్రామీణ భారతం వ్యయం చేసే సామర్థ్యం పెరుగుతుందని అర్థం.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కావాలంటూ పంజాబ్, హరియాణా రైతులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో అయిదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, వ్యవసాయ పంటలకు అధిక ధరను అందజేస్తామనే హామీతో రైతులను ఆకర్షించడానికి బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ ఏర్పడింది. ఇది 2024 సార్వత్రిక ఎన్నికలకు కొత్త నమూనాను సృష్టిస్తోంది. దేశంలో 14 శాతం మంది రైతులు మాత్రమే ధాన్య సేకరణ ధరల ప్రయోజనాన్ని పొందుతున్నారు కాబట్టి, కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన ఒక చట్రాన్ని అందించాల్సిన అవసరం ఉంది.

ఒక విధంగా చెప్పాలంటే, వ్యవసాయాన్ని శాశ్వత పేదరికంలో ఉంచిన ప్రధాన స్రవంతి ఆర్థిక ఆలోచనల నుండి బయటపడటానికి ప్రస్తుతం రాజకీయాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. అనేక దశాబ్దాలుగా, ప్రధానమైన ఆర్థిక ఆలోచన ఏమిటంటే, వ్యవసాయ ధరలను తక్కువగా ఉంచడమే! ఇలా చేయడం వల్ల ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందని దీని భావం. రైతులు పేదలుగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం. ప్రపంచంలోని అత్యంత సంపన్న వాణిజ్య కూటమి అయిన 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఓఈసీడీ) చేసిన ఇటీవలి అధ్యయనం, భారతీయ రైతులపై 2000వ సంవత్సరం నుండి నిరంతరం పన్ను విధించబడుతోందని నిశ్చయాత్మకంగా చూపింది. ప్రబలంగా ఉన్న వ్యవసాయ సంక్షోభానికి మూలకారణం స్పష్టంగా మన ముందుంది. 54 దేశాలలో సాగిన ఈ అధ్యయనం ప్రకారం, రైతులు 'ప్రతికూల జోన్'లో ఉన్న దేశాలు కొన్ని ఉన్నప్పటికీ, బడ్జెట్ మద్దతు ద్వారా నష్టాన్ని పూడ్చడానికి భారతదేశంలో మాత్రమే ఎటువంటి ప్రయత్నం జరగలేదని తేలింది. సరళంగా చెప్పాలంటే – ఇరవై సంవత్సరాలుగా, భారతీయ రైతులు ఏ సహాయమూ అందని కఠిన పరిస్థితుల్లో మిగిలిపోయారు.

ఆర్థిక సంస్కరణలను ఆచరణీయంగా ఉంచడానికి వ్యవసాయాన్ని త్యాగం చేయాలని విశ్వసించే ప్రధాన ఆర్థిక ఆలోచనకు ఇది సరిగ్గా సరిపోతుంది. 50 శాతం లాభ మార్జిన్‌తో 'వెయిటెడ్ ధర'ను లెక్కించడం ద్వారా, రైతులకు కనీస మద్దతు ధరను (సాంకేతికంగా దీనిని 'సీ2+50 శాతం' అంటారు) చెల్లించాలనే 'ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్' సిఫార్సును తూట్లు పొడవడంలో అదే ఆధిపత్య ఆలోచనా ప్రక్రియ పనిచేసింది. 'సీ2+50 శాతం' ఫార్ములా ఆధారంగా రైతులకు ధరను అందించడం సాధ్యం కాదనీ, అది 'మార్కెట్లను వైకల్యపరుస్తుంద'నీ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్, కాలం చెల్లిన అదే ఆర్థిక ఆలోచనల ఫలితమే.

అయితే, ప్రధాన ఆర్థికవేత్తలు ఏం చెబుతున్నారనే దానితో సంబంధం లేకుండా, ఇప్పుడు రాజకీయ పార్టీలు కష్టాల్లో ఉన్న



రైతు సమాజం కోసం అదనపు కృషి చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. తీవ్ర సంక్షోభం నుండి వ్యవసాయాన్ని బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందనీ, అధిక భరోసాతో కూడిన ఆదాయాన్ని అందించడమే కీలకమనీ పార్టీలు గ్రహించాయి. 2020–21లో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతుల విశిష్టమైన నిరసన వారి కళ్ళు తెరిపించింది. అంతే కాకుండా ఆహారాన్ని పండించే రైతులకు ఇకపై జరిమానా విధించడం కుదరదని వారికి అర్థమైంది.

ఛత్తీస్‌గఢ్‌లో వరి సేకరణ ధర ఇప్పటికే క్వింటాల్‌కు రూ. 2,640 (2023 మార్కెటింగ్ సీజన్‌లో కొనుగోలు ధర రూ. 2,183 కాకుండా) ఉన్న చోట, కాంగ్రెస్ మొదటగా దానిని రూ.3,200కి పెంచడం ఆసక్తికరం. ఎకరాకు కనీసం 20 క్వింటాళ్ల కొనుగోలు చేస్తామని కూడా హామీ ఇచ్చింది. ఎకరాకు 21 క్వింటాళ్ల కొనుగోలు చేస్తామని హామీ ఇస్తూ, క్వింటాల్‌కు రూ.3,100 చొప్పున చెల్లిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. అదే విధంగా మధ్యప్రదేశ్‌లో గోధుమలకు కాంగ్రెస్ అందించే ధర క్వింటాల్‌కు రూ. 2,600 కాగా, బీజేపీ రూ. 2,700లను ప్రతిపాదించింది. రాజస్థాన్‌లో, 'సీ2+50 శాతం' ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధర చెల్లిస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. అలాగే, తెలంగాణలో రైతులకు ప్రత్యక్ష ఆదాయ మద్దతుగా రూ. 15,000 అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆశ్చర్యకరంగా, 2006లో సమర్పించిన స్వామినాథన్ ప్యానెల్ సిఫార్సులను అమలు చేయడంలో ఇరుపక్షాలూ నిరాసక్తులైనప్పటికీ, ఎన్నికల రాష్ట్రాల్లో వాగ్దానం చేసిన వరి, గోధుమ ధరలు 'సీ2+50 శాతం' ఫార్ములా ధరకు సమానంగా లేదా మించి ఉన్నాయి. ఈ ఎన్నికల వాగ్దానాలు నెరవేరుతాయా లేదా అని చాలామంది ఆలోచిస్తుండగా, కనీసం వ్యవసాయ ధరలనైనా ప్రకటించాలనే పోటీ కారణంగా, రాజకీయ నాయకులు రైతు సమాజం బాధలను, వేదనను గ్రహించడం ప్రారంభించినట్లు అర్థమవుతోంది.

కాగా, అధిక ధరలను ప్రకటించడం వెనుక ఉన్న ఆర్థిక హేతుబద్ధతను ఇప్పటికే అనేక ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు ప్రశ్నించడం ప్రారంభించారు. అదనపు వనరులు ఎక్కడి నుంచి వస్తాయని కూడా అడుగుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రశ్నల హోరు మరింత పెరుగుతుంది. విచిత్రమేమిటంటే – అదే ఆర్థిక ఆలోచన గత 10 సంవత్సరాలలో దాదాపు రూ. 15 లక్షల కోట్ల కార్పొరేట్ మొండి బకాయిలను మాఫీ చేయడంలోని హేతుబద్ధతను ఎన్నడూ ప్రశ్నించలేదు. అలాగే 16,000 మందికి పైగా ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు రుణాలు అందించడంలో బ్యాంకులను రాజీపడేలా చేసే ఆర్థిక శాస్త్రంలోని తప్పును ఈ ఆర్థిక ఆలోచన కనుగొనలేదు. రూ. 3.45 లక్షల కోట్ల బకాయిలను ఎగవేతదారులు దాటేసి పోవడంలోని తప్పును ఇది గుర్తించలేదు. మార్కెట్లు సమర్థతను, మంచి పనితీరును మెచ్చుకుంటున్నట్లయితే, పనితీరులో విఫలమైన కంపెనీలను బెయిల్ అవుట్ చేయడానికి ఎటువంటి ఆర్థిక కారణం లేదు.

అందువల్ల, పంటలకు అధిక ధరలు అందించే నిబద్ధత దేశ వ్యాప్తంగా ఎందుకు విస్తరించడం లేదని రైతులు అడగడం సరైనదే! 14 శాతం మంది రైతులు మాత్రమే సేకరణ ధరల ప్రయోజనాన్ని పొందుతున్నారు కాబట్టి, కనీస మద్దతు ధరల కోసం 'సీ2+50 శాతం' వద్ద చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందించాల్సిన అవసరం ఉంది. తద్వారా మిగిలిన 86 శాతం వ్యవసాయ జనాభాకు హామీ ధరలు చేరేలా చూసుకోవాలి. దీనితో పాటుగా భూమిలేని రైతుల కోసం 'పీఎం–కిసాన్' ఆదాయ మద్దతును పెంచాలి. రైతుల చేతిలో ఎక్కువ డబ్బు ఉండడం అంటే గ్రామీణ భారతం వ్యయం చేసే సామర్థ్యం ఎక్కువ అవుతుందని అర్థం. పైగా అది జీడీపీని ఉన్నత పథంలో నడిపిస్తుంది.

రాజకీయ పార్టీలు దృఢంగా ఉండాల్సిన అవసరం ఉంది. వారి వాగ్దానాల నుండి వెనక్కి వెళ్ళడానికి ప్రధాన శ్రేణి శక్తులు చేసే అరిగిపోయిన వాదనలను అనుమతించకూడదు. ఆస్టిన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో విశిష్ట ఆర్థికవేత్త ప్రొఫెసర్ జేమ్స్ కె గాల్‌బ్రైత్ మాట్లాడుతూ, 'విద్యా, రాజకీయ, మీడియా గుత్తాధిపత్యాన్ని' అట్టిపెట్టుకోవడానికి ప్రధాన స్రవంతి తరగతి తీవ్రంగా పోరాడుతోందనీ, తాజా ఆర్థిక ఆలోచనలు పెరగడాన్ని అది ఏమాత్రం అనుమతించదనీ చెప్పారు. భారతదేశంలోనూ అలా జరగడం మనం చూస్తున్నాం. 1970లు, 1980ల ప్రారంభంలో శిక్షణ పొందిన నేటి ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు చాలా మంది, ముందే నిర్ధారించుకున్న ఆలోచనలు, సిద్ధాంతాలతో వస్తారు అని కూడా గాల్‌బ్రైత్ అన్నారు. ఆయన ప్రకారం, ''ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు బహుశా వారి ప్రధాన నమ్మకాలను పునఃపరిశీలించుకోవాలి. లేదా బహుశా మనకు కొత్త 'ప్రధాన స్రవంతి' అవసరం కావచ్చు.''

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే ఉచితం!



చాలా ఉద్వేగపూరితంగా వ్యవహరించే మనుమలు నిర్ణయాలు తీసుకునేటప్పుడు – తార్కికంగా ఉండి, ఈ నిర్ణయాల పరిణామాలను పట్టని ఇంకో మనిషిని సంప్రతించడం మేలు.

– కునాల్ షా, ఆంట్రప్రెన్యూర్

అదే కదా ప్రశ్న?



స్కిన్ కేర్, కోల్డ్ డ్రింక్స్, పాన్ మసాలా లాంటి తాము ప్రచారం చేసే ఉత్పత్తులను బాలీవుడ్ సెలబ్రిటీలు వాడరని మనకు తెలుసు. అయినా అది మన మనసుల మీద ఎందుకు ప్రభావం చూపుతోంది?

– విజయ్ పటేల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ప్రజాపాలన



అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తన 2024–25 బడ్జెట్‌ను సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించింది. పౌరుల సూచనలకు స్వాగతం పలికింది. సూచనలతో పాటుగా వారి పేరు, మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ కూడా తీసుకుంటోంది. బడ్జెట్‌లో ఎలాంటి ప్రజాపనులను చేర్చవచ్చో అడిగింది. పాలనలో ప్రజల భాగస్వామ్యమే కదా, ప్రజాస్వామ్యం అంటే!

– బలరామ్ శర్మ, సామాజిక కార్యకర్త

నేనొక్కరినే కాదు



ఇంట్లో అద్దెకు ఉన్నవాళ్లను తరిమేసి, పెంచిన అద్దెలతో కొత్తవారికి ఇంటిని అద్దెకు ఇవ్వడం ఇప్పుడు బెంగళూరులో ట్రెండ్‌గా మారిందా ఏమిటి? ఇప్పటివరకు ముగ్గురు అలా చెప్పడం విన్నాను. చెప్పొద్దూ... మొదట నేను మా ఇంటి యజమాని మాత్రమే ఇలా చేస్తున్నారని అనుకున్నాను.

– పెరల్ డిసౌజా, పాత్రికేయురాలు

తిమింగలాలు



చాలామంది భారతీయ వ్యాఖ్యాతలు, ట్విట్టర్ యోధులు విస్మరించిన ఒక ముఖ్యాంశాన్ని వీర్ సంఘ్వీ చక్కగా ఎత్తి చూపారు. మనం ఎంతసేపటికీ చిన్న చేపలైన ఖలిస్థానీలను వేటాడుతున్నాం తప్పితే... భారతీయులను దారుణంగా చంపిన దావూద్ ఇబ్రహీం, హఫీజ్ సయీద్ వంటి వారిని ఇంతవరకు తాకనైనా తాకలేకపోయాం!

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

ఇదేం కపటం?



పన్నూ (ఖలిస్తానీ నాయకుడు గుర్‌పత్‌వంత్ సింగ్ పన్నూ) జీవితం పట్ల అమెరికా చూపుతున్న పట్టింపులోని కపటం దిగ్భ్రాంతి గొలుపుతోంది. ఒసామా (బిన్ లాడెన్)ను చంపడానికేమో వాళ్లకు హక్కుంది. కానీ ఎయిర్ ఇండియా విమానాన్నీ, ఆఖరికి పార్లమెంటును కూడా పేల్చేస్తానన్న మనిషినేమో కాపాడుతారట. ఆయన్నెందుకు యూఎస్ చట్టాల కింద విచారించకూడదు?

– ప్రకాశ్ సింగ్, మాజీ పోలీస్ అధికారి

అది సమర్థనీయమా?



ఇప్పుడు జరుగుతున్నదాన్ని సమర్థించడానికి, రెండు దేశాల పరిష్కారానికి ఒకప్పుడు పాలస్తీనా తిరస్కరించిందన్న వాస్తవాన్ని కొందరు ఎత్తిచూపుతున్నారు. ఒకవేళ ఎవరైనా మీ ఇంట్లో సగం (లేదా అంతకంటే ఎక్కువ) అడిగి, దాన్ని మీరు తిరస్కరిస్తే, ఇప్పుడు వాళ్లు మీ ఇల్లు మొత్తాన్ని తగలబెట్టడం సమర్థనీయం అవుతుందా?

– నిదా కిర్‌మానీ, సోషియాలజిస్ట్

ఇన్ బాక్స్

సర్వరోగ నివారిణి... సమగ్ర భూ సర్వే!

భూ వివాదాలూ, గట్టు పంచాయతీ లేని తెలంగాణ లక్ష్యంగా సాగిన 'ల్యాండ్ రికార్డ్ అప్‌డేట్ ప్రోగ్రాం' (ఎల్ఆర్‌యూపీ) గొప్పగా చేశారని రెవెన్యూ సిబ్బందికి ఒకవైపు అభినందనలు తెలియజేసి, ఇంకోవైపు సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా తట్టా బుట్టా సర్ది వారిపై అవినీతిపరులు అనే ముద్ర వేసింది గడచిన బీఆర్ఎస్ ప్రభుత్వం. ఈ మిషతో వారిని ఇతర శాఖలలో సర్దుబాటు చేసి 2020లో 'ధరణి' పోర్టల్ ప్రారంభించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. భూ సమస్యలన్నింటికీ ధరణియే సర్వరోగ నివారిణి అని గొప్పలు చెబుతూ భూమికి ఉన్న రోగాలను నయం చేయ డానికి 33 మాడ్యూళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. కానీ భూ సమస్యలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా తయారు అయ్యాయి. లేఅవుట్లకు రైతుబంధు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులూ, కోర్టులో మూలుగుతున్న సాదా బైనామా సమస్యలూ, సివిల్ కోర్టులలో పెరిగిన కేసులూ ఇందుకు కొన్ని ఉదాహరణలు.


రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా భూ సమస్య రాని పత్రిక కానీ, టీవీ ఛానెల్ కానీ లేదంటే అతిశయోక్తి కాదు. భూ చట్టాల న్యాయ నిపుణులు 'భూమి సునీల్' ఆధ్వర్యంలో లీఫ్ సంస్థ నిర్వహించిన 'భూ న్యాయ' శిబిరాలలో ప్రతీ గ్రామంలో 200 నుండి 300 భూ సమస్యలు ఉన్నాయని తేలింది. గొప్పగా చెప్పుకుంటున్న ధరణి పోర్టల్ ఎందుకు ఈ సమస్యలన్నిటినీ తీర్చలేకపోయింది? ఎన్నికలలో కూడా అధికార, ప్రతిపక్షాలకు ప్రచార అస్త్రంగా ధరణి పోర్టల్ మారింది. 'మేము అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామ'ని రేవంత్ రెడ్డి; కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రామ్ రామ్, ధరణి పోర్టల్ బంగాళాఖాతంలోకి, రైతులు హిందూ మహాసముద్రంలో కలుస్తారని కేసీఆర్ – చెప్పారు. చివరికి బీఆర్ఎస్ ఓటమికి ఈ ధరణి పోర్టల్ ఓ ముఖ్య కారణమయ్యిందని చెప్పక తప్పదు.

పది సంవత్సరాల కాలంలో ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విసిగిన ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు ప్రభుత్వ మార్పును కోరుకున్నారు. ఇది ఓటుతో మాత్రమే సాధ్యమవుతుందని నిరూపించారు. ఇప్పుడు ఏర్పడిన ప్రభుత్వం మీద ప్రజలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా రెవెన్యూ మంత్రి ఎవరో కూడా తెలియని అధ్వాన్న స్థితిలో భూ పరిపాలన సాగింది. కొత్త ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత రెవెన్యూ మంత్రి అధ్వర్యంలో వీఆర్వో, వీఆర్ఏల పునరుద్ధరణ జరగాలనీ, సమగ్ర భూ సర్వేయే సర్వరోగ నివారిణిగా చేపట్టాలనీ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

– బందెల సురేందర్ రెడ్డి, మాజీ సైనికుడు

రాజ్యాంగ విలువలు అమలవుతున్నాయా?

రాజ్యాంగ నిర్మాతలు జాతి లక్ష్యాలనూ వాటిని సాధించేందుకు అవసరమైన వ్యవస్థలనూ, ప్రక్రియలనూ రాజ్యాంగంలో పొందు పరచారు. జాతి సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామిక సమాజం ఏర్పాటు అనేవి జాతి లక్ష్యాలుగా ఉద్దేశించబడ్డాయి. వీటిని సాధించేందుకు ప్రజాస్వామిక స్ఫూర్తితో రాజ్యాంగ ప్రజాస్వామిక వ్యవస్థలను వినియోగించుకుంటూ సామాజిక, ఆర్థిక విప్లవం ద్వారా నూతన సమాజాన్ని నిర్మించవలసి ఉంటుందని భావించారు. రాజ్యాంగ వ్యవస్థలు వాటికి అవే పనిచెయ్యవు. ఆ వ్యవస్థ ద్వారా ఎంపిక కాబడ్డ రాజకీయ యంత్రాంగం నడిపించాల్సి ఉంటుంది. ప్రముఖ న్యాయమూర్తి జాన్ మార్షల్ అన్నట్లు 'రాజ్యాంగం అనేది భావితరాల కోసం రూపొందించబడుతుంది, కానీ దాని నిర్దిష్ట క్రమం ఎప్పుడూ ఒడుదొడుకులు లేకుండా ఉండదు'. రాజ్యాంగం అంటే ఒక జాతి సామాజిక లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగించే దిక్సూచిలాగా భావించాలి. నిజానికి నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకూ పరిష్కార మార్గం ఏ రాజ్యాంగంలోనూ లభించదు. వాటిని రాజ్యాంగ సూత్రాల పరిధిలో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.



రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలకూ, చారిత్రక అసమానతల మీద ఏర్పడ్డ సామాజిక వ్యవస్థకూ భిన్నత్వం ఉంది. ఈ వైరుధ్యాల నడుమనే భారత రాజకీయ వ్యవస్థ రాజ్యానికీ, వ్యక్తుల హక్కులకూ మధ్య సమన్వయం సాధిస్తూ ముందుకు సాగాలి. వ్యక్తి స్వేచ్ఛ, పౌరస్వేచ్ఛ ప్రధానమైనవిగా భావించాలి. అంబేడ్కర్ చెప్పిన 'చట్టం ముందర సమానత్వం' భావన కేవలం సూత్రప్రాయంగా కాక 'రూల్ ఆఫ్ లా' ప్రాతిపదికన ముందుకు సాగాలి.

వర్తమానంలో రాజ్యాంగానికి ఆవల ఉండే పద్ధతుల్లో ఎన్నో విధ్వంసకర విధానాలు 'సర్వసమ్మతి' పేరున జరుగుతున్నాయి. 1990ల్లో వచ్చిన నయా ఉదారవాద విధానాల నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులు పెరిగాయి. దీనితో 'సంక్షేమ రాజ్య' స్థాపన లక్ష్యానికి గండిపడింది. సామాజిక సంక్షేమం సందిగ్ధంలో పడింది. ఫలితంగా సమాజ సంక్షేమం స్థానే మార్కెట్ ప్రయోజనాలే ముందుకొచ్చాయి. వరల్డ్ బ్యాంక్ విధానాలు స్థానిక ప్రభుత్వాలను సైతం దెబ్బతీశాయి.


ఈ నేపథ్యంలోనే నేడు దేశంలో 'విశ్వాసమే' ప్రధానం అనే భావనను సర్వసమ్మతి పేరున రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యాన్నీ భిన్న అభిప్రాయాలనూ, నేర పూరిత కుట్రగా చలామణీ చేస్తున్నాయి. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో నేడు ఏకతా సూత్రాల దిశగా దేశాన్ని నడిపిస్తున్నారు. ఆహార నియమాల పట్ల కూడ ప్రత్యక్ష ఆంక్షలు తలెత్తుతున్నాయి. చట్ట ప్రకారం పరిపాలన కంటే విశ్వాసమే చట్టంగా పాటించాల్సిన పరిస్థితుల్లోకి ప్రజలు నెట్టబడుతున్నారు.

ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే దేశ వ్యతిరేకిగా, దేశద్రోహిగా కేసులు వస్తున్నాయి. ఎమర్జెన్సీ తరువాత వచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో సుప్రీంకోర్టు భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పార్లమెంట్ కూడా మార్చలేదని చెప్పిన తీర్పు స్పష్టంగానే ఉంది. రాజ్యాంగ బద్ధంగా పరిపాలిస్తామని రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వాళ్ళే 'విశ్వాసమే' ప్రధానం అనే భావజాలాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ విలువల సాక్షిగా ప్రజలు తమ హక్కులకు, జీవితాలకు, రాజ్యాంగ రక్షణకు, తామే నిబద్ధులుగా వ్యవహరించాల్సిన, కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. భారతదేశంలో 'చట్టబద్ధ పాలన' (రూల్ ఆఫ్ లా) సజావుగా సాగాలంటే దేశ పౌరసమాజం ద్వారా మాత్రమే రూల్ ఆఫ్ లాను పొందగలరు.

– డా॥ నూతక్కి సతీష్, నాగార్జున విశ్వవిద్యాలయం డా॥ బి.ఆర్. అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ – రీసెర్చ్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ

ప్రతి క్షణమూ మంచిదే!

కాల మహిమ తెలియరానిది. అంతా బాగానే జరుగుతూ వుందిలే అనుకుంటున్నంతలోనే ఊహించనిది జరిగి అంతా తారుమారవుతూండడం గమనిస్తాం. చెయ్యి, కాలూ ఆడనంతగా ఒక్కొక్కపుడు పరిస్థితులలో మార్పులు వస్తాయి. ఎంత ఆలోచించినా కారణం అవగతం కాదు. దైవానుగ్రహం లేదు కాబోలు అన్న ఒక్క సమాధానం తప్ప మరోటి మనసుకు తట్టదు. అలాంటప్పుడే 'అయ్యో ఆలస్యం చేశామే!' అన్న ఆలోచన మనసులో ప్రవేశిస్తుంది. కలిసిరాని కాలం కొనసాగే కొలదీ ఈ ఆలోచన మనసులో పదే పదే మెదులుతూ మరింతగా బాధపెడుతుంది. చేయాల్సిన పనులను సత్వరం చేయడం, మంచి పనులు చేయడంలో జాప్యం జరగకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యం అన్న విషయాన్ని పెద్దలు చెప్పడంలోని ఆంతర్యాన్ని బద్దెన పేరుతో ప్రసిద్ధుడైన భద్రభూపాలుడు రచించిన 'నీతిశాస్త్ర ముక్తావళి' గ్రంథంలోని ఈ చంపకమాల వృత్తంలోని పద్యం విశదీకరిస్తుంది.



సిరిగలనాడె మేన దనజీవము గల్గిననాడె కాలముం
దిరుగనినాడె తేజ మెదద్రివ్వనినాడె యనేక దుస్థితుల్
పొరయనినాడె మానవులు బుద్ధి దలంచి పరోపకారముల్
తిరముగ జేయుటొప్పు నది తీరిన జేయ విధాత శక్యమే!

'పుష్కలంగా డబ్బు చేతనున్నప్పుడే, శరీరంలో ప్రాణం కుదురుగా ఉన్నప్పుడే, కాలం తాను తలచినట్లుగా జరుగుతున్నప్పుడే, అనేకానేక కష్టాలు చుట్టుముట్టి బ్రతుకును అతలాకుతలం చేయకుండా ఉన్నప్పుడే బుద్ధి కలిగిన మనిషి తాను చేయగలిగిన సహాయం సాటివానికి అవసరంలో చేయడం సరైనది. పరిస్థితులలో ఆ అనుకూలత తీరిన తరువాత చేయాలని సంకల్పించినా అలా చేయగలగడం విధాత వల్ల కూడా అయ్యే పని కాదు సుమా!' అని భావం. మంచిపని చేయడానికి మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోవాల్సిన పని లేదు. అందుకు మంచి రోజు అంటూ ఏదీ ఉండదు. మానవ జీవితంలోని ప్రతి క్షణమూ మంచి పని చేయడానికి భగవంతుడి చేత ఉద్దేశించబడినదిగానే భావించి సాధ్యమైనంతలో ఆచరణలో పెట్టడం వివేకవంతుడి లక్షణం.

– భట్టు వెంకట రావు

తెలంగాణ స్ఫూర్తిని కొనసాగించండి: ప్రతిభారెడ్డి

సాక్షి, హైదరాబాద్: అనేక ఆశలు, ఆకాంక్షలతో కొలువుదీరిన నూతన ప్రభుత్వం తెలంగాణ అమరవీరుల త్యాగాల బాటలో ముందుకెళ్తూ, తెలంగాణ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని రావి నారాయణరెడ్డి స్మారకట్రస్ట్ ప్రతినిధి రావి ప్రతిభారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ అంటేనే ఆకలి, అవమానం అని, ఈ రెండింటిపైన తిరుగుబాట్లతో విజయం సాధించే చరిత్ర తెలంగాణ ప్రజలదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర కేబినెట్ మంత్రులకు ప్రతిభారెడ్డి అభినందనలు తెలిపారు.

‘గ్రూప్స్’ పిలుపు

- 897 పోస్టులతో ఏపీలో గ్రూప్–2 నోటిఫికేషన్ జారీ
- ఫిబ్రవరి 25న ఆఫ్‌లైన్‌లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ
- త్వరలోనే గ్రూప్–1తో పాటు పలు నోటిఫికేషన్లు

సాక్షి, అమరావతి: యువత ఉత్కంఠకు తెరదించుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్–2 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 897 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కమిషన్ ప్రకటించింది. ఈ నెల 21వ తేదీ నుంచి జనవరి 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థులు తమ వన్ టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. కొత్త అభ్యర్థులు తొలుత కమిషన్ వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఓటీపీఆర్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షను ఆబ్జెక్టివ్ తరహాలో ఫిబ్రవరి 25వ తేదీన ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. మెయిన్స్ సైతం ఆబ్జెక్టివ్ తరహాలో ఆఫ్‌లైన్ లేదా సీబీటీలో నిర్వహించనున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. మెయిన్స్ పరీక్ష తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

మే నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి

కమిషన్ ప్రకటించిన గ్రూప్–2 నోటిఫికేషన్‌లో 114 డిప్యూటీ తహసీల్దార్, 150 ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, గ్రేడ్–3 మున్సిపల్ కమిషనర్ల పోస్టులు 4, గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్ 16, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ 28 పోస్టులతో పాటు 59 శాఖల్లో 331 ఎగ్జిక్యూటివ్ పోస్టులున్నాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ), సీనియర్ ఆడిటర్, ఆడిటర్ ఇన్ పే అండ్ అకౌంట్స్, వివిధ సెక్షన్లలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 566 ఉన్నాయి. ఈ మొత్తం ప్రక్రియను మే నెల నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో కమిషన్ ఆ మేరకు ప్రణాళిక సిద్ధం చేసింది.

వెబ్‌సైట్‌లో సిలబస్

అభ్యర్థుల అభ్యర్థన, సౌలభ్యం మేరకు గ్రూప్–2 ప్రిలిమ్స్ పరీక్షను ఆబ్జెక్టివ్ తరహాలో ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీలో 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు 2.30 గంటల్లో ఓఎంఆర్ షీట్‌పై సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్స్‌లో పేపర్–1, పేపర్–2లో 150 చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. పరీక్ష సిలబస్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఖాళీలు, వేతనం, వయసు, విద్యార్హతలతో పాటు పూర్తి సమాచారం కోసం కమిషన్ వెబ్‌సైట్ http://www.psc.ap.gov.in లో చూడవచ్చు. అలాగే ఏపీపీఎస్సీ త్వరలోనే వంద గ్రూప్–1 పోస్టులతో పాటు డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్స్‌తో మొత్తం 23 నోటిఫికేషన్లు విడుదల చేయనుంది.



ట్రైబల్ వర్సిటీ ద్వారా గిరిజనుల జీవితాల్లో వెలుగు

ప్రధాని మోదీకి ‘ఎక్స్’లో కిషన్‌రెడ్డి ధన్యవాదాలు

సాక్షి, న్యూఢిల్లీ: ములుగులో ఏర్పాటుకానున్న సమ్మక్క–సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ అందించే విద్య గిరిజనుల జీవితాలను మెరుగుపరుస్తుందని కేంద్ర పర్యాటక శాఖమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సమ్మక్క–సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ‘ఎక్స్’వేదికగా తెలంగాణ ప్రజల తరఫున ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనేష్‌కుమార్‌కు గవర్నర్ ట్రోఫీ

సాక్షి, హైదరాబాద్: మాజీ సైనికులు, వారి కుటుంబాల పునరావాసానికి ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి అధికంగా విరాళాలు సేకరించిన సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్‌కుమార్ నోరిని రాష్ట్ర గవర్నర్ అభినందించారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా శ్రీనేష్‌కుమార్‌కు గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ట్రోఫీని అందజేశారు. విధి నిర్వహణలో మరణించిన సైనికులు, దివ్యాంగులైన మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఈ నిధితో అనేక పథకాలు అమలు చేస్తున్నారు. దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు మన పరాక్రమ సాయుధ బలగాల త్యాగాలను స్మరించుకోవడానికి ఏటా డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకొంటున్న విషయం తెలిసిందే.

కొండకు కొత్త శోభ

- ఇంద్రకీలాద్రిపై రూ. 216.05 కోట్లతో అభివృద్ధి పనులకు ఏపీ సీఎం జగన్ శంకుస్థాపన
- రూ. 23.145 కోట్లతో పూర్తి చేసిన పనులు ప్రారంభం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. విజయవాడ కనకదుర్గానగర్ గోశాల వద్ద రూ.216.05 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మరో రూ. 23.145 కోట్లతో పూర్తి చేసిన పనులను ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పనులకు సీఎం జగన్ తొలుత శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. అమ్మవారి విశేషాలతో దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రచురించిన ‘శ్రీకనకదుర్గా వైభవం – ఉపాసనా విధానం’ పరిశోధనాత్మక గ్రంథాన్ని ఆవిష్కరించారు. వేద పాఠశాల విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం ఇంద్రకీలాద్రిపైకి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. మరోవైపు కృష్ణా పుష్కరాల పేరిట 2016లో విజయవాడలో టీడీపీ సర్కారు కూల్చి వేసిన 8 ఆలయాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునర్‌నిర్మించి ప్రారంభించింది. నాడు పుష్కరాల సమయంలో చంద్రబాబు సర్కారు కృష్ణా పరీవాహక ప్రాంతంతో పాటు అమ్మవారి ఆలయ ప్రాంగణం, అమ్మవారి ఆలయానికి చేరుకునే మార్గంలోని మొత్తం 13 ఆలయాలను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేసిన సంగతి తెలిసిందే.


విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నేడు సీఎం జగన్ పర్యటన

- తిరుపతి, బాపట్ల జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- బాధితులు, రైతులను కలిసి వారితో మాట్లాడనున్న సీఎం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుపతి, బాపట్ల జిల్లాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నారు. బాధితులు, రైతులను కలిసి వారితో మాట్లాడనున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం వద్ద స్వర్ణముఖి నది కట్ట తెగి నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి.. గ్రామస్తులు, తుపాను బాధితులతో నేరుగా సమావేశమవుతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి బాపట్ల జిల్లా మరుప్రోలువారిపాలెం చేరుకుంటారు. అక్కడ తుపాను బాధితులతో మాట్లాడిన అనంతరం కర్లపాలెం మండలం పాతనందాయపాలెం చేరుకుని రైతులతో మాట్లాడతారు. అక్కడి నుంచి బుద్ధాం చేరుకుని తుపాను వల్ల దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించి రైతులతో సమావేశమవుతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం తాడేపల్లి చేరుకుంటారు.



క్లాస్‌మేట్స్‌పై బుల్లెట్ల వర్షం

రష్యాలో పాఠశాలలో టీనేజర్ దుశ్చర్య | ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

మాస్కో: ప్రశాంత రష్యాలోనూ కాల్పుల ఘటనలు నమోదవుతున్నాయి. గురువారం ఉదయం ఉక్రెయిన్, బెలారస్ దేశాల సరిహద్దులోని బ్రియాన్స్‌క్ నగరంలో ఓ పాఠశాల ఈ కాల్పుల ఘటనకు వేదికైంది. 14 ఏళ్ల టీనేజీ అమ్మాయి తన తండ్రి కొన్న షాట్‌గన్‌ను స్కూల్‌కు తీసుకొచ్చి తోటి క్లాస్‌మేట్స్‌పైకి ఎక్కుపెట్టి బుల్లెట్ల వర్షం కురిపించింది. ఈ ఘటనలో ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. స్కూల్‌లో వివక్షకు గురికావడం వల్లే అమ్మాయి ఇంతటి ఘాతుకానికి పాల్పడి ఉంటుందని రష్యా ఉప ఆరోగ్య శాఖ మంత్రి అలెక్సీ కుజ్‌నెట్సోవ్ అనుమానం వ్యక్తంచేశారు.

నెవెడా వర్సిటీలో కాల్పుల మోత

లాస్ వెగాస్: తుపాకీల సంస్కృతికి బుధవారం ఆరుగురు బలైన ఘటన మరువకముందే గురువారం మరో కాల్పుల ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. నెవెడా రాష్ట్రంలోని లాస్ వెగాస్ నగరంలోని యూనివర్సిటీ ఆఫ్ నెవెడాలో ఒక మాజీ అధ్యాపకుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు ఘటనాస్థలి చేరుకుని సాయుధుడైన అధ్యాపకుడిని హతమార్చారు. దాదాపు 60ఏళ్ల మాజీ ప్రొఫెసర్ జరిపిన కాల్పుల్లో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు పోలీస్ అధికారులకు స్వల్ప గాయాలయ్యాయి. యూనివర్సిటీ క్యాంపస్ సమీప ప్రాంతంలోనూ కాల్పులు వినిపించాయన్న సమాచారంతో దగ్గర్లోని హ్యారీ రెయిడ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కొద్దిసేపు మూసేశారు. ఈ ప్రొఫెసర్ గతంలో జార్జియా, ఉత్తర కరోలినాలో యూనివర్సిటీల్లో పాఠాలు చెప్పారు. ఇటీవల ఒక స్కూల్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా అది తిరస్కరణకు గురైంది.

కాల్పుల్లో గాయపడ్డ వనీ కన్నుమూత



న్యూఢిల్లీ: అక్టోబర్‌లో ఉగ్రవాది కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వనీ(30) గురువారం ఆస్పత్రిలో కన్నుమూశారు. రిటైర్డు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కుమారుడైన వనీ అక్టోబర్ 29వ తేదీన శ్రీనగర్‌లోని ఈద్గా మైదానంలో స్థానిక యువకులతో కలిసి క్రికెట్ ఆడుతున్నారు. ఆ సమయంలో వనీపైకి ఓ ఉగ్రవాది అతి సమీపం నుంచి కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన వనీని సౌరాలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం విమానంలో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకువచ్చారు. గురువారం వనీ తుదిశ్వాస విడిచినట్లు అధికారులు వెల్లడించారు.

భారీగా కట్నం డిమాండ్ యువ డాక్టర్ ఆత్మహత్య



తిరువనంతపురం: తమ కుటుంబం తాహతుకు మించి బాయ్‌ఫ్రెండ్ భారీగా కట్నం డిమాండ్ చేయడం ..పెళ్లి ఆగిపోవడంతో కలత చెందిన ఓ యువ వైద్యురాలు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన కేరళలోని తిరువనంతపురంలో చోటుచేసుకుంది. డాక్టర్ షహానా(26) తిరువనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని సర్జరీ విభాగంలో పీజీ చేస్తున్నారు. షహానా తండ్రి రెండేళ్ల క్రితమే చనిపోయారు. తల్లి, సోదరుడితో ఆమె కలిసి ఉంటున్నారు. డాక్టర్ రువాయిస్ అనే వ్యక్తితో కొంతకాలంగా ఆమె ప్రేమలో ఉన్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కానీ, రువాయిస్ కట్నంగా సుమారు కిలో బంగారం, 15 ఎకరాల భూమి, ఒక బీఎండబ్ల్యూ కారు కావాలని డిమాండ్ చేశాడని షహానా కుటుంబసభ్యులు ఆరోపించారు. అంత భారీగా ఇవ్వలేమని చెప్పడంతో రువాయిస్ కుటుంబం ఈ పెళ్లిని రద్దు చేసుకుంది. మనస్తాపం చెందిన షహానా ఆత్మహత్య చేసుకున్నారు. 'ప్రతి ఒక్కరికీ డబ్బు మాత్రమే కావాలి' అని రాసి ఉన్న సూసైడ్ నోట్ ఆమె వద్ద లభ్యమైంది. పోలీసులు రువాయిస్‌ను అదుపులోకి తీసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన ప్రాంతాల్లో స్వీప్


బీజేపీ విజయ రహస్యం ఇదే

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకుంటుందన్న పోల్ పండితుల అంచనాలను, ఎగ్జిట్ పోల్స్‌ను బీజేపీ తలకిందులు చేసింది. సునాయాసంగా మెజారిటీ మార్కు దాటేసి భూపేశ్ బఘేల్ సర్కారును గద్దె దించింది. ఐదు సంవత్సరాల విరామం అనంతరం తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగాను ఏకంగా 54 సీట్లు నెగ్గింది. రాష్ట్రంలో బీజేపీకి ఇదే అత్యధిక మెజారిటీ కావడం విశేషం. గిరిజన ప్రాంతాలైన సర్గుజా, బస్తర్‌లను ఏకపక్షంగా కొల్లగొట్టడమే బీజేపీ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది.

బస్తర్, సర్గుజాలో హవా

ఛత్తీస్‌గఢ్

ఛత్తీస్‌గఢ్‌లో తాజాగా వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు షాకివ్వడం నిజమే అయినా బీజేపీని కూడా ఒకింత విస్మయపరిచాయనే చెప్పాలి. ఎందుకంటే బఘేల్ సర్కారు ఐదేళ్ల పాలనపై ప్రజల్లో ఎక్కడా పెద్దగా వ్యతిరేకత వ్యక్తం కాలేదు. అందుకు ప్రధానంగా ఆయన పక్కాగా అమలు చేసిన పలు సంక్షేమ, ప్రజాకర్షక పథకాలే కారణంగా నిలిచాయి. ముఖ్యంగా 2018లో రాష్ట్ర చరిత్రలోనే భారీ మెజారిటీతో అధికారంలోకి రాగానే బఘేల్ ప్రవేశపెట్టిన వరికి బోనస్ పథకం రాష్ట్రంలో సూపర్‌హిట్టయింది. వరికి దేశంలోనే అత్యధిక బోనస్ ఇస్తున్న రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిచింది. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకం ఫలాలు అందేలా బఘేల్ జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నేపథ్యాన్ని బట్టి చూస్తే ఈసారి బీజేపీ గెలుపు అందరినీ ఆశ్చర్యపరిచిన పరిణామమే. గిరిజన ప్రాంతాల్లో అసెంబ్లీ స్థానాలన్నింటినీ ఈసారి బీజేపీ ఏకపక్షంగా ఒడిసిపట్టడమే దాని మెజారిటీకి ప్రధాన కారణంగా నిలిచింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, ఉత్తరాదిన ఉన్న సర్గుజా రెండూ బీజేపీకి జైకొట్టాయి. బస్తర్‌లోని 12 స్థానాలకు గాను బీజేపీకి 9 స్థానాలు దఖలుపడ్డాయి. సర్గుజాలోనైతే మొత్తం 14 సీట్లను గాను బీజేపీ ఏకంగా 13 స్థానాలను దక్కించుకుంది. ఈ ప్రాంతం ఉప ముఖ్యమంత్రి టీఎస్ సింగ్‌దేవ్ కంచుకోట కావడం విశేషం. రాజవంశీకుడైన ఆయన 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ప్రభావంతో సర్గుజా ప్రాంతంలో కాంగ్రెస్ హవా కొనసాగింది. ఆనాడు 14 స్థానాలకు కుగాను కాంగ్రెస్‌కు 12 సీట్లు దక్కాయి. ఈసారి పరిస్థితి దాదాపుగా తారుమారవడం విశేషం. ఇక్కడ బీజేపీ హవా దెబ్బకు చివరికి సింగ్‌దేవ్ సైతం ఓటమి చవిచూశారు. బస్తర్‌లో మాత్రం 3 స్థానాలతో కాంగ్రెస్ ఉనికి నిలుపుకోగలిగింది.



రాజధాని ప్రాంతంలో కాంగ్రెస్‌కు మొగ్గు

గిరిజన ప్రాంతాలతో పోలిస్తే రాజధాని రాయ్‌పూర్ ప్రాంతంలో మాత్రం కాంగ్రెస్ మెరుగైన ప్రదర్శనే చేసింది.

ఇక్కడి 20 స్థానాల్లో ఆ పార్టీ 11 సీట్లు నెగ్గింది. బీజేపీకి 9 స్థానాలు దక్కాయి.

బిలాస్‌పూర్ ప్రాంతంలో బీజేపీ 13, కాంగ్రెస్ 10 చోట్ల గెలిచింది. పాలి తనఖర్‌లో గోండ్వానా గణతంత్ర పార్టీ గెలిచింది.

దుర్గ్ ప్రాంతంలోనూ 20 స్థానాలుండగా బీజేపీ, కాంగ్రెస్ చెరో పదింటిని గెలుచుకున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

మార్చిలో రష్యా ఎన్నికలు

పుతిన్ 5వ విడత ఎన్నికకు మార్గం సుగమం

మాస్కో: రష్యా అధ్యక్ష పదవికి ఎన్నికల తేదీ ఖరారైంది. 2024 మార్చి 17న ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనపై రష్యా ఎగువ సభ ఫెడరేషన్ కౌన్సిల్ గురువారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీంతో, అధికారికంగా ఎన్నికల ప్రచారం ప్రారంభమయినట్లేనని స్పీకర్ వలెంటినా మట్వియెంకో ప్రకటించారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన 71 ఏళ్ల వ్లాదిమిర్ పుతిన్ మరో విడత పోటీ చేస్తానంటూ అధికారికంగా ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఎన్నికల తేదీ ఖరారైనందున, ఐదో సారీ ఆయన బరిలో ఉంటారని భావిస్తున్నారు. ఆరేళ్ల ఆయన పదవీ కాలం 2024లో ముగియాల్సి ఉంది. కానీ, పుతిన్ తీసుకువచ్చిన రాజ్యాంగ సంస్కరణల ప్రకారం 2024 తర్వాత మరో రెండు పర్యాయాలు అంటే 2036 వరకు అధికారంలో కొనసాగేందుకు వీలుంది. రాజకీయ అధికార యంత్రాంగంపై పూర్తి స్థాయిలో పట్టున్న పుతిన్ మార్చిలో జరిగే ఎన్నికల్లో మరో విడత ఎన్నిక కావడం తథ్యమని భావిస్తున్నారు. ఆయన ప్రత్యర్థులుగా భావిస్తున్న వారు జైళ్లలోనో, విదేశాల్లోనో ఉండిపోయారు. చాలా వరకు స్వతంత్ర మీడియా సంస్థలపై నిషేధాలు, నియంత్రణలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పుతిన్‌ను ఎదుర్కొనే వారెవరనే విషయం ఇంకా వెల్లడికాలేదు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగనున్నట్లు ఇప్పటి వరకు ప్రకటించిన ఇద్దరిలో, మాస్కో ప్రాంత మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడు బోరిస్ నదేజ్డిన్, జర్నలిస్ట్, లాయర్ అయిన యక్తెరినా దుంట్‌సోవా ఉన్నారు.



ఉక్రెయిన్‌తో ఏడాదికి పైగా కొనసాగుతున్న యుద్ధం, ప్రైవేట్ సైన్యాధిపతి యెవ్‌గెనీ ప్రిగోజిన్ విఫల తిరుగుబాటు వంటివి పుతిన్ ప్రజాదరణపై పెద్దగా ప్రభావం చూపుతున్న దాఖలాలు ఏవీ లేవని పరిశీలకులు అంటున్నారు. అధ్యక్ష పదవికి పోటీ చేయాలనుకునే వారు.. రష్యా దిగువ సభ డూమాలో గానీ కనీసం మూడో వంతు ప్రాంతీయ శాసనసభలలో ప్రాతినిధ్యం లేని పార్టీ ద్వారా 40 లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల నుంచి కనీసం లక్ష సంతకాలను సేకరించాలి. ఏ పార్టీకీ సంబంధం లేకుండా పోటీ చేసే వారికి కనీసం 40 లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల నుంచి 3 లక్షల సంతకాలు అవసరం. ఈ నిబంధనలు పుతిన్‌కు సైతం వర్తిస్తాయి. 2018లో స్వతంత్రుడిగా పోటీ చేసిన పుతిన్ తరఫున ప్రచారకర్తలు సంతకాలు సేకరించారు. 2012 ఎన్నికల్లో యునైటెడ్ రష్యా పార్టీ ఆయనను నామినేట్ చేసింది. దీంతో, సంతకాల సేకరణ అవసరం లేకుండాపోయింది.



బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు మోదీ అభివాదం

సుపరిపాలనకు మారుపేరు బీజేపీ

- బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రజలు బీజేపీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు
- తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో మా పార్టీ బలం పెరిగింది
- అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సక్సెస్ రేటు 56%, కాంగ్రెస్ సక్సెస్ రేటు 18%

న్యూఢిల్లీ: సుపరిపాలనకు బీజేపీ ఒక పర్యాయపదంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గత కొన్ని దశాబ్దాల అసెంబ్లీ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ప్రజలు బీజేపీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తేటతెల్లం అవుతోందని అన్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్, ఇతర పార్టీల కంటే బీజేపీ రికార్డు చాలా మెరుగ్గా ఉన్నట్లు గుర్తుచేశారు. గురువారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ఏ ఒక్కరి ఘనత కాదని, బృంద స్ఫూర్తితో అందరూ కలిసి పనిచేయడం వల్లే చక్కటి ఫలితాలు వచ్చాయని అన్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో గెలిచామని, తెలంగాణ, మిజోరం రాష్ట్రల్లో బీజేపీ బలం పెరిగిందని పేర్కొన్నారు. సామాన్య ప్రజలతో వారికి సులువుగా అర్థమయ్యే భాషలోనే సంభాషించాలని బీజేపీ నేతలకు, కార్యకర్తలకు మోదీ సూచించారు. ఉదాహరణకు 'మోదీజీ కీ గ్యారంటీ' బదులు 'మోదీ కీ గ్యారంటీ' అనాలని చెప్పారు.

ఇదిగో మా సక్సెస్ రేటు

కాంగ్రెస్ పార్టీ వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు 40 సార్లు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొందని, కానీ, ఏడుసార్లు మాత్రమే గెలిచిందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. కాంగ్రెస్ సక్సెస్ రేటు 18 శాతంగా ఉందన్నారు. బీజేపీ 39 సార్లు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని 22 సార్లు నెగ్గిందని ఉద్ఘాటించారు. బీజేపీ సక్సెస్ రేటు 56 శాతమని వివరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కంటే ప్రాంతీయ పార్టీలే మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ప్రాంతీయ పార్టీలు 36 సార్లు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని, 18 సార్లు గెలిచాయని, 50 శాతం సక్సెస్ రేటు సాధించాయని వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే అధికారం అప్పగించే విషయంలో ప్రజలు బీజేపీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలను సమర్థవంతంగా నడిపించే శక్తి బీజేపీకి ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. తమ పార్టీ ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత లేదని, సానుకూలత ఉందని వివరించారు. పార్టీలో తాను ఒక సాధారణ కార్యకర్తను మాత్రమేనని చెప్పారు.

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో పాల్గొనండి

తన దృష్టిలో దేశంలో పేదలు, యువత, మహిళలు, రైతులు అనే నాలుగు పెద్ద కులాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఆయా కులాల సంక్షేమం కోసం కృషి చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి ఉద్దేశించిన 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో పాల్గొనాలని పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పనితీరు పట్ల తమ కార్యకర్తలు సంతోషంగా ఉన్నారని బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

చైనా విదేశాంగ మంత్రి అదృశ్యం.. హత్యా? ఆత్మహత్యా?

వివాహేతర బంధమే క్విన్‌గాంగ్ మరణానికి కారణమన్న అంతర్జాతీయ మీడియా

వాషింగ్టన్: ఒకప్పుడు అమెరికాలో చైనా రాయబారిగా పనిచేసి వెంటనే అత్యున్నత పదవి పొంది చైనా విదేశాంగ మంత్రిగా సేవలందించిన క్విన్ గాంగ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారనే విషయంపై అంతర్జాతీయ మీడియా కొత్త అంశాలను మోసుకొచ్చింది. చివరిసారిగా జూన్ నెలలో కనిపించిన ఆయన ప్రస్తుతం జీవించి లేరని మీడియాలో వార్తలొచ్చాయి. ఆత్మహత్య చేసుకున్నారని కొన్ని పత్రికల్లో, చైనా ప్రభుత్వమే హింసించి చంపిందని మరి కొన్నింటిలో భిన్న కథనాలు వెలువడ్డాయి. ఈ ఏడాది జూన్‌లో చివరిసారిగా కనిపించి అప్పటి నుంచి కనిపించకుండా పోయిన క్విన్‌గాంగ్ ఉదంతం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. జూలై నెలలో బీజింగ్‌లోని మిలటరీ ఆస్పత్రిలో ఆయన కన్నుమూశారని చైనా ప్రభుత్వంలోని ఇద్దరు అత్యున్నత స్థాయి అధికారులు చెప్పినట్లు 'పొలిటికో' వార్తాసంస్థ ఒక కథనం వెలువరిచింది. క్విన్ అమెరికాలో చైనా రాయబారిగా కొనసాగిన కాలంలో ఆయన నెరిపిన ఒక వివాహేతర సంబంధమే ఈ అదృశ్యం ఘటనకు అసలు కారణమని గతంలో వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. ఈ విషయంలో చైనా ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తునకు ఆయన సహకరించారట. ''అమెరికా పౌరసత్వమున్న చైనా అధికారిక ఫీనిక్స్ టీవీ మహిళా రిపోర్టర్ ఫ్యూ గ్జియోషియాన్‌తో వివాహేతర సంబంధం కారణంగా చైనా జాతీయ భద్రత ప్రమాదంలో పడిందని జిన్‌పింగ్ సర్కార్ బలంగా నమ్మింది. ఆ మహిళ సరోగసీ పద్ధతిలో ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడా తల్లీబిడ్డల ఆచూకీ సైతం గల్లంతైంది. క్విన్‌గాంగ్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని జిన్‌పింగ్ వెంటనే ఆయనను జూన్‌లో చైనా విదేశాంగ శాఖ మంత్రి పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో మాజీ దౌత్యవేత్త వాంగ్ యీను పదవిలో కూర్చోబెట్టారు'' అని ఆ కథనం పేర్కొంది. కేవలం ఆరునెలలు పదవిలో ఉన్న క్విన్ గాంగ్ ఆ తర్వాత కనిపించకుండా పోయారు. 2014–2018 కాలంలో దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌కు చీఫ్ ప్రోటోకాల్ ఆఫీసర్‌గా పనిచేసి క్విన్ ఆయనకు అత్యంత ఆప్తుడయ్యాడు. అందుకే అత్యంత నమ్మకస్తులకు మాత్రమే దక్కే 'అమెరికాలో చైనా రాయబారి' పదవిని క్విన్‌కు జిన్‌పింగ్ కట్టబెట్టారు.



చర్చా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వివేక్ రామస్వామి

ఫాసిస్ట్, అవినీతి అనకొండ

నిక్కీ హేలీపై వివేక్ రామస్వామి ఆరోపణలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడడానికి భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి తీవ్రంగా శ్రమిస్తున్నారు. పార్టీలో తన ప్రత్యర్థి అయిన భారతీయ–అమెరికన్ నిక్కీ హేలీపై పైచేయి సాధించాలని చూస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కోసం వివేక్ రామస్వామి, నిక్కీ హేలీతోపాటు ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటీస్, న్యూజెర్సీ మాజీ గవర్నర్ క్రిస్ క్రిస్టీ పోటీ పడుతున్నారు. నలుగురు ఆశావహుల మధ్య నాలుగో విడత చర్చా కార్యక్రమం యూనివర్సిటీ ఆఫ్ అలబామాలో హాట్ హాట్‌గా జరిగింది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కాలేదు. చర్చలో పాల్గొన్న నలుగురు నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. వివేక్ రామస్వామి దాదాపు అరగంటపాటు మాట్లాడారు. ప్రధానంగా నిక్కీ హేలీపై విరుచుకుపడ్డారు. ఆమె ఫాసిస్ట్, అవినీతి అనకొండ అని ధ్వజమెత్తారు. ఆరోపణలపై మీడియాకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. రీడ్ హాఫ్‌మాన్ అనే ధనవంతుడి నుంచి నిక్కీ, ఆమె కుటుంబ సభ్యులు 2.5 లక్షల డాలర్లు దండుకున్నారని ఆరోపించారు. అయితే, వివేక్ రామస్వామి చేసిన ఆరోపణలపై నిక్కీ హేలీ పెద్దగా స్పందించలేదు. చర్చా కార్యక్రమంలో మౌనంగా ఉండిపోయారు. ఆమెకు క్రిస్ క్రిస్టీ మద్దతుగా నిలిచారు. వివేక్ రామస్వామి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ నేత, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌పై ఎవరు పోటీకి దిగుతారన్నది ఆసక్తికరంగా మారింది.

2024లో ఇస్రో 10 కీలక ప్రయోగాలు

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) వచ్చే ఏడాది 10 కీలక ప్రయోగాలు చేపట్టనుందని కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో వెల్లడించింది. ఇందులో ఆరు పీఎస్‌ఎల్‌వీ మిషన్లు, మూడు జీఎస్‌ఎల్‌వీ ప్రయోగాలు, ఒక లాంచ్ వెహికల్ మార్క్–3 వాణిజ్య ప్రయోగం ఉందని తెలియజేసింది. ఈ మేరకు సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఇస్రో అభివృద్ధి చేసిన నూతన స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్(ఎస్ఎస్ఎల్‌వీ) ద్వారా ఒక ఉపగ్రహాన్ని ప్రయోగాత్మకంగా నింగిలోకి పంపించనున్నట్లు వివరించారు. ప్రతిష్టాత్మక గగన్‌యాన్ కార్యక్రమంలో భాగంగా కక్ష్య మాడ్యూల్‌ను నిర్ధారించుకొనేందుకు రెండు మానవ రహిత మిషన్లు చేపట్టాలని ఇస్రో భావిస్తోందని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

స్వల్ప దూర అగ్ని-1 ప్రయోగ పరీక్ష సక్సెస్

బాలాసోర్(ఒడిశా): స్వల్ప దూరాలను ఛేదించగల, ప్రయోగ దశలో ఉన్న బాలిస్టిక్ క్షిపణి అగ్ని–1ను విజయవంతంగా పరీక్షించినట్లు భారత రక్షణ శాఖ గురువారం ప్రకటించింది. ఒడిశాలోని ఏపీజే అబ్దుల్ కలామ్ ద్వీపంలో ఈ పరీక్షకు వేదికైంది. 'అగ్ని–1 అద్భుతమైన సత్తా ఉన్న క్షిపణి వ్యవస్థ. ఇప్పుడు దీనిని స్వల్ప దూర లక్ష్యాలకు పరీక్షించి చూస్తున్నాం. గురువారం నాటి ప్రయోగంలో ఇది అన్ని క్షేత్రస్థాయి, సాంకేతిక పరామితులను అందుకుంది. రాడార్, టెలిమెట్రీ, ఎలక్ట్రో–ఆప్టికల్ సిస్టమ్ వంటి అన్ని ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా దీని పనితీరును పరిశీలించాం. రెండు నౌకల ద్వారా క్షిపణి ఖచ్చితత్వాన్ని పర్యవేక్షించాం. ఇది చక్కగా పనిచేస్తోంది'' అని రక్షణ శాఖ ఉన్నతాధికారి ఒకరు మీడియాతో చెప్పారు. ఈ రకం క్షిపణిని చివరిసారిగా జూన్ ఒకటో తేదీన ఇదే వేదికపై విజయవంతంగా పరీక్షించారు.

కెనడా హిందీ సినిమా హాళ్లలో కలకలం

టొరంటో: కెనడాలోని గ్రేటర్ టొరంటో ప్రాంతంలో హిందీ సినిమాలను ప్రదర్శించే మూడు వేర్వేరు సినిమా హాళ్లలో కలకలం రేగింది. మాస్క్ ధరించిన వ్యక్తులు గుర్తు తెలియని రసాయనాన్ని స్ప్రే చేయడంతో ప్రేక్షకులు అసౌకర్యానికి గురయ్యారు. యార్క్‌లోని వౌఘన్ సినిమా కాంప్లెక్స్‌లో మంగళవారం రాత్రి 9.20 గంటల సమయంలో ఇలాంటి ఘటన ఒకటి చోటుచేసుకుంది. ఆ సమయంలో థియేటర్‌లో 200 మంది ఉన్నారు. స్ప్రే కారణంగా ప్రేక్షకుల్లో కొందరు దగ్గడం ప్రారంభించారు. శ్వాసలో ఇబ్బందికి గురయ్యారు. పోలీసులొచ్చేసరికే అనుమానితులు పరారయ్యారు. కొందరు బాధితులకు పోలీసులు చికిత్స చేయించారు. ఈ వారంలోనే ఇలాంటి ఘటనలే జరిగినట్లు పీల్, టొరంటోల్లోనూ జరిగినట్లు అక్కడి మీడియా పేర్కొంది. స్కార్‌బరో టౌన్ సెంటర్‌లోని థియేటర్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి దుర్వాసన వెదజల్లే బాంబును అమర్చినట్లు తమకు ఫోన్ కాల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. విద్వేషపూరిత నేరం సహా పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించి ఎవరినీ అరెస్ట్ చేయలేదని చెప్పారు.

సహజీవనం ప్రమాదకరమైన జబ్బు

బీజేపీ ఎంపీ ధరంబీర్ సింగ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: సహజీవనం ప్రమాదకరమైన జబ్బు అని బీజేపీ ఎంపీ ధరంబీర్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ విధానాన్ని సమాజం నుంచి పూర్తి నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సహజీవన విధానానికి వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని కోరారు. లోక్‌సభలో గురువారం జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'పాశ్చాత్య దేశాల్లో సహజీవన సంబంధాలు సర్వసాధారణం. కానీ, ఈ చెడ్డ విధానం మన సమాజంలో వ్యాధి మాదిరిగా వేగంగా వ్యాప్తి చెందుతోంది. దీని పరిణామాలు భయంకరంగా ఉంటున్నాయి. ఢిల్లీలో చోటుచేసుకున్న శ్రద్ధావాకర్, అఫ్తాబ్ పూనావాలా లివ్–ఇన్ రిలేషన్ షిప్ ఎంతటి దారుణానికి దారి తీసిందో చూస్తున్నాం' అని గుర్తుచేశారు. వివాహాన్ని పవిత్ర బంధంగా భావించే మనదేశంలో విడాకుల శాతం 1.1 శాతం మాత్రమేనన్నారు. అదే అమెరికాలో విడాకుల శాతం 40 శాతం వరకు ఉంటోందన్నారు. ప్రేమ వివాహాల్లో విడాకుల శాతం ఎక్కువగా ఉంటోందని చెప్పారు. ఇలాంటి బంధాల విషయంలో ఇరువైపులా తల్లిదండ్రుల ఆమోదం తప్పనిసరి చేయాలని సూచించారు. సామాజిక, వ్యక్తిగత విలువలు, కుటుంబాల నేపథ్యాలను బట్టి పెళ్లిళ్లను పెద్దలు కుదర్చటం మన దేశంలో అనాదిగా వస్తోందని గుర్తు చేశారు. 'వసుధైవ కుటుంబకమ్ అనే తత్వానికి భారతీయ సంస్కృతి ప్రసిద్ధి. మిగతా దేశాలతో పోలిస్తే మన సామాజిక వ్యవస్థ భిన్నమైంది. భిన్నత్వంలో ఏకత్వమన్న భారతీయ భావనను యావత్తు ప్రపంచమే మెచ్చుకుంది' అని ఆయన తెలిపారు.

పలువురు మంత్రులకు అదనపు బాధ్యతలు

న్యూఢిల్లీ: ఇటీవలి ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన కేంద్ర మంత్రులు నరేంద్ర తోమర్, ప్రహ్లాద్ జోషి, రేణూకా సింగ్ సరూటా మంత్రి పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను రాష్ట్రపతి ద్రౌపదీ గురువారం ఆమోదించారు. వీరు నిర్వహిస్తున్న శాఖలను ఇతర మంత్రులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర మంత్రి అర్జున్ ముండాకు వ్యవసాయ శాఖ అదనపు బాధ్యతలను అప్పగించారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజెకు అదనంగా ఆహారశుద్ధి పరిశ్రమల శాఖను, సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌కు అదనంగా జల్‌శక్తి శాఖ బాధ్యతను అప్పగిస్తూ ద్రౌపదీ ముర్ము ఆదేశాలిచ్చారని రాష్ట్రపతి భవన్ తెలిపింది.

'మెఫ్తాల్' ఔషధ రియాక్షన్‌లతో జాగ్రత్త

అడ్వైజరీ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: నెలసరి, రుమటాయిడ్ ఆర్థరైటిస్ సందర్భాల్లో సాధారణంగా వినియోగించే మెఫ్తాల్ ఔషధానికి సంబంధించిన ప్రతికూల ప్రభావా(రియాక్షన్)లను గమనించి, అప్రమత్తమవ్వాలని ఆరోగ్యరంగ వృత్తి నిపుణులు, వ్యాధిగ్రస్తులకు కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నవంబర్ 30వ తేదీన ఒక అడ్వైజరీని జారీ చేసింది. సాధారణంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్, మహిళల్లో నెలసరి సమయంలో సంభవించే డిస్‌మెనోరోయియా, నొప్పి, వాపు, జ్వరం, దంతాల నొప్పి వంటి చికిత్సలో మెఫెనమిక్ యాసిడ్ పెయిన్ కిల్లర్‌ను వినియోగిస్తుంటారు. ఈ పెయిన్ కిల్లర్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్(ఐపీసీ) తాజాగా ఔషధ భద్రత హెచ్చరికను జారీ చేసింది. ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా(పీవీపీఐ) వారి డేటాబేస్‌ను ప్రాథమికంగా విశ్లేషించగా కొత్త విషయాలు వెలుగుచూశాయి. ఈ ఔషధాన్ని వినియోగించిన సందర్భాల్లో ఇసినోఫిలియా, సిస్టెమిక్ సింప్టమ్స్(డ్రెస్) సిండ్రోమ్ వంటి డ్రగ్ రియాక్షన్‌లు కనిపించాయి. పెయిన్ కిల్లర్‌ను వాడిన సమయంలో ఏమైనా దుష్ప్రభావాలు కనబడితే వెంటనే పీవీపీఐ అధికారిక www. ipc.gov.in వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ నంబర్ 1800–180–3024ను సంప్రదించవచ్చు.

డానిష్ అలీపై అభ్యంతరకర వ్యాఖ్యలు.. క్షమాపణ చెప్పిన బీజేపీ ఎంపీ బిధూరి

న్యూఢిల్లీ: బీఎస్పీ ఎంపీ డానిష్ అలీపై అభ్యంతరకర వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీ ఎదుట క్షమాపణ చెప్పారు. కమిటీ విచారణకు ఇద్దరు ఎంపీలు హాజరయ్యారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సమయంలో చంద్రయాన్–3 మిషన్ విజయవంతంపై లోక్‌సభలో జరిగిన చర్చలో బిధూరి పాల్గొన్నారు. బీఎస్పీకి చెందిన డానిష్ అలీపై ఈ సందర్భంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. బిధూరి వ్యాఖ్యలపై మంత్రి రాజ్‌నాథ్ సభలో విచారం వ్యక్తం చేశారు. బిధూరీకి బీజేపీ చీఫ్ జేపీ నడ్డా సైతం నోటీసులు జారీ చేశారు. బిధూరిపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. మరో వైపు, బీజేపీ సభ్యులు కూడా ప్రధాని మోదీపై ఎంపీ డానిష్ అలీ అమర్యాదకరంగా వ్యాఖ్యలు చేశారంటూ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ప్రివిలేజ్ కమిటీ గురువారం జరిపిన విచారణకు ఎంపీలు డానిష్ అలీ, రమేశ్ బిధూరి వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ బిధూరి క్షమాపణ తెలిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. డానిష్ అలీ మాత్రం ప్రధానిపై తానెలాంటి అమర్యాదకర వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసినట్లు సమాచారం.

సాక్షి కరీంనగర్

శుక్రవారం | 8 | డిసెంబర్ | 2023



అద్దకానికి 'ముసురు' దెబ్బ

సిరిసిల్ల: సిరిసిల్లలో ఉత్పత్తి అవుతున్న కాటన్‌వస్త్రాన్ని ఇక్కడే 42 రకాల రంగుల్లో డయింగ్ చేస్తారు. రంగుల బట్టను పట్టణ శివారుల్లో ఎండలో ఆరబెడతారు. - 8లో▸



'పది' పరీక్షలకు ఫీజు ఖరారు

సిరిసిల్లఎడ్యుకేషన్: పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు తేదీలను విద్యాశాఖ ప్రకటించింది. 8వ తేదీ వరకు అపరాధరుసుం లేకుండా చెల్లించవచ్చు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. తుంపర పడే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించాలి

- ఎంపీ బండి సంజయ్ కుమార్



కరీంనగర్‌స్పోర్ట్స్: ఢిల్లీలో రేపు, ఎల్లుండి జరగబోయే జాతీయస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ధమ్మిక కాయ్ షిటోర్యు కరాటే అకాడమీకి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. కాగా క్రీడాకారులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అభినందించారు. జాతీయస్థాయిలో సత్తా చాటి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఆత్మ స్థైర్యానికి, ఆత్మ విశ్వాసానికి మార్షల్ ఆర్ట్స్ దోహదపడుతుందన్నారు. అండర్–12 లో శృతిక్ నందన్, శివ, ధనుశ్, అండర్– 14 లో మణితేజ, మధుశ్రీ, అకిరా, రాంచరణ్ పోటీపడుతున్నారని జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ ప్రసన్నకృష్ణ ఎంపీకి వివరించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి



జమ్మికుంట: నాణ్యమైన విద్యుత్ సరఫరాను వినియోగదారులకు అందించాలని కరీంనగర్ డివిజన్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. గురువారం పట్టణంలోని కేవీకే సమావేశం మందిరంలో హుజూరాబాద్ డివిజన్‌లోని జమ్మికుంట సబ్ డివిజన్ విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో లోపాలు సవరించాలని, బ్రేక్ డౌన్ రాకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ చింతకింద రాజేందర్, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌సీలను విడుదల చేయాలి

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి రెండు వేతన సవరణలు వెంటనే చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి జక్కం పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2017, 2021లకు సంబంధించిన రెండు పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను చెల్లించాలని ఆ ప్రకటనలో ఆయన కోరారు.

అమాత్యులు ఇద్దరు

ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు





శ్రీధర్‌బాబు, ప్రభాకర్‌గౌడ్‌కు దక్కిన గౌరవం

- ఇద్దరూ వకీల్‌సాబ్‌లే..
- తొలి కేబినెట్‌లో స్థానంపై హస్తం పార్టీలో హర్షం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కాంగ్రెస్ ప్రభుత్వ తొలి కేబినెట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. పార్టీలో సీనియర్లయిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంత్రులుగా గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

ఒక్కొక్కరిదీ ఒక్కోనేపథ్యం..

శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ దశాబ్దాలుగా పార్టీకి విధేయులుగా ఉంటూ పలు పదవులు నిర్వహించినవారే. తెలంగాణ ఏర్పాటు బిల్లు ఆమోద సమయంలో పార్లమెంట్‌లో పొన్నం ప్రభాకర్‌పై పెప్పర్ స్ప్రే దాడి జరిగింది. అప్పట్లో ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దుద్దిళ్ల శ్రీపాదరావు కుమారుడిగా శ్రీధర్‌బాబు రాజకీయ ప్రవేశం అనూహ్యంగా జరిగింది. ఆయన తండ్రిని నక్సలైట్లు హత్య చేయడం.. ఆ సమయంలో ఢిల్లీలో లా విద్యార్థిగా ఉన్న శ్రీధర్‌బాబు రాజకీయాల్లోకి అనివార్యంగా ప్రవేశించాల్సి వచ్చింది. రాజకీయాలు వారసత్వమే అయినప్పటికీ.. తండ్రికి తగ్గ తనయుడిగా పార్టీలో.. ప్రజల్లో తనదైన శైలితో మెప్పించి గుర్తింపు తెచ్చుకున్నారు. దుద్దిళ్ల, పొన్నం ప్రమాణ స్వీకారానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి.

రెండు శాఖలకు కరీంనగర్‌తో బంధం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి కేబినెట్‌లో శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఈటల రాజేందర్, బీసీ సంక్షేమ మంత్రిగా గంగుల కమలాకర్ వ్యవహరించిన విషయం తెలిసిందే. 2004లో కెప్టెన్ లక్ష్మీకాంతరావు కూడా బీసీ సంక్షేమ శాఖ నిర్వహించారు. అదే ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుది కూడా ఉమ్మడి జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి. దేశంలో పలు ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన పీవీ నరసింహరావు కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం నుంచి 1957 నుంచి 1977 వరకు ప్రాతినిధ్యం వహించడం విశేషం.

ఇద్దరూ వకీల్‌సాబ్‌లే..

మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఇద్దరూ వకీల్‌సాబ్‌లు కావడం విశేషం. ఉమ్మడి జిల్లాలో న్యాయశాస్త్రం అభ్యసించి కాంగ్రెస్ పార్టీలో మంత్రులైన వారి జాబితా పెద్దదే. అయినప్పటికీ జిల్లా రాజకీయాల్లో వీరిద్దరిదీ విలక్షణ శైలి. పార్టీకి నమ్మినబంటుల్లా ఉండే వీరిద్దరూ ఏ పని అప్పగించినా సమర్థవంతంగా నిర్వర్తిస్తారనే పేరు తెచ్చుకున్నారు. రాజకీయ వారసుడిగా 29ఏళ్ల వయసులో ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీధర్‌బాబు తరువాత రాజకీయ చాణక్యుడిగా మంథనిలో పేరు తెచ్చుకున్నారు. 1999, 2004, 2009లో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. 2009 నుంచి 2014 వరకు దివంగత వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. 2014లో ఓడినప్పటికీ 2018, 2023లో విజయం సాధించి ఐదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు.

ఎన్ఎస్‌యూఐ నుంచి..

విద్యార్థి నాయకుడిగా స్వశక్తితో ఎదిగిన ప్రభాకర్.. ఎన్ఎస్‌యూ నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఎస్సారార్ కాలేజీ ప్రెసిడెంట్ నుంచి 2009లో ఎంపీ స్థాయికి ఎదిగారు. పార్టీలో పలు పదవులు నిర్వర్తిస్తూనే తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంపీ ఫోరం కన్వీనర్‌గా పనిచేశారు. పార్లమెంటులో పెప్పర్ స్ప్రేదాడిలో తీవ్రంగా గాయపడినా.. బిల్లు ఆమోదంలో కీలకపాత్ర పోషించారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచి మంత్రిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సొంతం చేసుకున్నారు. బలమైన బీసీ నేత కావడం, అధిష్టానం అండదండలు పుష్కలంగా ఉండడంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బెర్త్ దక్కించుకున్నారు.

బయోడేటా

పొన్నం ప్రభాకర్

పుట్టిన తేదీ : 09-12-1967
స్వస్థలం : కరీంనగర్
విద్యార్హత : ఎంఏ, ఎల్ఎల్‌బీ
తల్లిదండ్రులు : సత్తయ్యగౌడ్–మల్లమ్మ
భార్య, పిల్లలు : మంజుల, ఇద్దరు పిల్లలు పృథ్వీ, ప్రణవ్
రాజకీయ నేపథ్యం : 1987లో ఎస్సారార్ కాలేజీ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌గా (ఎన్ఎస్‌యూఐ) ప్రస్థానం. 2004, 2014, 2018లో ఎమ్మెల్యేగా ఓటమి
2023లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నిక.
2023లో తొలిసారిగా బీసీ సంక్షేమ శాఖ బాధ్యతలు
ఎంపీగా: 2009–14 వరకు
పార్టీ పదవులు: 2009–14 ఎంపీల ఫోరం కన్వీనర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, 2005–09 మార్క్‌ఫెడ్ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్ అండ్ పవర్ కన్సల్టేటివ్ కమిటీలో సభ్యులు, ఫెర్టిలైజర్స్, కెమికల్స్, కంప్యూటర్స్ జాతీయ కమిటీలో సభ్యులు.

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పుట్టిన తేదీ: 30-06-1969
స్వస్థలం : మంథని
విద్యార్హత : ఢిల్లీ వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ, హెచ్‌సీయూ నుంచి పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్.
తల్లిదండ్రులు : శ్రీపాదరావు, జయశ్రీ
భార్య: శైలజరామయ్యర్, సీనియర్ ఐఏఎస్, యువజన సర్వీసులు, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి
పిల్లలు: ఆదిత శ్రీపాద, అనిరుద్ శ్రీపాద
రాజకీయ నేపథ్యం : సీనియర్ కాంగ్రెస్ నేత శ్రీపాదరావు కుమారుడు, తండ్రిని నక్సలైట్లు హత్య చేయడంతో ఆకస్మికంగా రాజకీయాల్లోకి వచ్చారు.
ఎమ్మెల్యేగా: 1999, 2004, 2009, 2018, 2023
మంత్రిగా: 2009–14 ఉన్నత విద్యాశాఖ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖలు
పార్టీ పదవులు: ప్రభుత్వ విప్, ఏఐసీసీ సెక్రటరీ, టీటీడీ బోర్డు మెంబర్

ఎదురుచూపులే..



- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి 8 నెలలుగా అందని వేతనాలు
- డీఎంఈలో విలీనమైనా మారని పరిస్థితి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) ఐసీయూ విభాగంలో పని చేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందడం లేదు. తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆధ్వర్యంలో ఇన్నాళ్లు కొనసాగిన ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, కరీంనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన తర్వాత డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మారింది. టీవీవీపీ నుంచి డీఎంఈకి మార్పు జరిగిన తర్వాత సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎక్కువైనట్లు సిబ్బంది వాపోతున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 2023–24 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి 8 నెలలుగా వేతనాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక నెల వేతనం అందకపోతేనే ఇల్లు గడవడం కష్టంగా మారే ప్రస్తుత పరిస్థితుల్లో 8 నెలల నుంచి చేసిన పనికి ప్రతిఫలం రాక అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు పుట్టడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

30 మంది..

వేతనాలు ఎప్పుడు అందిస్తారోనని 30 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఎదురుచూస్తున్నారు. ఐసీయూ విభాగంలో 20 మంది, బ్లడ్ స్టోరేజీ విభాగంలో ఇద్దరు, ఆర్టీపీసీఆర్ విభాగంలో 8 మంది.. ఇలా 30 మందికి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. అయితే ఈయేడు(2023–24 విద్యాసంవత్సరం) మెడికల్ కళాశాల ప్రారంభమైంది. కళాశాల ప్రారంభమైనా.. టీవీవీపీ నుంచి డీఎంఈకి అప్పగించడంతో జాప్యం జరిగిట్లు తెలిసింది. జూన్ నెల నుంచే మెడికల్ కళాశాలకు చెందిన కార్యకలాపాలు ఆసుపత్రిలో ప్రారంభమయ్యాయి. కానీ గత సెప్టెంబర్ 30నే టీవీవీపీ నుంచి డీఎంఈకి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో ఐసీయూ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కూడా డీఎంఈలో విలీనం చేశారు. అయితే ఏటా మార్చిలో జరగాల్సిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కొనసాగింపు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగినట్లు తెలుస్తోంది.

సాంకేతిక కారణాలతో జాప్యం

ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఆసుపత్రిని టీవీవీపీ నుంచి డీఎంఈకి అప్పగించకపోవడంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సాంకేతిక కారణాలేనని స్పష్టమవుతోంది. గడిచిన 8 నెలల్లో కొద్ది నెలలు టీవీవీపీ ఆధ్వర్యంలో, మరికొద్ది నెలలు డీఎంఈ ఆధ్వర్యంలో ఆసుపత్రి కొనసాగింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి డీఎంఈ నుంచే వేతనాలు చెల్లించేలా కార్యాచరణ చేపట్టినట్లు తెలుస్తోంది. కానీ తమకు వీలైనంత తొందరగా చెల్లించి ఆర్థిక ఇబ్బందుల నుంచి కాపాడాలని సిబ్బంది కోరుతున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగాల కొనసాగింపు ప్రక్రియ ఆలస్యం జరగడం వల్ల వేతనాలందడంతో జాప్యం నెలకొందని, వారం రోజుల్లోగా సిబ్బందికి వేతనాలందుతాయని ఏజెన్సీ నిర్వాహకులు స్పష్టం చేశారు.

మూగజీవాల మృత్యువాత



మృతిచెందిన కోడెలు(ఫైల్)



బక్కచిక్కిన కోడెలు

- ప్రాణాలు కోల్పోతున్న రాజన్న కోడెలు
- ఏటా 30 కోడెలు మృతి
- కోట్లలో ఆదాయం.. నిర్వహణలో నిర్లక్ష్యం
- పట్టించుకోని ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్:

కొడుకు పుడితే రాజన్నకు కోడె.. కోరికలు నెరవేర్చే స్వామికి కోడెమొక్కు.. ఇది రాజన్నసిరిసిల్ల వేములవాడ రాజన్నకు భక్తులు కోడెలను చెల్లిస్తుంటారు. అయితే భక్తులు రాజన్నకు అందించే కోడెలను సంరక్షించడంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాటి ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఏటా ముప్పైకి పైగా కోడెలు మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆలయ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. అసలు కోడెలు ఎందుకు చనిపోతున్నాయో తెలుసుకునేందుకు తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలను 'సాక్షి' పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

చారిత్రాత్మకంగా ఎంతో విశిష్టత ఉన్న వేములవాడ రాజన్న ఆలయానికి కోడె మొక్కుల ద్వారా ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తుంది. తమ కోరికలు తీరితే కోడెమొక్కులు చెల్లిస్తామని భక్తులు మొక్కుకుంటారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులైతే పంటలు సమృద్ధిగా పండితే కోడెలను తీసుకొచ్చి రాజన్నకు సమర్పిస్తుంటారు. నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు తమ కోడెలను ఆలయంలో అప్పగిస్తుంటారు. ఏటా కొత్త కోడెలు గోశాలకు చేరుతున్నాయి.మిగతా భక్తులు కోడెమొక్కులు చెల్లించేందుకు ఒక్కో టిక్కెట్‌కు రూ.200 చెల్లిస్తుంటారు. ఇలా ఏటా రాజన్న ఆలయానికి రూ.18 కోట్ల వరకు ఆదాయం వస్తుంది.

గోశాలలో మూగజీవాల గోస

వేములవాడ రాజన్న ఆలయానికి నెలకు కొత్తగా 100 నుంచి 150 కోడెలు వస్తుంటాయి. వీటి సంరక్షణకు వేములవాడ జాతరగ్రౌండ్‌లో ఒకటి, తిప్పాపూర్‌లో మరో గోశాల ఉంది. ఈ రెండు గోశాలలో పచ్చిమేత, దాణ, వరిగడ్డి అందిస్తున్నారు. పశువైద్యసేవలు అందుతున్నాయి. అయినప్పటికీ నెలకు సగటున రెండు కోడెలు ప్రాణాలు కోల్పోతున్నాయి. గోశాల నిర్వహణకు ఏటా రూ.2 కోట్లు వెచ్చిస్తున్నారు. ఆమేరకు గోశాలలో కోడెలకు వసతులు మాత్రం కల్పించడం లేదు. గోశాలలోని కోడెలు బక్కచిక్కి పోతున్నాయి. ఒక్కో కోడెకు కిలో దాణ, 10 కిలోల ఎండుగడ్డి, పచ్చిగడ్డి మిశ్రమంగా అందించాల్సి ఉండగా టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు సరఫరా చేసే పచ్చిగడ్డి కోడెలకు ఏమాత్రం సరిపోవడం లేదు.

రాష్ట్రవ్యాప్త గోశాలలకు రాజన్న కోడెలు

- వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించే కోడెలను ఇక్కడ సంరక్షించడం ఇబ్బందిగా మారడంతో రాష్ట్రంలోని వివిధ గోశాలలకు తరలిస్తున్నారు.
- తెలంగాణ రాష్ట్ర దేవస్థానం ఫెడరేషన్ అనుమతితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గోశాలలకు రాజన్న కోడెలను పంపుతున్నారు.
- వేములవాడలో ప్రస్తుతం జాతరగ్రౌండ్‌లోని గోశాలలో కోడెమొక్కుల కోసం 150 కోడెలు, 20 పాలిచ్చే ఆవులు ఉన్నాయి.
- తిప్పాపూర్‌లోని గోశాలలో 200 కోడెలు, 40 ఆవులు ఉన్నాయి. ఇంతకుమించి ఎన్ని కోడెలు వచ్చిన ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు.
- రాజన్న ఆలయ నిర్వహణలోని గోశాలలో మాత్రం మూగజీవాలు ప్రాణాలు కోల్పోతుండడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి.
- కోడెమొక్కుల ద్వారా కోట్ల ఆదాయం వస్తున్నా కోడెల సంరక్షణపై అధికారులు దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.
- ఆలయ ఆధ్వర్యంలోని గోశాల నిర్వాహకులు కోడెల నిర్వహణను భారంగా భావిస్తున్నారు. కోడెలు అనారోగ్యంతో వస్తున్నాయని, ఆరు నెలల వయస్సు గల కోడెలు వస్తున్నాయని చెబుతున్నారు.

చిన్న వయస్సు కోడెలు వస్తున్నాయి

భక్తులు సమర్పించే కోడెలు ఆరు నెలల వయస్సుగలవి.. పచ్చిగడ్డిని తినలేకపోతున్నాయి. అనారోగ్యంతో ఉన్న కోడెలు భక్తులు తీసుకొచ్చి వాటిని ఆలయం అవతల వదిలి వెళ్లిపోతున్నారు. వాటిని తీసుకొచ్చి గోశాలలో సంరక్షిస్తూ వైద్యం అందించినా మృత్యువాత పడుతున్నాయి. శిథిలావస్థలోని గోశాలషెడ్లను కూడా పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేశాము.

– శ్రీనివాస్, ఆలయ ఏఈవో, వేములవాడ

సిటీలో సంబురాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం.. ఉమ్మడి జిల్లాకుచెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కడంతో సంబరాలు మిన్నంటాయి. కరీంనగర్‌లో గురువారం తెలంగాణ ఉద్యోగ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సంబురాలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు ఎండీ ఆరీఫ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు.– కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్



నాకాచౌరస్తాలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ మైనార్టీ నాయకులు



తెలంగాణచౌక్‌లో స్వీట్లు పంచి సంబురాలు చేసుకుంటున్న మహిళా కాంగ్రెస్ నాయకులు



కలెక్టరేట్ ఎదుట సంబురాలు చేసుకుంటున్న తెలంగాణ ఉద్యోగ జేఏసీ లీడర్లు

'సాగు'డెట్లా..!

- యాసంగి సాగుకు కర్షకుల పాట్లు
- రాయితీ విత్తనాల్లేవ్.. పూర్తవని రుణమాఫీ
- అందని రైతుబంధు.. కానరాని పంట డబ్బులు
- అన్నదాతకు నలుదిక్కులా సమస్యలే..

కరీంనగర్‌అర్బన్: సకాలంలో పంటలు వేస్తేనే ప్రయోజనమన్నది శాస్త్రవేత్తల మాట. యాసంగి సీజన్ ప్రారంభమై 20రోజులు గడుస్తుండగా.. చేతిలో పెట్టుబడి ఖర్చుల్లేక దిక్కులు చూస్తున్నారు రైతులు. ఈ నేపథ్యంలో యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్నకు సమస్యలు నీడలా వెంటాడుతున్నాయి. ఎప్పటికప్పుడు అన్నదాతలకు అండగా నిలవాల్సి ఉండగా.. తదనుగుణంగా చర్యలు లేకపోవడం ఆందోళనకర పరిణామం. రైతులకు ప్రకటించిన రుణమాఫీ పూర్తవకపోగా.. రాయితీ విత్తనాల ఊసే లేదు. యాంత్రీకరణ పథకం పడకేయగా.. పండించిన ధాన్యాన్ని విక్రయిస్తే డబ్బులకు నిరీక్షించాల్సిన పరిస్థితి. బ్యాంకర్లు రుణాలిచ్చేందుకు కొర్రీలు పెడుతుండగా.. కూరగాయలు సాగు చేసేవారికి ప్రోత్సాహం కరవవడం, రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయమందాల్సి ఉండగా నేటికీ జాడ లేదు.

పలు పంటలకు ముగిసిన గడువు

ఆరుతడి పంటలపై అన్నదాతలు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఇప్పటికే పలు పంటలకు గడువు ముగియడం విశేషం. వేరుశనగ విత్తనాన్ని సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 లోగా విత్తుకోవాలి. అలాగే శనగ అక్టోబర్ 1 నుంచి నవంబర్ 15 వరకు, ఆవాలు అక్టోబర్ 1 నుంచి నవంబర్ 15, కుసుమ అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15, ఆముదం సెప్టెంబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు వేసుకోవాలన్నది శాస్త్రవేత్తల మాట. సకాలంలో విత్తనం వేస్తేనే పైరు ఎదుగుదల, పూత, కాత ఆశించినస్థాయిలో రానుండగా.. దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. నిర్దేశిత గడువు ముగిశాకా వేస్తే పెట్టుబడి రావడం గగనమే.

రాయితీ విత్తనాల ఊసేది..

యాసంగిలో రైతులు వరితో పాటు ఆరుతడి పంటలు వేయడం పరిపాటి. 2018 వరకు ఏటా రాయితీపై విత్తనాలు సరఫరా చేసేవారు కానీ.. అయిదేళ్లుగా ఆ ఊసే లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలపై నమ్మకముంటుండగా.. విత్తన లోపముంటే పరిహారం ఇచ్చేవారు. ఏళ్ల తరబడి రాయితీ విత్తనాలు లేకపోవడంతో ఆరుతడి పంటలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. డీసీఎంఎస్, ప్యాక్స్‌లలో విత్తనాలు ఇచ్చేవారు. కాగా భూసారం పెంచే విత్తనాలు మాత్రమే ఇస్తున్నారు. వేరుశనగ, శనగ, పెసర, మినుముల విత్తనాలకు స్వస్తి పలికారు.

వేయాల్సింది ఇక ఈ పంటలే..

ఏ పంట ఏ మాసంలో వేస్తే ఆశాజనకమో శాస్త్రీయంగా నిరూపితమయ్యాకే శాస్త్రవేత్తలు విత్తన గడువును నిర్దేశిస్తుంటారు. వారి సూచనల క్రమంలో ఆరుతడి పంటలు సాగు చేయాలంటే మిగిలిన పంటలు నువ్వులు, పెసర, మినుములు, పొద్దుతిరుగుడు, జొన్న మాత్రమే వేయాల్సి ఉంటుంది. నువ్వులు జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15, పెసర, మినుము డిసెంబర్ 10, పొద్దుతిరుగుడు, జొన్న విత్తనాలు డిసెంబర్ 31 వరకు వేసుకోవచ్చు.

రైతుకు రుణమెప్పుడో..

సకాలంలో రుణాలివ్వాల్సిన బ్యాంకర్లు ప్రతిఏటా కొర్రీలతో వేధిస్తున్నారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తి దశలో జరగకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అనువైన సమయంలో రుణాలందితే రైతన్నకు కొండంత అండ. అయిదేళ్లలో ఎపుడు కూడా లక్ష్యం మేర రుణాలిచ్చిన దాఖలాల్లేవు. మంత్రుల సమీక్షలో రుణాలిస్తామని తలలూపడం తప్పా ఆచరణలో అదే నిర్లక్ష్యం. గత ప్రభుత్వం రూ.25వేల రుణం ఏకకాలంలో, ఆపై రుణం తీసుకున్న వారికి నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. రుణమాఫీ కానివారు ఇంకా 25వేల మంది వరకుంటారని అంచనా.

రైతుబంధు ఏదీ..

అన్నదాతకు ఆర్థిక భరోసాగా ప్రభుత్వం పెట్టుబడి సాయం చేస్తుండగా.. ఇంకా అతీగతి లేదు. యాసంగి సీజన్‌కు గానూ ఎకరాకు రూ.5వేలు ఇస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో తక్షణమే సదరు సాయం అందాల్సిన అవసరముంది. జిల్లాలో గత సంవత్సరం యాసంగికి గానూ 1.48లక్షల మందికి గానూ 1.14లక్షల మంది రైతులకు రూ.100.48కోట్లు జమ చేశారు. ఇక ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పంట కొనుగోలు చేసిన 48గంటల్లోనే నగదు ఖాతాకు చేరుతుందని ప్రభుత్వం ప్రకటించగా.. క్షేత్రస్థాయిలో మాత్రం విరుద్ధ పరిస్థితి. రోజులు దాటినా డబ్బులు పడటం లేదని రైతులు వాపోతున్నారు. త్వరితగతిన ఖాతాకు నగదు మళ్లిస్తే పెట్టుబడికి ఆసరా.



యాసంగి సాగు అంచనా

పంట	అంచనా	సాగైంది
వరి	2,68,000	2,925
మొక్కజొన్న	25,000	1,298
పెసర	50	2
పత్తి	90	0
వేరుశనగ	450	210
పొద్దుతిరుగుడు	350	0
ఇతర పంటలు	6,238	277

క్లుప్తంగా

పంటల సాగుపై రైతులకు అవగాహన



పటం వేసి అవగాహన కల్పిస్తున్న అగ్రి విద్యార్థులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలో మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్ విద్యార్థులు పంటల సాగుపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గ్రామంలోని పంట భూములను పరిశీలించారు. గ్రామ పరిధిలోని వివిధ పంటలకు ఆశించిన తెగుళ్లను పరిశీలించి ఎరువులు, పురుగుమందులు ఎంత మోతాదులో వినియోగించాలనే విషయాలను వివరించారు. పంట వేసే విధానాలు స్థానిక రైతువేదికలో తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సీహెచ్ లక్ష్మణ్, అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు సుమేరా, సానియా, దివ్య, అక్షయ, శివాని, మేఘన, ప్రవళిక, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని(రామగుండం): క్లరికల్ సిబ్బందికి మెరుగైన క్యాడర్‌స్కీం అందిస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బొగ్గు వెలికితీసే పనుల్లో కూడా కాంట్రాక్టు కార్మికులను వాడటం సరికాదన్నారు. పర్మినెంట్ కార్మికులతో బొగ్గు తీసేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు ఎల్.ప్రకాశ్, కె.రాజరత్నం, అన్నారావు, కిరణ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి భక్తులకు నిత్యాన్నదానం



ప్రారంభిస్తున్న పావని

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి దీక్షాపరులకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు సతీమణి పావని ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భిక్షను ప్రారంభించారు. దీక్ష తీసుకున్న ప్రతి ఒక్కరూ నిత్య అన్నదానం ఉంటుందని, ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. పూజారి రమేశ్‌శర్మ, శ్రవణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజారి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాహిరి మహేందర్, మాజీ సర్పంచ్ సాహిరి పద్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, గురుస్వామి పాల్గొన్నారు.

అద్దకానికి 'ముసురు'దెబ్బ

- ఐదు రోజులుగా నిలిచిన డయింగ్
- సిరిసిల్లలో ఆగిన రంగుల అద్దకం
- కష్టాల్లో 'కాటన్ వస్త్ర' పరిశ్రమ
- కార్మికుల ఉపాధికి విఘాతం



అద్దకం పనిలో అల్లె సత్యనారాయణ

ఇతను అల్లె సత్యనారాయణ. జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన సత్యనారాయణకు అద్దకం(డయింగ్) యూనిట్ ఉంది. తను పనిచేస్తూ మరో ముగ్గురు కార్మికులకు పని కల్పిస్తున్నాడు. ఐదు రోజులుగా ముసురు వర్షం పడడంతో కాటన్‌వస్త్రానికి రంగుల అద్దకం నిలిచిపోయింది. నిత్యం ఆరు వేల మీటర్ల వస్త్రాన్ని వివిధ రంగుల్లో ఇక్కడ డయింగ్ అవుతుంది. కానీ ముసురుతో అద్దకం నిలిచిపోయి యూనిట్‌లో పని ఆగిపోయింది. ఫలితంగా సత్యనారాయణకు రోజుకు రూ.2వేల నష్టం వాటిల్లింది. ఆయన వద్ద పనిచేసే కార్మికులు రోజుకు ఒక్కొక్కరికి రూ.600 ఉపాధి కోల్పోయారు. సిరిసిల్లలో ఐదు రోజులుగా అద్దకం పరిశ్రమ ముసురుతో కుదేలైంది. ఇది ఒక్కరి.. ఇద్దరి పరిస్థితి కాదు.. సిరిసిల్ల కార్మికక్షేత్రంతో అద్దకం పరిశ్రమను నమ్ముకున్న అందరి పరిస్థితి ఇదే..



అద్దకానికి సిద్ధంగా ఉన్న కాటన్ వస్త్రాలు

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో కాటన్ బట్టది ప్రత్యేకమైన స్థానం. ఒకప్పుడు 20వేల మగ్గాలపై కాటన్ బట్ట ఉత్పత్తి అయ్యేది. పాలిస్టర్ బట్ట రాకతో క్రమంగా మూడు వేల మగ్గాలకు తగ్గిపోయింది. సిరిసిల్లలో ఉత్పత్తి అవుతున్న కాటన్‌వస్త్రాన్ని ఇక్కడే 42 రకాల రంగుల్లో డయింగ్ చేస్తారు. రంగుల బట్టను పట్టణ శివారుల్లో ఎండలో ఆరబెడతారు. కానీ ముసురు వర్షాలతో ఐదు రోజులుగా ఎండ పొడ లేక అద్దకం ఆగిపోయింది. సిరిసిల్లలో ప్రస్తుతం 48 అద్దకం యూనిట్లు ఉండగా.. ఈ రంగంపై ఆధారపడి వె య్యి కుటుంబాలు జీవిస్తున్నాయి. కాటన్‌వస్త్రాన్ని పెటీకోట్స్(లంగాలు)గా వినియోగిస్తున్నారు. సిరిసిల్లలో ఉత్పత్తి అవుతున్న కాటన్‌వస్త్రాలు ఐదు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా.. ఇటీవల ప్రతికూల పరిస్థితుల్లో కాటన్‌వస్త్రం కష్టాలను ఎదుర్కొంటుంది.

ఆగిన అద్దకం

సిరిసిల్లలో మూడువేల మగ్గాలపై కాటన్‌వస్త్రం ఉత్పత్తి అవుతుండగా ఒక్కో మగ్గంపై నిత్యం 100 మీటర్ల వస్త్రోత్పత్తి జరుగుతుంది. సిరిసిల్లలో నిత్యం మూడు లక్షల మీటర్ల కాటన్‌వస్త్రం ఉత్పత్తి అవుతుండగా.. ముసురు వర్షాలతో అద్దకం ఆగిపోయి వైట్ క్లాత్ నిల్వలు పేరుకుపోయాయి. రోజూ 48 అద్దకం యూనిట్లలో డయింగ్ ఏ రోజుకారోజు జరిగేది. కానీ ముసురు వర్షాలతో అద్దకం లేక బట్ట నిలవ్వలున్నాయి. అద్దకం చేసే డయింగ్ కార్మికులు నిత్యం తెల్లవారుజామున 4 గంటలకే డయింగ్ యూనిట్లకు చేరుకుని రంగులు అద్దుతారు. డయింగ్ అయిన బట్టను పట్టణ శివారులకు ఆటోల్లో తరలించి ఆరబెడతారు. మధ్యాహ్నం ఒంటి గంటకల్లా.. కార్మికుల పని పూర్తవుతుంది. అద్దకం ఆగిపోవడంతో సిరిసిల్లలోని డయింగ్ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.



సిరిసిల్ల అశోక్‌నగర్‌లో అద్దకం యూనిట్

పని లేక ఉట్టిగనే ఉన్నాం



నేను సిరిసిల్లలో డయింగ్ కార్మికుడిగా పనిచేస్తాను. నా భార్య మల్లీశ్వరి బీడీలు చేస్తుంది. మాకు ఇద్దరు పిల్లలు. పనిచేస్తే రోజుకు రూ.600 వస్తుంది. కానీ ఐదు రోజులుగా ముసురు వర్షాలతో పని లేక ఉట్టిగనే ఉన్న. పనిచేస్తేనే కూలి వస్తుంది. లేకుంటే లేదు. రోజు పని ఉంటేనే మాకు బతుకుదెరువు. ఉట్టిగ ఉండడం కష్టంగా ఉంది.

– యెలగొండ నగేశ్, డయింగ్ కార్మికుడు

పది మందికి పని లేదు



మా వద్ద డయింగ్ యూనిట్‌లో ఐదుగురు కార్మికులు, మరో ఐదుగురు ఇతర పనుల్లో ఉన్నారు. పది మందికి పని లేదు. ముసురు వర్షంతో డయింగ్ యూనిట్‌లో పనులు నిలిచిపోయాయి. ఎండలు కొడితేనే బట్ట ఆరుతుంది. డయింగ్ పరిశ్రమ నడుస్తుంది. ముసురుతో పనులు ఆగిపోయాయి. కాటన్ పరిశ్రమలో ఇంకా చాలా ఇబ్బందులు ఉన్నాయి. డయింగ్ యూనిట్లు చాలా వరకు మూతపడ్డాయి.

– ఆడెపు రవీందర్, డయింగ్ యజమాని

బీసీ సంఘాల హర్షం

కరీంనగర్: రాష్ట్ర మంత్రివర్గంలో బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ నియామకం పట్ల జిల్లా బీసీ సంఘాల పక్షాన హర్షం ప్రకటిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మూడున్నర దశాబ్దాలుగా విద్యార్థి ఉద్యమం నుంచి ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర వహించిన పొన్నం ప్రభాకర్ మంత్రి కావడం సంతోషంగా ఉందన్నారు. బీసీల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందని, బీసీలందరూ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటారని పేర్కొన్నారు.

సెల్‌టవర్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



శంకరపట్నం: మండలంలోని ఇప్పలిపల్లి అంగన్‌వాడీ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద సెల్‌టవర్ పనులను గురువారం గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. సెల్‌టవర్ నిర్మాణంతో పిల్లలపై రేడియేషన్ ప్రభావం ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా టవర్ పనులు చేపడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి టవర్ నిర్మాణ పనులు నిలిపి వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ..

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామం శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు...గీత కార్మికులు గురువారం ఉదయం ఎల్లమ్మ దేవాలయం వద్దకు వెళ్లే సరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయని, అమ్మవారి హుండీ, ముక్కుపుడక, మెడలో హారం ఎత్తుకెళ్లారని, గౌడసంఘం అధ్యక్షుడు దేశిని మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

పోలీసులమని హల్‌చల్

- ఒకరిని కారులో తీసుకెళ్లిన వ్యక్తులు
- ఇదేంటని అడిగిన మహిళపై దురుసు ప్రవర్తన

సిరిసిల్లక్రైం: సిద్దిపేట కమిషరేట్ పరిధిలోని దుబ్బాక ఠాణా పోలీసులమని కొందరు వ్యక్తులు సిరిసిల్లకు వచ్చి హల్‌చల్ చేశారు. అంతేకాదు ఓ దంపతులను బెదిరించారు. ఇదేంటని ప్రశ్నించగా.. వారి బైక్‌కు కారు అడ్డుపెట్టడంతో మహిళ చేయి విరిగింది. బాధితురాలు చికిత్స నిమిత్తం గురువారం సిరిసిల్ల ఆసుపత్రికొచ్చి తనకు జరిగిన అవమానాన్ని మీడియాకు వెల్లడించారు. పట్టణానికి చెందిన కవిత ఇంటికి కొందరు వచ్చారు. ఇంట్లో చొరబడి వెతుకుతుండగా ఆమె భర్త ఆ ఆగంతకులను నిలదీశారు. తాము పోలీసులమని, కొడుకు దుబ్బాకలో ఓ గొడవలో నిందితుడని చెప్పారు. అతను ఎక్కడ ఉన్నాడో తెలపాలని బెదిరించారు. అదే సమయంలో పోలీసులని చెప్పిన వాళ్లు నానా బూతులు తిడుతూ కవిత భర్త ప్రయాణిస్తున్న బైక్‌కు కారు అడ్డుగా పెట్టడంతో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ సంఘటనలో కవిత చేయి విరిగింది. వచ్చిన ఆగంతకులు ఆమె భర్తను కారులో తీసుకెళ్లారు. ఆటో నడుపుకునే తన కొడుకు దుబ్బాకలో ఏదో కేసులో ఉన్నాడని బెదిరించారని రోదించింది. ఈ విషయమై సిరిసిల్ల టౌన్ పోలీసులను వివరణ కోరగా కొందరు వచ్చి ఒకరి తీసుకెళ్లినట్లు సమాచారం కోసం పలువురు ఫోన్ చేశారని తెలిపారు. కానీ తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. ఒక జిల్లా పోలీసులు మరో జిల్లా పరిధిలోకి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తారని.. అలాంటి సమాచారం కూడా తమకు లేదని స్పష్టం చేశారు. అసలు వచ్చింది పోలీసులేనా? ఎవరైన కిడ్నాప్ గ్యాంగ్ సభ్యులా? అని స్థానికులు అనుమానిస్తున్నారు.

త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం



నుజ్జునుజ్జయిన లారీ క్యాబిన్



రాజీవ్ రహదారిపై పడిన ఇనుప కడ్డీలు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అలుగునూర్ చౌరస్తా సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం సాయంత్రం త్రుటిలో భారీ ప్రమాదం తప్పింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు భారీ ఐరన్ పట్టీల లోడ్‌తో వెళ్తున్న లారీ చౌరస్తా దాటిన అనంతరం ఓ కారు లారీని ఓవర్టేక్ చేస్తూ లారీకి సమీపంలోకి వచ్చింది. దీంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఇనుప స్తంభాలు ఒక్కసారిగా లారీ క్యాబిన్‌ను ఢీకొని రాజీవ్ రహదారిపై పడ్డాయి. ఇనుప స్తంభాలు ఢీకొనడంతో క్యాబిన్ నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో రాజీవ్ రహదారి వెంట వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులంటున్నారు. చెల్లాచెదురుగా ఇనుప కడ్డీలు రహదారిపై పడడంతో సుమారు అరగంటపాటు ట్రాఫిక్ జామయింది. తిమ్మాపూర్ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తన సిబ్బందితో చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఓటడిగే హక్కు టీబీజీకేఎస్‌కే ఉంది

- యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని(రామగుండం): వారసత్వ ఉద్యోగాలతో పాటు 60కిపైగా హక్కులు సాధించిన టీబీజీకేఎస్‌కే కార్మికుల ఓటు అడిగే హక్కు ఉందని యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. గురువారం వకీల్‌పల్లిగనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమ్మెలు, ఆందోళనలు లేకుండా 60కిపైగా హక్కులు సాధించామని ఆయన గుర్తు చేశారు. కారుణ్య నియామకాలు, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 19వేలకు పైగా ఉద్యోగాలను సింగరేణిలో కల్పించాలమన్నారు. కొంతమంది టీబీజీకేఎస్ నాయకులు యూనియన్ మారతారని దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటి దుష్ప్రచారాన్ని కార్మిక వర్గం తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఐలి శ్రీనివాస్, దేవ వెంకటేశం, మల్లికార్జున్, సంపత్‌రెడ్డి, రాములు, రాజారాం, రాకేష్, సంతోష్ పాల్గొన్నారు.

గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలి

- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కె.స్వామి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): అవినీతి, అరాచకానికి అడ్డాగా టీబీజీకేఎస్ మారిందని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కె.స్వామి విమర్శించారు. గురువారం ఆర్జీ–1 ఏరియా సివిల్ విభాగంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటే ఈనెల 27న జరిగే గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలన్నారు. రాజకీయ రంగం వేరు, కార్మిక రంగం వేరని అసలు సిసలైన ట్రేడ్ యూనియన్‌గా బాధ్యత గల సంఘంగా, పోరాటాల చరిత్ర కలిగిన యూనియన్‌గా ఉందన్నారు. అనేక హక్కుల సాధనలో పోరాటాలు చేసి సాధించుకున్న చరిత్ర తమ యూనియన్‌కు ఉందన్నారు. సమావేశంలో నాయకులు గండి ప్రసాద్, తాని రాజబాబు, ఆకునూరి శంకరయ్య, లక్ష్మీనారాయణ, జె.దేవయ్య, బొల్లి శ్రీనివాస్, తాళ్లపెల్లి లక్ష్మయ్య, బి.రామకృష్ణారెడ్డి, జనగామ రఘునాథ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వలస కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం: గుండెపోటుతో వలస కార్మికుడు మృతిచెందినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం షాడోల్ జిల్లాకు చెందిన రాంబాబు (38) కరీంనగర్‌లోని కట్టరాంపూర్ స్మార్ట్ సిటీ క్యాంప్ ఆఫీస్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అనారోగ్యంతో సొసైటీ వైస్ చైర్మన్ మృతి



రమణారెడ్డి ఫైల్

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎల్లాల రమణారెడ్డి (41) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడిగా మండలంతోపాటు గ్రామంలో సౌమ్యుడిగా పేరొందిన రమణారెడ్డి కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతిచెందగా గురువారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు మృతదేహానికి నివాళులర్పించారు. రమణారెడ్డి రెండుసార్లు పొరండ్ల సొసైటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు.

'వాగేశ్వరి'లో రక్తదాన శిబిరం

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ సహకారంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసిన అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్ ప్రకాశ్‌రెడ్డి, వి.వినోద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.సాయినాథ్, వివిధ విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ శివారులోని గుంటపల్లి చెరువుతండాకు వెళ్లే రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కోనరావుపేట మండలం మరిమడ్ల శివారు తండాకు చెందిన గుగులోతు శ్రీరామ్, భూక్య నవీన్, సంపత్ ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా అడవిపంది అడ్డుగా వచ్చింది. వేగంగా ఉన్న వాహనం అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో శ్రీరామ్ తలకు బలమైన గాయాలవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. ప్రస్తుతం వీరంతా సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మార్గంలో 15 రోజుల వ్యవధిలో మూడుసార్లు అడవిపందులు అడ్డుగా రావడంతో ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. అడవిపందులు రాత్రి పూట రహదారిపైకి రావడంతో ప్రమాదాలు జరగడంపై అటవీప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఆందోళన గురవుతున్నారు.

'పది' పరీక్షలకు ఫీజు ఖరారు

- ఒక్కో విద్యార్థి రూ.125 చెల్లించాలి
- అపరాధ రుసుం లేకుండా నేటి వరకు అవకాశం
- రూ.50 అపరాధ రుసుంతో 15 వరకు గడువు
- రూ.200తో 23 వరకు అవకాశం
- రూ.500 ఫైన్‌తో జనవరి 4 వరకు గడువు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించే విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయడానికి చెల్లించే ఫీజు తేదీలను విద్యాశాఖ ప్రకటించింది. ఈ నెల 8వ తేదీ వరకు అపరాధరుసుం లేకుండా ఫీజు చెల్లించేందుకు అవకాశం ఇచ్చింది. రూ.50 నుంచి రూ.500 వరకు అపరాధ రుసుం చెల్లించి జనవరి 4వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించేందుకు అవకాశం ఇస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.125 ఈనెల 8 వరకు సబ్‌ట్రెజరీలో జమచేసి, విద్యార్థుల వివరాలను ఈనెల 11, 12వ తేదీల్లో డీఈవో ఆఫీస్‌లో సమర్పించాలని సూచించింది. గతంలో సబ్‌ట్రెజరీ చలానా సాధారణ విధానంలో ఎంట్రీ తీసుకోవాల్సి ఉండగా ఈ ఏడాది పరీక్ష విభాగం వైబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పాఠశాల కోడ్‌ను ఎంటర్ చేయగానే చలానా ప్రింట్ తీసుకుని బ్యాంకులో డబ్బులను జమచేస్తే సరిపోతుంది. విద్యార్థుల వివరాలను ఎస్ఆర్స్‌లో పొందుపరిస్తే సరిపోతుంది.

ఫీజు మినహాయింపునకు అవకాశం

పదోతరగతి పరీక్ష ఫీజు రూ.125 లేకుండా పరీక్ష రాసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పరీక్షల బోర్డు వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.24వేల లోపు, అర్బన్ ఏరియాలో రూ.20వేల లోపు ఉండి, 25 ఎకరాల భూమి తడి నేల, 5 ఎకరాల పొడి నేల కంటే ఎక్కువగా కాకుండా ఉంటే ఫీజు మినహాయింపు వర్తిస్తుంది. రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.125 కాగా మూడు అంతకంటే తక్కువ సబ్జెకులకు పరీక్ష రాసే వారికి రూ.110, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ పరీక్ష రాసే వారికి రూ.125, ఒకేషనల్ విద్యార్థులకు రెగ్యులర్ విద్యార్థుల కంటే అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుంది.

కార్మికుల సంక్షేమం కోసం కృషి



మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): కార్మికుల సంక్షేమం బీఎంఎస్ అహర్నిశలు శ్రమిస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గురువారం జీడీకే–5 ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 7వ దఫా నిర్వహిస్తున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కాగడా గుర్తుకు ఓటు వేసి బీఎంఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్మికుల సంక్షేమం, విద్య, వైద్య, ఆరోగ్యంలో రాజీలేకుండా ముందుకు సాగుతామన్నారు. తెలంగాణ ప్రాంతంలో గోదావరి పరివాహక ప్రాంతం చుట్టూ అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, నూతన బొగ్గు గనుల ద్వారా ఉద్యోగ అవకాశాలు పెంచుకునేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రావాలిన్న విద్యుత్ బొగ్గు బకాయిలు సుమారు రూ.26వేల కోట్లు సింగరేణి యాజమాన్యానికి చెల్లించాలన్నారు. కోలిండియా మాదిరిగా అలవెన్సులపై ఆదాయ పన్ను రియింబర్స్‌మెంట్ చెల్లించేలా చూస్తామని వివరించారు. సమావేశంలో నాయకులు మాదాసి రవీందర్, ఆకుల హరిణ్, సతీశ్, రాజు, పల్లె శ్రీనివాస్, తాట్ల ల క్ష్మయ్య, పోరండ్ల వెంకటేశం, రాపోలు వజ్రవేణు, వెంకట్‌రెడ్డి, జనగామ రవీందర్ పాల్గొన్నారు.

దేవునిపల్లి జాతర ఆదాయం రూ.15.52లక్షలు



ఆలయ ఆవరణలో హుండీ లెక్కింపు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహుని జాతర ఆదాయం రూ.15.52లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. గతనెల 24 నుంచి డిసెంబర్ 3వరకు జరిగిన బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన కానుకలను గురువారం ఆలయ కమిటీ, గ్రామస్తుల సమక్షంలో లెక్కించినట్లు ఆయన చెప్పారు. ఇందులో టికెట్ల ద్వారా రూ.2,17,684 ఆదాయం సమకూరగా, వేలం ద్వారా రూ.6,78,750 హుండీ ద్వారా రూ.6,56,501 సమకూరిందని వెల్లడించారు. అలాగే 300 మి.గ్రా. బంగారం, 310 గ్రాముల వెండిని భక్తులు కానుకగా స్వామివారికి సమర్పించారని పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిన దశరథం



సంఘంలోకి ఆహ్వానిస్తున్న జనక్ ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ: టీబీజీకేఎస్ కార్మిక సంఘం కేంద్ర కమిటీకి రాజీనామా చేసిన నాచగోని దశరథంగౌడ్ గురువారం ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘంలో చేరారు. బుధవారం టీబీజీకేఎస్ సంఘం సభ్యత్వానికి రాజీనామా చేసిన దశరథం గురువారం గోదావరిఖని జనక్ భవన్‌లో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. నాయకులు సంపత్‌రెడ్డి, శంకర్ నాయక్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



నివాళి అర్పిస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్: రెండో డివిజన్ కార్పొరేటర్ కాశెట్టి శ్రీనివాస్ మాతృమూర్తి తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ కాశెట్టి రంగమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రంగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎమ్అండ్‌హెచ్‌వో



తనిఖీ చేస్తున్న చందు

శంకరపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నియామకం



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న ప్రణయ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన ఇమ్మడి ప్రణయ్‌ని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ ఆర్‌సీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీరాముల రమేశ్ ఉత్తర్వులు అందజేశారు. తనవంతు బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామన్నారు. నియమాకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్, ప్రధాన కార్యదర్శి విలాసాగరం పృథ్వీరాజ్, రాష్ట్ర మీడియా విభాగం కార్యదర్శి సంజీవరావు, అధికార ప్రతినిధి గుంటి స్వరూపకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని చెంజర్ల గ్రామంలో గురువారం సన్‌షైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామ ప్రజలకు బీపీ, గుండె సంబంధిత పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శిరీష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ లబ్ధిదారులు వివరాలు నమోదు చేసుకోవాలి

హుజూరాబాద్: ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా ఉచిత వంట గ్యాస్ కెనెక్షన్ పొందిన లబ్ధిదారులు సిలిండర్ రాయితీ పొందేందుకు విధిగా కనెక్షన్లు పొందిన డీలర్ల ద్వారా ఆధార్ బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని తెలంగాణ ఎల్‌పీజీ డీలర్ల మీడియా ఇన్‌చార్జి పీవీ మదన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అంశాన్ని తప్పనిసరి చేసిందని ప్రభుత్వ రాయితీకి కష్టమర్లు డిసెంబరు 31 లోగా బయోమెట్రీ నమోదు చేసుకోవాలన్నారు.

బిలివర్ చర్చిలో క్రీస్తు సందేశం



హుజూరాబాద్: పట్టణంలోని బిలివర్ చర్చిలో గురువారం పాస్టర్స్ క్రిస్మస్ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ క్రీస్తు సందేశం చదివి వినిపించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్స్ అధ్యక్షుడు టీ. జాషువా, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి సీహెచ్ జాన్‌పాల్, మండలాధ్యక్షుడు సత్యరాజ్ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌షా

పొన్నం ప్రభాకర్



మొదటిసారి మంత్రి పదవి
నెరవేరిన 70 ఏళ్ల కల

కరీంనగర్: పొన్నం రాజకీయ చరిత్రలో మంత్రి పదవి దక్కడం ఇదే మొదటిసారి. నుస్తులాపూర్, ఇందుర్తి, హుస్నాబాద్‌తో ఆయనకు అనుబంధం ఉంది. అయినా మంత్రి పదవి నోచుకోలేదు. గతం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఇక్కడ మాత్రం ప్రతిపక్షమే ఉండేది. ఇందుర్తి నుంచి హుస్నాబాద్‌కు మారినా నియోజకవర్గం నుంచి మొదటి సారిగా కాంగ్రెస్ నుంచి ప్రవీణ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ మంత్రి పదవికి నోచుకోలేదు. తదనంతరం 2014, 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్(ప్రస్తుత బీఆర్‌ఎస్) నుంచి ఒడితెల సతీశ్‌కుమార్ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పుడు కూడా టీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ హుస్నాబాద్‌కు మంత్రి పదవి దక్కలేదు. 2014లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పార్లమెంట్ కార్యదర్శిగా ఉన్నారు. 2009లో సీపీఐ నుంచి చాడ వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ సమయంలో చాడ వెంకట్‌రెడ్డి శాసనసభ పక్ష నేతగా ఉన్నారు. ఇప్పటికి హుస్నాబాద్‌కు మంత్రి పదవి వరించడం విశేషం.

పొన్నంకు కలిసొచ్చిన హుస్నాబాద్

విద్యార్థి నాయకుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం మొదలై ఉమ్మడి ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్‌గా, ఎంపీగా, నేడు మంత్రి పదవిని అధిరోహించారు. కరీంనగర్ ఎంపీగా పొన్నం ప్రభాకర్ గెలిచిన సమయంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఆయనకు ఉన్నత పదవులు దక్కలేదు. ఉమ్మడి ఏపీ పార్లమెంట్ సభ్యుల కన్వీనర్‌గా పని చేశారు. కరీంనగర్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసినా అక్కడి ప్రజలు ఆదరించలేదు. తన రాజకీయ భవిష్యత్ కోసం అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఈ సారి హుస్నాబాద్‌ను ఎంచుకున్నారు. బీఆర్‌ఎస్ కంచుకోటలో పాగా వేసి హుస్నాబాద్‌ను హస్తగతం చేసుకొని మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిపొందారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకే ఒక్కడుగా పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అందులో భాగంగా సిద్దిపేట జిల్లాలోని కేసీఆర్, హరీశ్‌రావు ఇలాకాలో పొన్నం ప్రభాకర్ మంత్రిగా ఉండడం పెద్ద సవాల్‌గా చెప్పుకోవచ్చు. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాలైనా సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల పరిధిలో ఉంది. అది కూడా ఆయనకు మరో సవాల్‌గా మారనుంది. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలువడం, కాంగ్రెస్ అధిష్టానంతో సత్సంబంధాలు కలిగి ఉండడం, బీసీ సామాజిక వర్గంలో బలమైన నాయకుడు కావడంతో క్యాబినెట్‌లో చోటు దక్కింది. బీసీ కోటా నుంచి పొన్నంకు మంత్రి పదవి దక్కడం హుస్నాబాద్ నియోజకవర్గం ఆయనకు కలిసి వచ్చిందనే చెప్పుకోవచ్చు. పొన్నం రాజకీయ భవిష్యత్‌కు పునాది పడడమే కాకుండా, ఉద్యమాల గడ్డ, చైతన్య ప్రాంతమైన హుస్నాబాద్‌ను మొదటి సారి మంత్రి పదవి వరించడం ఈ ప్రాంతానికి శుభ పరిణామమే.

70 ఏళ్ల తర్వాత

నాడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నుస్తులాపూర్ నియోజకవర్గం, నిన్న ఇందుర్తి, నేడు హుస్నాబాద్ నియోజకవర్గంగా పునరుద్ధరింపబడినా 70 ఏళ్లల్లో ఏనాడూ హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మంత్రి పదవి లభించక అభివృద్ధికి నోచుకోలేదు. ఈ మారు ఎన్నికల్లో విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌కు క్యాబినెట్ హోదా దక్కడంతో హుస్నాబాద్ నియోజకవర్గ దశ, దిశ మారబోతుందని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యావంతుడు, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించడం కూడా మంత్రి పదవి దక్కడంలో ప్రధాన కారణాలుగా చెప్పుకోవాలి. హుస్నాబాద్ ప్రాంతానికి మంత్రి పదవి దక్కడంతో 70 ఏళ్ల కల నెరవేరింది. హుస్నాబాద్ దశ, దిశ మారి అభివృద్ధి వైపు అడుగులు పడుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.







వామ్మో చలి

మిచాంగ్ తుపాను ప్రభావంతో మూడురోజులుగా చలిపంజా విసురుతోంది. దీనికితోడు ఈదురుగాలులు, వర్షం కురుస్తుండడంతో వృద్ధులు, చిన్నపిల్లలు, మధ్య వయస్సువారు సైతం చలితో గజగజ వణికిపోతున్నారు. దీంతో నేపాల్ నుంచి వచ్చి ఉన్నిదుస్తులు విక్రయిస్తున్న షాప్‌ల వద్ద కొనుగోళ్లతో సందడిగా నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్





సంబరాల్లో దివ్యాంగులు





కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దివ్యాంగురాలికి ఉద్యోగం ఇవ్వడం పట్ల తెలంగాణ చౌక్‌లో సంబురాలు జరుపుకుంటున్న దివ్యాంగులు

కరీంనగర్‌టౌన్: దివ్యాంగురాలు రజనీకి తొలి ఉద్యోగం ఇవ్వడంతో దివ్యాంగుల్లో ఆత్మగౌరవం పెరిగిందని తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మొగిలి లక్ష్మయ్య, నందగిరి జగదీశ్వరాచారి తెలిపారు. గురువారం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి రజనీకి ఉద్యోగం ఇచ్చిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రోజే ఉద్యోగ నియామకపత్రం ఇవ్వడంతో నిరుద్యోగుల్లో ఆనందం వెల్లువెత్తుతుందన్నారు. తొమ్మిదేళ్లుగా ఎదురుచూసిన వారికి ఉద్యోగాలు వస్తాయనే ఆత్మవిశ్వాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పర్శరాములు, రాజన్న, కార్తీక్, రాములు, జక్కం సంపత్, వెన్నం శ్రీనివాస్, కొత్తూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.



చిగురుమామిడిలో టపాసులు పేల్చుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు



రామడుగులో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

← కాంగ్రెస్ నాయకుల సంబురాలు

చిగురుమామిడి: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి పదవి పొందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఓరుగంటి భారతిదేవి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, సుందరగిరి సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల రమేశ్, సోషల్ మీడియా కన్వీనర్ బోయిని వేణుగోపాల్, నాయకులు సంతోష్‌రెడ్డి, శివకుమార్, లక్ష్మణ్, సుధాకర్‌రెడ్డి, రాజు, పాల్గొన్నారు.

రామడుగు: రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేయడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పూరెల్ల రాజగోపాల్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కోల రమేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వీరయ్య, ఆసిఫ్, బాపిరాజు, బాబు, శ్రీనివాస్, రవి, లక్ష్మణ్, పోచయ్య, చిన్నా, సల్లావుద్దీన్, మనీశ్ పలువురు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ తయారు చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్: కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ముందస్తు క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కిమ్స్ విద్యా సంస్థల వైస్‌చైర్మన్ సాకేత్ రామారావు హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. కేక్ తయారీ విధానంలో అవసరమయ్యే వివిధ రకాల ఆల్కహాల్స్, డ్రై ఫ్రూట్ కలిపి, కేక్, మొదలైన తినుబండారాలు తయారు చేసే విధానం చూసి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. హోటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ అనూశ్ రెడ్డి పాల్గొని దేశ విదేశాల్లో 125 పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని గుర్తు చేశారు. అంతేకాకుండా హోటల్ మేనేజ్ మెంట్‌లో ఉపాధి, ఉద్యోగ అవకాశాల గూర్చి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు డా. శాలిని, సహజ, అధ్యాపక బృందం హరీశ్, యశ్వంత్, మనోజ్, సృజన, రజిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగవిరమణ పొందిన హోంగార్డ్‌కు సన్మానం



కరీంనగర్‌క్రైం: రఘునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న సీపీ అభిషేక్‌మహంతి, పోలీస్ సిబ్బంది



హుజూరాబాద్: సన్మానిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ రమేశ్, తదితరులు

కరీంనగర్‌క్రైం/హుజూరాబాద్: కరీంనగర్ కమిషనరేట్ పరిధి హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఏ.రఘునాథ్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సీపీ అభిషేక్ మహంతి గురువారం ఆయనను సన్మానించారు. అంకితభావంతో పోలీస్‌శాఖకు సేవలందించి ఎటువంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ పొందినందుకు అభినందించారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.5వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏసీపీ (ఏఆర్) ప్రతాప్, రజనీకాంత్ (ఆర్‌ఐ, హోంగార్డ్స్), ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ రమేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కోరా పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: నగరంలోని కోరా హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన అండర్–14 ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో సాయిశ్రీజ, సాయిశరణ్య, శ్రీహిత ప్రతిభ కనబర్చారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ దుర్గరాజును ప్రత్యేకంగా అభినందించారు.



వైభవంగా పడిపూజ

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో గురువారం శ్రీఅయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ ఏల్లయ్య, పలు గ్రామాల అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సీఎం పదవి ఆశించింది నిజమే: భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని ఆశించిన మాట నిజమేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అంగీకరించారు. ప్రమాణ స్వీకారోత్సవం తర్వాత తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. అందరికీ పదవులు దక్కడం అసాధ్యమని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని అన్నారు. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

జనరంజకంగా పనిచేస్తా: పొన్నం
ప్రజల కోసం సేవకుడిగా పనిచేస్తా. ఎంపీగా ఉంటూనే తెలంగాణ కోసం పోరాడా. కరీంనగర్ ప్రజల కోసం ఎంతో చేశా. మంత్రిని అవుతానని ముందే ఊహించా. ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటా.

ప్రజలకు సేవ చేయడంపైనే దృష్టి: పొంగులేటి
ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటూ వారికి సేవలు చేస్తాం. గత ప్రభుత్వంలోలా కక్షపూరితంగా వ్యవహరించం. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేసి చూపిస్తాం.

ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు రాజీనామా



హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు రాజీనామా చేశారు. గురువారం తన రాజీనామా లేఖను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధా న కార్యదర్శికి పంపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వా త 2016, అక్టోబర్ 20న ఆయన మొదటిసారి సీఎండీగా నియమితులయ్యారు. అనంతరం 2019 మే 29న ఆయనను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశా రు. ఏడేళ్లకు పైగా గోపాల్‌రావు పదవిలో కొనసా గారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పదవిలో ఉండి సేవ చేసే అవకాశం లభించిందని సంతృప్తి వ్యక్తం చేశారు. అధికా రులు, ఉద్యో గులు ఎంతగానో సహకరించార న్నారు. ఎన్పీడీసీ ఎల్‌కు అవార్డులు రావడం అధికారుల, ఉద్యోగుల అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. తనకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచే ఆర్టీసీ బస్సుల్లో.. మహిళలకు ఉచిత ప్రయాణం

సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ భేటీలో నిర్ణయం
- ఆరు గ్యారంటీలలో రెండింటి అమలుకు పచ్చజెండా
- మిగతా హామీల అమలుపై మంత్రివర్గంలో సుదీర్ఘ చర్చ



ముఖ్యమంత్రిగా తొలి కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్క

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో ప్రధానమైన ఆరు గ్యారంటీలలో రెండింటిని సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా శనివారం నుంచే (ఈనెల 9) అమల్లోకి తేవాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో దీనికి పచ్చజెండా ఊపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సల పరిమితిని రూ.10 లక్షలకు పెంచే హామీల అమలుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షించి, దశలవారీగా పకడ్బందీగా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆలోచనకు వచ్చారు. ఈ భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు.

ఆరు గ్యారంటీలపై సుదీర్ఘ చర్చ
కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలపై కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్టు మంత్రులు తెలిపారు. ఈ హామీలను దశలవారీగా పూర్తిస్థాయిలో అమలు చేయాలని తీర్మానించినట్టు వివరించారు. ఆరు గ్యారంటీలతోపాటు ప్రజలకు ఇచ్చిన ఇతర హామీలను ఐదేళ్లలోగా నెరవేర్చడమే తమ ప్రభుత్వ కర్తవ్యమన్నారు. ముందుగా ఈ నెల 9వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఆధార్, రేషన్‌కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొని బస్సుల్లో వెళ్లవచ్చని తెలిపారు.

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం
మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా చర్చ జరిగిందని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. "2014 నుంచి గురువారం (డిసెంబర్ 7వ తేదీ) వరకు రాష్ట్ర ఆర్థిక స్థితిగతులకు సంబంధించి ఏయే ప్రభుత్వ విభాగాలు ఎంత ఖర్చు చేశాయి? దేని కోసం, ఏం ప్రయోజనాల కోసం ఖర్చు చేశాయి? ఆ ఖర్చులతో ఒనగూరిన ప్రయోజనాలేమిటన్న అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు వివరాలు అందజేయాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన ఖర్చు, చేకూరిన ప్రయోజనాలు తెలంగాణ ప్రజలందరికీ తెలియజేసేలా అన్ని వివరాలు కావాలని అధికారులను ఆదేశించారు" అని మంత్రులు వివరించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసి, గ్యారంటీల అమలుకు అవసరమైన ఆర్థిక వనరులను సేకరించి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్టు తెలిపారు. గ్రూప్-1, 2 పరీక్షల అంశంపైనా కేబినెట్ చర్చించినట్టు వివరించారు.

నేడు విద్యుత్ అధికారులతో సమావేశం
రాష్ట్రంలో రైతులకు, పరిశ్రమలకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ అందించాలని మంత్రివర్గం సమావేశంలో తీర్మానించినట్టు మంత్రులు వెల్లడించారు. ఈ క్రమంలో 2014 నుంచి ఇప్పటివరకు విద్యుత్ అంశానికి సంబంధించి చోటు చేసుకున్న తప్పుడు నిర్ణయాలపై చర్చించామని, ఆయా అంశాల్లో అధికారుల వివరణ కోరామని తెలిపారు. శుక్రవారం విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి, అధికారులతో సీఎం రేవంత్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు వివరించారు. గత పదేళ్లలో విద్యుత్‌కు సంబంధించి అనేక అంశాల్లో తప్పులు జరిగాయని, వాటిని సమీక్షించి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా అమలుపైనా చర్చించనున్నట్టు వెల్లడించారు.

9న కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
కొత్త శాసనసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని 9వ తేదీన చేపట్టాలని కేబినెట్ భేటీలో నిర్ణయించినట్టు మంత్రులు తెలిపారు. ఇందుకోసం అసెంబ్లీలో సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా ఎన్నుకోవడం జరుగుతుందని.. తర్వాత స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. పూర్తి స్థాయి కేబినెట్ కూర్పుపై సీఎం, పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు.

రెవెన్యూ గ్రామంగా జయశంకర్ ఊరు
వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి గురువారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం అక్కంపేట గ్రామం పెద్దాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉంది. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ఇంద్రవెల్లి గ్రామం-బి లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం సుందరీకరణ, అభివృద్ధి కోసం ఎకరం భూమి కేటాయిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనులను వెంటనే చేపట్టాలని ఆదిలాబాద్ కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు.

హాట్ హాట్‌గా ఫస్ట్ కేబినెట్!

- ఆర్థిక, విద్యుత్ రంగాలపై ప్రధానంగా చర్చ
- ఆర్థిక శాఖ పనితీరుపై సీఎం రేవంత్ అసంతృప్తి
- ఇష్టారాజ్యంగా డబ్బులు విడుదల చేశారంటూ ఆగ్రహం
- విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించే కుట్ర జరిగిందన్న ముఖ్యమంత్రి?
- నేటి సమీక్షకు సీఎండీ ప్రభాకర్‌రావును పిలవాలని ఆదేశం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన మంత్రిమండలి తొలి భేటీనే వాడివేడిగా సాగినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆర్థిక, విద్యుత్ రంగాలపైనే ఎక్కువగా చర్చ జరిగిందని సమాచారం. ముఖ్యంగా ఆర్థిక శాఖ పనితీరుపై సీఎం రేవంత్ అసంతృప్తి వ్యక్తం చేశారని తెలుస్తోంది. గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు, వారి సన్నిహితులైన కాంట్రాక్టర్ల కోసం, నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని తెలిసినా ఇష్టారాజ్యంగా డబ్బులు విడుదల చేశారని, ప్రజాధనం లెక్క లేకుండా ఖర్చు పెట్టారని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. గత పదేళ్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలను ఇవ్వాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును సీఎం ఆదేశించినట్టు సమాచారం.

విద్యుత్ శాఖ పరిధిలో రూ.85 వేల కోట్ల అప్పులు
విద్యుత్‌రంగంపై కూడా హాట్‌హాట్ చర్చ జరిగింది. విద్యుత్‌పై ప్రత్యేక సమీక్షలో భాగంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ.. శాఖ పరిధిలో రూ.85 వేల కోట్ల అప్పులు ఉన్నట్టు వివరించారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.. అసలు రాష్ట్రంలోని విద్యుత్ పరిస్థితిని దాచిపెడుతున్నారని, విద్యుత్ సంక్షోభం సృష్టించే కుట్ర జరుగుతోందని విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. శాఖకు సంబంధించిన పూర్తి వివరాలతో శుక్రవారం సమీక్షకు హాజరు కావాలని ఆయన ఆదేశించినట్టు తెలిసింది. అలాగే ఇటీవల రాజీనామా చేసిన విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావును కూడా ఈ సమావేశానికి రప్పించాలని, ఆయన రాజీనామాను ఆమోదించవద్దని కూడా సీఎం కరాఖండిగా ఆదేశించినట్టు ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నీతి ఆయోగ్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణకు అగ్రస్థానం

- ఏబీపీ డెల్టా వన్ ర్యాంకింగ్స్ టాప్‌లో తిర్యాని బ్లాక్

సాక్షి, న్యూఢిల్లీ: కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాని బ్లాక్‌కు యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం (ఏబీపీ) ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కింది. గురువారం నీతి ఆయోగ్ వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో మొదటి ఏబీపీ డెల్టా ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. ఇందులో దేశవ్యాప్తంగా 329 జిల్లాలు, 500 యాస్పిరేషనల్ బ్లాక్‌లు పాల్గొన్నాయని తెలిపింది. 2023 జూన్‌లో కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ)లో బ్లాకుల పనితీరు, సాధించిన ప్రగతి, పురోగతి ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లు ఇచ్చినట్టు వివరించింది. 2023 మార్చి 31, జూన్ 30 నాటి త్రైమాసికానికి సంబంధించిన 500 యాస్పిరేషనల్ బ్లాక్ బేస్‌లైన్ డేటా, 11 మంత్రిత్వ శాఖల నుంచి సమాచారాన్ని సేకరించినట్లు నీతి ఆయోగ్ వెల్లడించింది. మొదటి త్రైమాసికంలో సాధించిన మెరుగుదల ఆధారంగా 1వ డెల్టా ర్యాంక్‌లను నిర్ధారించినట్లు వివరించింది. మరోవైపు, బ్లాకులను భౌగోళికంగా ఆరు జోన్లుగా విభజించింది. దీనిలో భాగంగా ఒక్కొక్క జోన్ నుంచి రెండు బ్లాకులను టాప్ ర్యాంకర్లుగా గుర్తించినట్లు నీతి ఆయోగ్ తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల జోన్‌లో ఆదిలాబాద్ నర్నూరు బ్లాక్, కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లోని మాస్కి బ్లాక్ విజేతలుగా నిలిచాయని పేర్కొంది.

లోక్‌సభ ఎన్నికలకు కొత్త ఓటర్ల జాబితా

- ప్రత్యేక సవరణ-2024 షెడ్యూల్ ప్రకటించిన ఈసీ
- 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- జనవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే జనవరి 1 అర్హత తేదీగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2024 షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న యువతతో పాటు ప్రస్తుత ఓటరుజాబితాలో పేరు లేని వారి నుంచి సైతం దరఖాస్తులను స్వీకరించనున్నారు. జనవరి 6 నుంచి సవరణ ప్రారంభం కానుండగా, అంతకు ముందు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, సెక్షన్ల ఏర్పాటు, ఓటర్ల జాబితా/ఫొటో ఓటరు గుర్తింపు కార్డుల్లో లోపాల దిద్దుబాటు, ఓటర్ల జాబితాలో సరైన ఫొటోలు ముద్రించడం, పోలింగ్ కేంద్రాల సరిహద్దుల వారీగా సెక్షన్లు/పార్టుల పునర్విభజన తదితర చర్యలను జనవరి 5 వరకు పూర్తి చేయనున్నారు. జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. నాటి నుంచి జనవరి 22 వరకు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. ముసాయిదా జాబితాలో తప్పులు/లోపాల దిద్దుబాటు, ఓటరు చిరునామా మార్పు కోసం సైతందరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించనున్నారు. ఫిబ్రవరి 2లోగా దరఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 6న తుది ఓటర్ల జాబితా నాణ్యతను పరిశీలించడంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఆమోదముద్ర తీసుకుంటారు. ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

డోర్ టూ డోర్ సర్వే
బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) తమ వద్ద ఉన్న ప్రస్తుత ఓటర్ల జాబితాను తీసుకుని ఇంటింటికీ తిరిగి కుటుంబ పెద్దను కలవడం ద్వారా సంబంధిత ఓటర్లు ఉన్నారా? లేదా? అన్న విషయంపై పరిశీలన జరపనున్నారు. 2024 జనవరి 1తో పాటు ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న యువత సైతం కొత్త ఓటర్లుగా నమోదు కావడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే 18 ఏళ్లు నిండిన తర్వాతే వారికి ఓటు హక్కు కల్పిస్తారు.

బీజేఎల్పీ నేతగా రాజాసింగ్?



సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ శాసనసభ పక్షనేత (బీజేఎల్పీ) నేతగా గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ నియమితులయ్యే అవకాశాలున్నాయి. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయనకే ఈ అవకాశం లభించనుందని పార్టీ వర్గాల సమాచారం. రెండుసార్లు గెలుపొందిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బీజేఎల్పీ ఉప నాయకుడిగా నియమించవచ్చునని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి మొత్తం 8 మంది గెలవగా, వారిలో ఈ ఇద్దరు మినహా మిగతా వారంతా తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన వారే. కొత్త ఎమ్మెల్యేలను పార్టీ విప్‌లు, ఇతర పదవుల్లో నియమించనున్నట్టు సమాచారం.

విడిగా బీజేపీ శాసనసభాపక్ష కార్యాలయం
ఎనిమిది మంది ఎమ్మెల్యేల బలం ఉన్నందున ఈ సారి బీజేఎల్పీ నేత నియామకంతో పాటు అసెంబ్లీ ఆవరణలో విడిగా శాసనసభాపక్ష కార్యాలయాన్ని కూడా కేటాయించనున్నారు. ఇటీవలి ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారానికి వచ్చిన నేపథ్యంలో...ఆ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా ఎవరిని నియమించాలనే కసరత్తులో పార్టీ జాతీయ నాయకత్వం నిమగ్నమైన విషయం తెలిసిందే. ఈ రాష్ట్రాలకు సీఎంలను ప్రకటించాక, తెలంగాణలో బీజేఎల్పీ నేత ఎంపికపై ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి.

మల్లన్నసాగర్ డ్రాయింగ్స్ ఎలా ఆమోదించారు?

- సిస్మిక్ స్టడీస్ లేకపోవడంపై కాగ్ అభ్యంతరం
- సీడబ్ల్యూపీఆర్‌ఎస్, ఐఐటీ-రూర్కీతో వెట్టింగ్ చేయించారా?
- నీటిపారుదల శాఖకు ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: సైట్ స్పెసిఫిక్ సిస్మిక్ స్టడీస్ (సంబంధిత ప్రాంతంలో భూకంపాల సంభావ్యతపై అధ్యయనం) లేకపోయినా, అత్యవసరం కావడంతో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ డ్యామ్ డ్రాయింగ్స్‌ను నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) విభాగం చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఆమోదించడంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అభ్యంతరం తెలిపింది. 2018 ఏప్రిల్-2020 మే మధ్య కాలంలో డ్రాయింగ్స్ ఆమోదిస్తూ సీఈ సీడీఓ పదేపదే ఈ విషయాన్ని నమోదు చేసినట్టు తమ ఆడిట్‌లో నిర్ధారించినట్టు స్పష్టం చేసింది. గత రెండేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై విస్తృత రీతిలో ఆడిట్ నిర్వహిస్తున్న కాగ్.. తాజాగా డిజైన్లు, డ్రాయింగ్స్‌ను ఆమోదించడంలో చోటు చేసుకున్న లోపాలపై దృష్టి సారించింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. మల్లన్నసాగర్ డ్రాయింగ్స్‌పై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్) లేదా ఐఐటీ-రూర్కీతో తదుపరిగా పరిశీలన (వెట్టింగ్) జరిపించాలని సీడీఓ సీఈ చేసిన సూచనలను పాటించారా? అని నీటిపారుదల శాఖను ప్రశ్నించింది. ఒక వేళ పాటిస్తే ఆ వివరాలను అందజేయాలని కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లు, డ్రాయింగ్స్‌ను ఆమోదించడంలో అవలంభించిన పద్ధతి ఏమిటి ? వాటిని ఆమోదించడానికి సీడీఓ సీఈ ఏమైనా గడువులు విధించారా? ఆమోదించే క్రమంలో ఎవరైనా నిపుణులు/ఉన్నత స్థాయి సంస్థల సేవలను వాడుకున్నారా? వాడుకుంటే ఆ నిపుణులు/సంస్థల జాబితాతో పాటు వాటి నుంచి ఏ విషయాల్లో సేవలు పొందారు? అనే సమాచారాన్ని సమర్పించాలని కోరింది. వ్యాప్కోస్ సంస్థ రూపొందించిన కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లను నీటిపారుదల శాఖలోని సీడీఓ సీఈ ఆమోదించారా? అని ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కొర్రీలతో కాగ్ లేఖ రాయడం ఈ నెల రోజుల్లో ఇది రెండోసారి అని అధికార వర్గాలు తెలిపాయి.

కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటూ ఏసీబీకి ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలు, అవినీతిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఏసీబీ డీజీకి హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏసీబీ డీజీకి గురువారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తప్పుడు అంచనాలు సృష్టించి రూ.వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలకు తాగు, సాగు నీళ్లు అందిస్తామని తప్పుడు హామీలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు అవినీతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

త్వరలో మంచి రోజులు వస్తాయి

- బీఆర్‌ఎస్ శ్రేణులకు మాజీ సీఎం కేసీఆర్ ఓదార్పు



తనను కలసిన ప్రజాప్రతినిధులకు ధైర్యం చెబుతున్న మాజీ సీఎం కేసీఆర్

కొండపాక(గజ్వేల్): త్వరలో మంచి రోజులు వస్తాయని, బీఆర్‌ఎస్ శ్రేణులు అధైర్య పడవద్దని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల ప్రజా ప్రతినిధులు ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన మండల ఏర్పాటు కలను సాకారం చేశారంటూ వారు కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్న విషయాన్ని కేసీఆర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ త్వరలో మంచి రోజులు వస్తాయంటూ ప్రజా ప్రతినిధుల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో మునుపటిలాగే నడుచుకోవాలని నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, కనకయ్య, ఎంపీటీసీ భూములుగౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ పీఎఫ్‌ఐ కేసులో అదనపు చార్జిషీట్

- 17వ నిందితుడి పేరును చేర్చిన ఎన్‌ఐఏ

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) గురువారం అదనపు చార్జిషీట్ నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటికే 16 మందిని నిందితులుగా చేర్చిన ఎన్‌ఐఏ.. తాజాగా నొస్సం మహ్మద్ యూనుస్‌ను 17వ నిందితుడిగా చేరుస్తూ హైదరాబాద్ ఎన్‌ఐఏ ప్రత్యేక న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ మేరకు ఎన్‌ఐఏ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. నొస్సం మహ్మద్ యూనుస్ ఉగ్ర హింసకు పాల్పడే అంశాలపై ముస్లిం యువతకు శిక్షణ ఇస్తున్నట్టు ఎన్‌ఐఏ అధికారులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. 2047లో భారత దేశంలో ఇస్లామిక్ రూల్ తేవాలని వీరు లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించింది. పీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాల్లో తాము లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల గొంతు, కడుపు, తల వంటి ముఖ్యమైన శరీర భాగాలపై ఆయుధాలతో దాడి చేసేలా శిక్షణ ఇచ్చినట్టు ఎన్‌ఐఏ తమ చార్జిషీట్‌లో పేర్కొంది. హింసాత్మక ఘటనలకు పాల్పడేలా ముస్లిం యువతకు శిక్షణ ఇవ్వడంతోపాటు దేశంలో వివిధ మతాల మధ్య ద్వేషాన్ని పెంచేలా కూడా పీఎఫ్‌ఐ శిక్షణ కొనసాగినట్టు తెలిపింది. నిజామాబాద్ నాల్గోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తొలుత ఈ కేసు జూలై 2022లో నమోదైంది. ఆ తర్వాత కేసు దర్యాప్తును ఆగస్టు 2022న ఎన్‌ఐఏ ప్రారంభించింది. 11 డిసెంబర్ 2022న 11 మందిపై చార్జిషీట్ నమోదు చేసింది. ఈ ఏడాది మార్చిలో మరో ఐదుగురు నిందితులను చేరుస్తూ రెండో అదనపు చార్జిషీట్ దాఖలు చేసింది. తాజాగా మరో నిందితుడిని చేర్చారు.

మూడు 'లెఫ్ట్' పార్టీల విలీనం

- మార్చి 3 నుంచి ఖమ్మంలో ఐక్యత మహాసభ
- సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మం మయూరి సెంటర్: నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా కార్పొరేట్, ఫాసిస్టు, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీని ఓడించేందుకు దేశంలోని విప్లవ పార్టీలు ఐక్యమయ్యేందుకు అడుగులు పడుతున్నాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న పీసీసీ సీపీఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) రెవెల్యూషనరీ ఇనీషియేటివ్ పార్టీలు విలీనం కాబోతున్నట్లు తెలిపారు. ఏడాదిగా ఈ అంశంపై చర్చలు జరుగుతుండగా, గత నెల కోల్‌కతాలో మూడు పార్టీల ప్రతినిధులు సమావేశమై సంస్థల ఐక్యతకు సంబంధించిన విధివిధానాలు పూర్తి చేశారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో మూడు పార్టీలు కలసి ఒకే పార్టీ(భారత కమ్యూనిస్టు పార్టీ)గా ఏర్పడే ఉద్దేశంతో ఒకటిగా నడవాలని నిర్ణయించామన్నారు. ఇది భారత విప్లవోద్యమ శక్తుల ఐక్యతకు మొదటిమెట్టు కావాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో అఖిల భారత ఐక్యత మహాసభ నిర్వహిస్తున్నట్లు రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా 14 రాష్ట్రాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరై పార్టీ కార్యక్రమం, పంథా నియమావళి, రాజకీయ తీర్మానంపై డ్రాఫ్ట్ ఖరారు చేస్తారని చెప్పారు. అదే సమయంలో పార్టీ పేరు, కేంద్ర కమిటీని వెల్లడించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం తాను కన్వీనర్‌గా 12 మంది సభ్యులతో కమిటీని నియమించినట్లు రంగారావు వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, రాయల చంద్రశేఖర్, ఆవుల వెంకటేశ్వర్లు, గుర్రం అచ్చయ్య, సీవై పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డికి షాక్‌ల మీద షాక్‌లు

- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యేకు ఏకకాలంలో ఆర్టీసీ, ట్రాన్స్‌కో నోటీసులు



జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టిప్లెక్స్ భవనం

ఆర్మూర్: అధికారం చేజారగానే బీఆర్‌ఎస్‌కు చెందిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ఆర్టీసీ, ట్రాన్స్‌కో అధికారులు ఏకకాలంలో బకాయిల వసూలుకు చర్యలు ప్రారంభిస్తూ షాక్ ఇచ్చారు. పూర్వాపరాలిలా.. ఆర్మూర్ పట్టణంలోని టీఎస్ ఆర్టీసీ స్థలాన్ని జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి తాను మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట లీజ్‌కు తీసుకుని మాల్ అండ్ మల్టిప్లెక్స్ పేరిట 5 అంతస్తుల భారీ షాపింగ్ మాల్ నిర్మించారు. గతేడాది దసరా రోజున ప్రారంభించిన ఈ మాల్‌లో రిలయన్స్ స్మార్ట్, ట్రెండ్స్, ఎలక్ట్రానిక్స్, కేఎఫ్‌సీ, పీవీఆర్ సినిమా హాళ్లకు అద్దెకు ఇచ్చారు. మొన్నటి వరకు జీవన్‌రెడ్డి అధికార పార్టీ ఎమ్మెల్యే కావడంతో ఈ మాల్ అద్దె బకాయిలు వసూలు చేయడంలో ఆర్టీసీ, ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ఆర్టీసీకి చెల్లించాల్సిన అద్దె 7 కోట్ల 23 లక్షల 71 వేల 807 రూపాయలు, విద్యుత్‌కు సంబంధించి ట్రాన్స్‌కోకు 2 కోట్ల 57 లక్షల 20 వేల 2 రూపాయలు బకాయిలుగా పేరుకుపోయాయి. ఇప్పుడు రాష్ట్రంలో, నియోజకవర్గంలో అధికార మార్పు జరగగానే ఆర్టీసీ, ట్రాన్స్‌కో అధికారులు ఈ బకాయిల వసూళ్లకు నడుం బిగించారు.

మూడు రోజుల్లో చెల్లించాలి
ఆర్టీసీ నిజామాబాద్ ఆర్‌ఎం జానీరెడ్డి, ఆర్మూర్ డిపో ఇన్‌చార్జి మేనేజర్ పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన పోలీసు అధికారులు తోడురాగా జీవన్ మాల్‌లో గురువారం హెచ్చరికలు జారీ చేసారు. మూడు రోజుల్లో లీజుదారులు అద్దె బకాయిలు చెల్లించని పక్షంలో మల్టీప్లెక్స్‌ను సీజ్ చేస్తామంటూ మైక్‌లో హెచ్చరించారు. మరో వైపు ట్రాన్స్‌కో ఆర్మూర్ ఏడీఈ శ్రీధర్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో అధికారులు సైతం మూడు రోజుల్లో బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో షాపింగ్ మాల్‌కు జనరేటర్లతో విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

ఫ్యాషన్



బ్యూటిప్స్

● ముల్తాని మట్టిలో గంధంపొడి, కొద్దిగా రోజ్‌వాటర్ వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా రాసి చక్కగా ఎండిన తరువాత కడిగేయాలి. వారానికి నాలుగు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం మరింత అందంగా మెరిసిపోతుంది.

● పెరుగులో టొమాటో గుజ్జును వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసుకుని పదిహేను నిమిషాలు మర్దన చేయాలి. తరువాత పూర్తిగా ఆరాక కడిగేయాలి. ఇలా చేయడం వల్ల ముఖం మీద ట్యాన్ పోతుంది.

ఇంటిప్స్

● చింతపండు గుజ్జులో కొద్దిగా ఉప్పు కలిపి రాగి పాత్రలను తోమితే తళతళా మెరుస్తాయి.

● కాకర కాయ ముక్కలపై కొద్దిగా ఉప్పు, నిమ్మరసం చల్లి ఇరవై నిమిషాలు పక్కన పెట్టాలి. తరువాత ముక్కలను గట్టిగా పిండి కూర వండుకుంటే చేదుగా ఉండదు.

ఇలా తరిమేయండి!

● చెదలు ఉన్న దగ్గర వేపనూనె రాస్తే కొద్దిరోజుల్లోనే చెదలు అక్కడి నుంచి పోతాయి ● అరకప్పు వెనిగర్‌లో రెండు నిమ్మకాయల రసాన్ని పిండాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో వేయాలి. ఈ స్ప్రేను చెదల పైన చల్లాలి. చెదలు దానంతట అదే పోతుంది ● చెదలు మీద కారం చల్లినా పోతాయి ● కప్పు వేడినీటిలో టేబుల్ స్పూను ఉప్పు కలపాలి. ఈ మిశ్రమాన్ని సిరంజిలోకి తీసుకుని చెదల పుట్టలో వేయాలి. చెదలు అక్కడి నుంచి పోతుంది.



కొటేషన్స్

మహిళ శక్తిని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కోట్స్ బ్యాక్ డిజైన్‌గా రూపొందుతున్నాయి. ఇవి ఎంబ్రాయిడరీగా కన్నా పెయింటింగ్‌గా క్యాజువల్ వేర్ శారీస్‌గా బాగా నప్పుతున్నాయి.

పెయింటింగ్

పురాణ గాథలను దృశ్యరూపకంగా బ్యాక్ బ్లౌజ్ కొత్తగా రూపుకడుతుంది. దీంట్లో మధుబని ఆర్ట్, కలంకారీ ప్రధానంగా ఉంటున్నాయి. కొత్తగా తంజావూర్ పెయింటింగ్ కూడా బ్యాక్ డిజైన్ మీద అందంగా మెరిసిపోతోంది.

శారీ బ్లౌజ్ బ్యాక్ డిజైన్స్ ఎప్పుడూ ట్రెండ్‌లో ఉండేవే. వేడుకలలో ప్రత్యేకంగా కనిపించే బ్లౌజ్ బ్యాక్‌ను డిజైనర్లు కాన్వాస్‌గా మార్చేస్తున్నారు. ఈ డిజైన్స్‌లో పురాణ కథల దృశ్యాల నుంచి సందేశాల వరకు ఉంటున్నాయి.

సమ్‌థింగ్ స్పెషల్

పెళ్లికి గ్రాండ్‌లుక్‌ని తీసుకువచ్చే ఎంబ్రాయిడరీ డిజైన్
పార్టీలో ప్రత్యేకం అనిపించే మోడర్న్ డిజైన్
క్యాజువల్ వేర్‌గా ధరించినా స్పెషల్ అనిపించే కోట్స్‌తో మరో డిజైన్
చీరకట్టును చూపులతో కట్టడి చేసే బ్లౌజ్ బ్యాక్ డిజైన్
ఇప్పుడు ప్రతిరోజూ ప్రత్యేకమే!
చూసేవారు సమ్‌థింగ్ స్పెషల్ అనకుండా ఉండలేరు.



ఎంబ్రాయిడరీ

రాజమహాళ్లు, పువ్వులు, లతలు... స్వరోస్కి, జరీ దారాలతో చేసిన ఎంబ్రాయిడరీ పెళ్లి వేడుకలలో గ్రాండ్‌గా మెరిసిపోతోంది.

త్రీడీ డిజైన్

బ్లౌజ్ బ్యాక్ పైన క్లాత్‌తో చేసిన డిజైన్‌ను జత చేయడంతో పాటు దీనికి అదనంగా హంగుగా అమర్చిన త్రీడీ ప్రింట్స్ మరింత ఆకర్షణీయంగా మారుతున్నాయి.

థక్ థక్ గ్యాంగ్

కాలు తొక్కారు అద్దం దించండి



ఢిల్లీలో ఒంటరిగా కారు నడుపుతున్న స్త్రీల వస్తువుల చోరీకి ఒక గ్యాంగ్ ప్రయత్నిస్తోంది.
ఆ గ్యాంగ్‌ను థక్‌థక్ గ్యాంగ్ అంటారు.
వీరు ఎలా చోరీ చేస్తారు?
ఒంటరి స్త్రీలు కారు ప్రయాణం చేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?
విస్తృతంగా వాహనాలు నడుపుతున్న స్త్రీలూ... బహుపరాక్.
థక్‌థక్ గ్యాంగ్ ఎక్కడైనా ఉండొచ్చు.

సంఘటన 1: నిర్మానుష్య ప్రాంతం అక్కర్లేదు. బాగా రద్దీ ఉన్న రోడ్డు మీదే. ట్రాఫిక్ సమయంలోనే. మీరు కారు మెల్లగా పోనిస్తుంటారు. ఒక మనిషి మీ కారు ముందు నుంచి దాటుతాడు. ఆ తర్వాత వేగంగా వెనక్కు వచ్చి మీ పక్క అద్దం మీద 'టక్ టక్'మని వేలితో కొట్టి అద్దం దించమని కోపంగా అంటాడు. 'నా కాలు తొక్కావు. అద్దం దించు' అని హడావిడి చేస్తాడు. మీరు కంగారులో అద్దం దించుతారు. అంతే! మీ పక్క సీటులో మీరు ఉంచుకున్న హ్యాండ్‌బ్యాగ్, పర్స్, ల్యాప్‌టాప్ తీసుకుని తుర్రుమంటాడు. మీరు కారు దిగి వెంటాడ లేరు. ట్రాఫిక్‌లో ఉంటారు. ఇదీ 'టక్ టక్' లేదా 'థక్‌థక్ గ్యాంగ్' నేరం చేసే తీరు.

సంఘటన 2: ఇలాగే ట్రాఫిక్‌లో మీరు వెళుతుంటారు. మెల్లగా వెళుతున్న మీ కారు వెనుక టైరు ఏదో ఎక్కి దిగినట్టుగా అవుతుంది. వెంటనే ఒక మనిషి డ్రైవింగ్ సీట్ దగ్గరకు వచ్చి అద్దం మీద బాది 'నా కాలు తొక్కావ్' అంటాడు. మీరు ఇంజన్ ఆఫ్ చేసినా, కారు పక్కకు తీసి ఆ మనిషితో వాదనకు దిగినా, మరో మనిషి మీ కారు వెనుక సీటులో ఉన్న వస్తువు తీసుకుని ఉడాయిస్తాడు. మీరు స్లోగా వెళుతున్నప్పుడు వెనుక టైరు కింద రాయి పెట్టి కాలు తొక్కిన భావన కలిగిస్తారు.

ఇంకా ఏం చేస్తారు?: మీ కారు బైక్ మీద వెంబడించి ఇంజన్ లీక్ అవుతుంది అంటారు. అలా అనిపించడానికి వారే వెనుక కొంత ఆయిల్ వేస్తారు. మిమ్మల్ని అలెర్ట్ చేసిన వారు మిమ్మల్ని దాటి వెళ్లిపోతారు. కాని మీరు కారు ఆపి ఇంజన్ ఆయిల్‌ను చెక్ చేస్తుంటే ఇంకో బ్యాచ్ వచ్చి డోర్లు తీసి దోచుకుని పోతుంది. కారు ఎక్కేటప్పుడు కొన్ని నోట్లు కింద పడేసి మీ డబ్బు పడింది అంటారు. మీరు నోట్లు ఏరుకుంటుంటే కారులో ఉన్న వస్తువులు పట్టుకెళతారు. బ్యాక్ టైర్ పంక్చర్ అయ్యిందని చెప్తారు. కారు ఆపితే అంతే సంగతులు. కొన్నిసార్లు క్యాటపల్ట్ (క్యాట్‌బాల్)తో రాయి విసిరి అద్దం మీద కొడతారు. టప్పున అద్దం తాకితే మీరు కంగారులో కారు ఆపి దిగుతారు. వారు చేతివాటం చూపుతారు. ఒంటరి స్త్రీలు ఉన్నప్పుడు ఇవన్నీ థక్ థక్ గ్యాంగ్ చాలా సులువుగా చేస్తుంది. కాబట్టి జాగ్రత్త.

ఏం చేయాలి?

అద్దాలు ఎప్పుడూ ఎత్తి పెట్టాలి

* * *

ఎవరు వచ్చి వాదనకు దిగినా అద్దం దించకుండా పోలీసులకు ఫోన్ చేయాలి. ఇంజన్ ఆఫ్ చేయకూడదు. చేస్తే డోర్లు తెరుచుకుంటాయి.

* * *

మీ పక్క సీటులో, వెనుక సీటులో విలువైన ఏ వస్తువులూ కనిపించేలా పెట్టకూడదు.

* * *

ఏదైనా రాయి వచ్చి అద్దాన్ని కొట్టినా వెంటనే ఆపకుండా బాగా దూరం వెళ్లి ఎవరూ వెంబడించడం లేదని గమనించుకుని ఆపాలి.

* * *

ముఖ్యంగా ఫ్లై ఓవర్లు దిగేప్పుడు, ట్రాఫిక్ ఉంటే ఇలాంటి దాడులు చేస్తారు. ఫ్లై ఓవర్ మీద కారు పక్కకు తీసి మీరు వారిని పట్టుకునే ప్రయత్నం చేయలేకపోవడమే ఇందుకు కారణం.
కాబట్టి ఫ్లై ఓవర్ల మీద జాగ్రత్తగా ఉండాలి.

వంట పండింది!



జీవితంలో సమస్యలు రావడం సాధారణం. ఒక్కోసారి ఇవి ఊపిరాడనివ్వవు. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనే ధైర్యంగా వాటిని ఎదుర్కొనాలి. తానేమిటో నిరూపించుకోవాలి. అలానే చేసింది బిందు. తన కూతుళ్లకు మంచి చదువును అందించేందుకు ఒక పక్క గరిట తిప్పుతూనే మరోపక్క నాగలి పట్టి పొలం సాగు చేస్తూ ''మనం కూడా ఇలా వ్యవసాయం చేస్తే బావుంటుంది'' అనేంతగా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

తమిళనాడులోని తెనై జిల్లా బొమ్మినాయకన్‌పట్టి గ్రామానికి చెందిన బిందు, పిచ్చయ్య దంపతులకు ఇద్దరు అమ్మాయిలు. పిచ్చయ్య సొంత పొలంలో చెరకు పండించేవాడు. అయితే ఏటా అప్పులు తప్ప ఆదాయం వచ్చేది కాదు. గ్రామంలో చాలామంది రైతులు చెరకు, పత్తిని పండించి నష్టపోవడాన్ని చూసి ఇతర పంటలను పండించాలని నిర్ణయించుకుంది బిందు. మొక్కజొన్న, వంగ పంటను పొలంలో వేసింది. మరో పక్క సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లో చేరి చుట్టుపక్కల రైతులు ఏం పండిస్తున్నారో తెలుసుకునేది. ఇతర రైతుల సలహాలు, సూచనలతో సాగును మెరుగు పరుచుకుంటూ, ఎస్‌హెచ్‌జీ ద్వారా కృషి విజ్ఞాన్ నిర్వహించే వ్యవసాయ కార్యక్రమాలకు హాజరవుతూ మెలకువలు నేర్చుకుంది. అధికారులు చెప్పిన విధంగా పప్పుధాన్యాలు, మిల్లెట్స్, మినుములు కూడా సేంద్రియ పద్ధతిలో సాగుచేసింది. దీంతో మంచి లాభాలు వచ్చాయి.



విరామంలో...

పంటకు పంటకు మధ్య వచ్చే విరామంలో కూరగాయలు పండించడం మొదలు పెట్టింది. అవి నాలుగు నెలల్లోనే చేతికి రావడంతో మంచి ఆదాయం వచ్చేది. విరామ పంటలు చక్కగా పండుతుండడంతో.. కొత్తిమీర, కాకర, ఇతర కూరగాయలను పండిస్తోంది.

పంటను పసుమయిగా ...

ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో చాలా కూరగాయలు వృథా అయ్యేవి. అలా వ్యర్థంగా పోకుండా ఉండేందుకు 'పసుమయి' పేరిట ఎండబెట్టిన కూరగాయలు, పొడులను విక్రయిస్తోంది. ఇడ్లీ పొడి, నిమ్మపొడి, ధనియాల పొడి వంటి అనేక రకాల పొడులను మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది. నెలకు వందల సంఖ్యలో విక్రయాలు జరుగుతున్నాయి. ఇలా అంచెలంచెలుగా ఎదుగుతూ వ్యాపారవేత్తగా ఎదిగింది బిందు. ఆమె పెద్దకూతురు ఎం.ఎస్. పూర్తి చేస్తే, చిన్నకూతురు బీఎస్సీ నర్సింగ్ చేస్తోంది. అలా సేద్యంతో పిల్లల చదువులనూ పండించుకుంది బిందు.

వంటిల్లు

ఎప్పుడూ తినే ఉల్లి, బంగాళ దుంపల కూర సమోసాలు కాకుండా... ఈ చలికాలంలో కాస్త తీపిగా, కారంగా, క్రంచీగా ఉండే సమోసాలను ఇలా ప్రయత్నించి చూడండి. మన వంటిల్లు ఇంతటి మాయాజాలం చేస్తుందా... అని ఆశ్చర్యపోతారు.

గరం గరం సమోసాలు

స్వీట్ కోవా సమోసా



కావలసినవి: మైదా – రెండు టీస్పూన్లు; సమోసా పట్టి షీట్లు – పన్నెండు (రెడీమేడ్); వేరు శనగ నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పిస్తా – గార్నిష్‌కు సరిపడా.

స్టఫింగ్: నెయ్యి – టీస్పూను; జీడిపప్పు పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తా పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; పచ్చికొబ్బరి తురుము – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీస్పూను; ఉప్పు – ముప్పావు టీస్పూను; కోవా తురుము – కప్పు.

సిరప్: పంచదార – అరకప్పు; యాలకుల పొడి – పావు టీస్పూను; నీళ్లు – అరకప్పు; కుంకుమ పువ్వు– చిటికెడు.

తయారీ: జీడిపప్పుని నెయ్యిలో వేసి బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించాలి ● జీడిపప్పు వేగిన తరువాత పిస్తా, కొబ్బరి తురుము, పంచదార, కోవా తురుము వేయాలి ● ఇవన్నీ దోరగా వేగిన తరువాత రుచికి సరిపడా ఉప్పు, యాలకులపొడి వేసి కలిపి దించేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తరువాత అరగంట రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● బాణలిలో కుంకుమ పువ్వును దోరగా వేయించాలి. ఇది వేగిన తరువాత పంచదార, అరకప్పు నీళ్లు, యాలకుల పొడి వేసి, సిరప్ తయారు చేసి పక్కన పెట్టుకోవాలి ● మైదాలో కొద్దిగా నీళ్లుపోసి గమ్‌లా తయార చేసి పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు రిఫ్రిజిరేటర్ నుంచి తీసిన మిశ్రమాన్ని.. సమోసా పట్టి షీట్‌పైన టేబుల్ స్పూను వేసి సమోసాలా చుట్టుకోవాలి ● లోపల స్టఫింగ్ బయటకు రాకుండా ఉండేలా మైదా గమ్‌ను రాసుకుంటూ సమోసాను చుట్టుకోవాలి ● సమోసాలన్నీ రెడీ అయ్యాక బంగారు వర్ణంలోకి వచ్చేంత వరకు డీప్‌ఫ్రై చేయాలి ● ఫ్రై చేసిన వేడివేడి సమోసాలను సుగర్ సిరప్‌లో అరనిమిషం ఉంచాలి ● సుగర్ సిరప్ నుంచి తీసిన సమోసాపై పిస్తా పప్పు తురుము వేస్తే స్వీట్ సమోసా రెడీ.

చికెన్ సమోసా



కావలసినవి: మైదా – కప్పు; వాము – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు.

ఖీమా ఫిల్లింగ్: నెయ్యి – టేబుల్ స్పూను; ఇంగువ – చిటికెడు; జీలకర్ర – టీస్పూను; క్యారట్ ముక్కలు – అరకప్పు (చిన్నముక్కలు); వెల్లుల్లి రెబ్బలు – రెండు; అల్లం – అంగుళం ముక్క; చికెన్ ఖీమా – పావు కేజీ; కారం – అర టీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; గరం మసాలా – అర టీస్పూను; పసుపు – పావు టీస్పూను; పచ్చిబఠాణి – అరకప్పు; స్ప్రింగ్ ఆనియన్ ముక్కలు – పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: మైదాలో వాము, రెండు టేబుల్ స్పూన్లు నెయ్యి వేసి కలిపాక, నీళ్లు పోసి ముద్ద చేయాలి. ఈ పిండి ముద్దపైన తడి వస్త్రాన్ని కప్పి అరగంట నానబెట్టుకోవాలి ● టేబుల్ స్పూను నెయ్యిలో జీలకర్ర, ఇంగువ వేసి వేయించాలి ● జీలకర్ర వేగిన తరువాత అల్లం, వెల్లుల్లిని సన్నగా తరగి వేయాలి. వీటితోపాటే క్యారట్ ముక్కలు వేసి వేయించాలి ● క్యారట్ వేగిన తరువాత చికెన్ ఖీమా వేసి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి ● తరువాత కారం, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు వేసి గరిటతో కలిపి, మూతపెట్టి మగ్గనివ్వాలి ● ఆరు నిమిషాల తరువాత స్ప్రింగ్ ఆనియన్ తరుగు, పచ్చిబఠాణి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఈ మిశ్రమాన్ని రెండు నిమిషాలు వేయించి దించేయాలి ● మైదాముద్దను చిన్న ఉండలుగా చేసి, చపాతీలా వత్తుకోవాలి ● చపాతీని కోన్ ఆకారంలో మడిచి, మధ్యలో చికెన్ ఖీమా మిశ్రమంతో నింపాలి. మిశ్రమం బయటకు రాకుండా కోన్‌ను మూసివేయాలి ● ఇలా అన్ని సమోసాలు రెడీ అయిన తరువాత బేకింగ్ ట్రేలో పెట్టాలి ● ఈ ట్రేను అవెన్‌లో పెట్టి 350 ఫారిన్‌హీట్స్ వద్ద ఇరవై నిమిషాల పాటు బేక్ చేస్తే చికెన్ సమోసా రెడీ.

ఎగ్ సమోసా



కావలసినవి: గుడ్లు – ఆరు; పచ్చి బంగాళ దుంపల తురుము – కప్పు; క్యారట్ ముక్కలు – అరకప్పు; ఉల్లిపాయలు – నాలుగు; పచ్చిమిర్చి – మూడు; నూనె – ఐదు టేబుల్ స్పూన్లు; వంటసోడా – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; వాము – అరటీస్పూను; కొత్తి మీర – చిన్న కట్ట; మైదా – రెండున్నర కప్పులు; రిఫైన్డ్ నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కొత్తిమీరను సన్నగా తరిగి పెట్టుకోవాలి ● మైదాలో వంటసోడా, వాము, అరటీస్పూను ఉప్పు, రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి కలపాలి. నీళ్లపోసి ముద్దచేసి గంటపాటు నానపెట్టుకోవాలి ● మూడు టేబుల్ స్పూన్ల నూనెలో ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేసి వేయించాలి ● ఉల్లిపాయలు వేగిన తరువాత క్యారట్ ముక్కలు, బంగాళ దుంప తురుము వేసి వేయించాలి ● నిమిషం తరువాత కొత్తిమీర తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి ● మిశ్రమం మెత్తబడిన తరువాత గుడ్ల సొన వేసి వేయించాలి ● గుడ్ల సొన వేగిన తరువాత దించేసి చల్లారనివ్వాలి ● మైదా ముద్దను చిన్న ఉండలుగా చేసి, చపాతీల్లా వత్తుకోవాలి ● ఈ చపాతీలను త్రికోణాకృతిలో మడతపెట్టి మధ్యలో ఒక టీ స్పూన్ గుడ్డు మిశ్రమాన్ని పెట్టి మిశ్రమం బయటకు రాకుండా అంచులకు కొద్దిగా తడిచేసి అతుక్కునేటట్లు వేళ్లతో మెల్లగా నొక్కాలి ● ఇలా అన్ని తయారయ్యాక గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేస్తే ఎగ్ సమోసా రెడీ.

యువర్స్

• అవును నిజమే!

మిస్టర్ ఈట్ ఆల్



● ఫ్రాన్స్‌కు చెంది మైఖేల్ లోటిటోకు 'మిస్టర్ ఈట్ ఆల్' అని పేరు. ఇతడు ఐరన్, రబ్బరు, గాజులాంటివి కూడా తినేవాడు. ఈ వింత అలవాటుతో గిన్నిస్ వరల్డ్ బుక్‌లో చోటు సంపాదించాడు. ఇనుమును ఎలక్ట్రిక్ పవర్ సాతో చిన్న చిన్న ముక్కలు చేసి తినేవాడు. పదహారు సంవత్సరాల వయసులో తొలిసారిగా గాజు గ్లాస్‌ను పగలగొట్టి తిన్నాడు. తన యూనిక్ టాలెంట్‌తో ప్రపవచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాడు. 2007లో చనిపోయాడు.

● బ్రెజిల్ కారాగారాలలో ఖైదీలకు ఎక్సర్ సైజ్ బైక్‌లను తొక్కే అవకాశం ఇస్తారు. ఈ బైక్‌లు కరెంట్‌ను ఉత్పత్తి చేస్తాయి ● 'ఫేస్ బుక్' వచ్చాక 'అన్‌ఫ్రెండ్' అనే మాట ప్రాచుర్యం పొందింది. అయితే 1659లో వచ్చిన 'ది అపీల్ ఆఫ్ ఇన్జ్యూర్డ్ ఇనోసెన్స్' పుస్తకంలో ఈ పదాన్ని కాయిన్ చేశారు.

• టెక్...టాక్:

హువావే ఎంజాయ్ 70 స్మార్ట్ ఫోన్



సైజ్: 6.75 అంగుళాలు ● 8ఎంపీ సెల్ఫీ కెమెరా స్టోరేజ్: 256 జీబి బ్యాటరీ: 6,000 ఎంఏహెచ్ కలర్స్: గ్రీన్, వైట్, బ్లాక్

ఏసర్ ఇ-బైకర్



మార్కెట్‌లోకి రానున్న ఏసర్ ఇ-బైకర్ 'ఇబీ' బ్యాటరీతో ఫోన్, ల్యాప్‌టాప్‌లతో పాటు ఎన్నో ఎలక్ట్రానిక్స్ గ్యాడ్జెట్స్‌ను చార్జ్ చేయవచ్చు. గూగుల్ మ్యాప్స్ ద్వారా షార్టెస్ట్ రూట్ కనుక్కోవడం, ఎయిర్ ఫామ్ బేస్డ్ టైర్స్, బ్లూటూత్ లాక్ అండ్ అన్‌లాక్ ఫంక్షనాలిటీ, ఆటోమెటింగ్ లాకింగ్‌లాంటి యూనిక్ ఫీచర్‌లు ఎన్నో ఈ బైక్‌లో ఉన్నాయి. ఇతర ఇ-బైక్ మోడల్స్‌ను ఏసర్ మన దేశంలో లాంచ్ చేసింది. 'ఇబీ' మోడల్‌ను ఎప్పుడు లాంచ్ చేస్తారో ప్రకటించలేదు.

గూగుల్ ఫోటోమోజీ



గూగుల్ తన మెసేజింగ్ యాప్ 'మెసేజెస్' కోసం ప్రకటించిన కొత్త ఫీచర్‌లలో 'ఫోటోమోజీ' ఫీచర్ ఒకటి. 'ట్రాన్స్‌ఫాం యువర్ ఫెవరెట్ ఫొటోస్ ఇన్ టు రియాక్షన్స్' అని ఈ ఫీచర్ గురించి పరిచయం చేసింది. 'ఫోటోమోజీ' అనే కొత్త ఫీచర్ ద్వారా ఇమేజ్‌లను స్టికర్స్, రియాక్షన్స్ ఇమోజీలుగా మార్చి ఫ్రెండ్స్‌కు షేర్ చేయవచ్చు. అయితే ఈ ఫీచర్ ఇంకా అందరికీ అందుబాటులోకి రాలేదు. బీటా దశలో ఉంది.

మల్టీ-ఫంక్షన్ క్లీనర్ కిట్

బ్రాండ్: జుడీ కలర్: మల్టీ కలర్

● 7 ఇన్ వన్: కంప్యూటర్ క్లీనింగ్ కిట్ విత్ డ్యూయెల్ హెడ్ క్లీనింగ్ పెన్, కీక్యాప్ పుల్లర్, స్ప్రే బాటిల్, కీబోర్డ్ బ్రష్... మొదలైనవి.

●ఈ మల్టీ-ఫంక్షన్ క్లీనర్ కంప్యూటర్స్, ట్యాబ్‌లెట్, ల్యాప్‌టాప్ యాక్సెసరీలకు ఉపయోగపడుతుంది.



• సక్సెస్ స్టోరీ



అజిత్ సహస్రనామం

సహస్రనామం

సమ్మోహన విజయం

'ఎడారిలో రెయిన్ కోట్‌లు అమ్మకూడదు' అనేది వ్యాపారానికి సంబంధించి అప్రకటిత ప్రాథమిక సూత్రం! ఎక్కడ ఏది అవసరమో అది అందుబాటులోకి తీసుకువచ్చినప్పుడే ఎంటర్‌ప్రెన్యూర్ గెలుపు జెండా ఎగరేయగలడు. సంప్రదాయ విధానాలకు భిన్నంగా సంస్థలకు సంబంధించిన డేటా-ఎనాలటిక్స్ ప్రాసెస్‌ను సులభతరం చేయడానికి, కాలాన్ని, ఖర్చును తగ్గించడానికి ఏఐ సాంకేతికత ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో ఏఐ స్టార్టప్‌లకు ప్రాధాన్యత పెరిగింది. చెన్నైకి చెందిన అజిత్ సహస్రనామం ఏఐ స్టార్టప్ 'ఆన్‌గిల్'తో విజయం సాధించాడు. 'రైట్ మోడల్ అనేది ముఖ్యం' అంటున్న అజిత్ స్టార్టప్ కలల యువతరం రోల్‌మోడల్స్‌లో ఒకరిగా నిలిచాడు...

'ప్రాసెసింగ్ ఆఫ్ డేటా'కు సంబంధించి వివిధ సంస్థలకు రకరకాల సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికత డేటా-డ్రైవెన్ మెథడాలజీలతో ఖర్చును తగ్గిస్తుంది. టైమ్ సేవ్ చేస్తోంది. రిపోర్ట్స్ తయారీని సులభతరం చేస్తోంది.

అందుకే ఇప్పుడు ఏఐ స్టార్టప్‌లకు ప్రాధాన్యత పెరిగింది.

'ఒకప్పుడు రోజుల్లో మాత్రమే పూర్తయ్యే పని ఇప్పుడు నిమిషాల వ్యవధిలో పూర్తవుతుంది' అంటున్నాడు ఏఐ స్టార్టప్ 'ఆన్‌గిల్' ఫౌండర్, సీయివో అజిత్.

ఒక్క మాటలో చెప్పాలంటే డేటా ఆధారిత నిర్ణయాలకు సంబంధించి ఏఐ-డ్రైవెన్ సొల్యూషన్‌లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నాయి. బిజినెస్ ప్రాసెస్‌కు డైనమిక్ లుక్ ఇస్తున్నాయి.

కొన్ని నెలల క్రితం బెంగళూరులో జరిగిన ఎర్లీ-స్టేజ్ స్టార్టప్ ఫౌండర్స్ సమావేశంలో స్టార్టప్ ప్రయాణ ప్రారంభంలో ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయో వివరంగా చెప్పాడు అజిత్ సహస్రనామం.

'రైట్ మోడల్ లేకుండా ఎలా ముందుకు వెళ్లగలం?' అంటాడు అజిత్.

రైట్ మోడల్ మాట ఎలా ఉన్నా స్టార్టప్ కలల యువతరం 'రోల్ మోడల్స్'లో అజిత్ సహస్రనామం ఒకరు. ఏఐ స్టార్టప్ 'ఆన్‌గిల్' ఫౌండర్, సీయివోగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు అజిత్. ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ 'ఆన్‌గిల్' పరిశ్రమలకు సంబంధించి డేటా కలెక్షన్ నుంచి ఇన్‌సైట్స్ వరకు ఎనాలటిక్స్ టాస్క్‌లను వేగవంతం చేస్తుంది.

'ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌లు అందుబాటులో ఉన్న మోడల్స్‌పై ఆధారపడడం అనేది ఒక విధానం. రెండోది పబ్లిక్ సోర్స్ శాంపిల్స్ ద్వారా సొంత డేటా తయారుచేసుకోవడం. అన్నిటి కంటే పెద్ద సవాలు యూజర్స్ ఓకే అనేలా ప్రొడక్ట్‌ను బిల్డ్ చేయడం' అంటాడు అజిత్.

'ఆన్‌గిల్' సాధించిన విజయం ఏమిటి?

2017లో ప్రారంభమైన 'ఆన్‌గిల్' రియల్-టైమ్ విజువలైజేషన్, ప్రిడిక్టివ్ ఎనాలటిక్స్ ఫీచర్‌ల ద్వారా పరిశ్రమలకు సంబంధించి ఎనాలటిక్స్ టాస్క్‌లను వేగవంతం చేస్తోంది.

2025 నాటికి మన దేశంలో ఏఐ మార్కెట్ మరింతగా విస్తరించనుంది అని నిపుణులు చెబుతున్నారు. డొమెస్టిక్ ఏఐ మార్కెట్‌లోకి యువతరం సారథ్యంలో మరెన్నో స్టార్టప్‌లు అడుగు పెట్టనున్నాయి. ఔత్సాహికులకు సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల మాటలే పాఠాలు అవుతాయి. 'ఆన్‌గిల్'తో విజయం సాధించిన అజిత్ సహస్రనామం నోటి మాటల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు.

English Idioms

డీప్ పాకెట్స్

ఒక వ్యక్తి లేదా సంస్థ దగ్గర బాగా డబ్బు ఉందని చెప్పే సందర్భంలో వాడే మాట... డీప్ పాకెట్స్.

ఉదా: లెట్స్ మేక్ ఏ లిస్ట్ ఆఫ్ ఎవ్రీవన్ ఉయ్ నో విత్ డీప్ పాకెట్స్, అండ్ సీ ఇఫ్ ఎనీ ఆఫ్ దెమ్ వాంట్ టు ఇన్వెస్ట్ ఇన్ అవర్ కంపెనీ.

డాట్ ది 'ఐ'స్ అండ్ క్రాస్ ది 'టీ'స్

ఒక పని జాగ్రత్తగా, ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చేసే సమయంలో వాడే మాట...డాట్ ది 'ఐ'స్ అండ్ క్రాస్ ది 'టీ'స్

ఉదా: ఐ హ్యావ్ నియర్లీ ఫినిష్‌డ్ ది రిపోర్ట్. ఐ జస్ట్ హ్యావ్ టు గో వోవర్ ఇట్ వన్స్ మోర్ టు డాట్ ది 'ఐ'స్ అండ్ క్రాస్ ది 'టీ'స్.

• గేమింగ్

కొత్త అవతారం



అవతార్ ఫిల్మ్ సిరీస్ ఆధారంగా నిర్మించిన ఓపెన్ వరల్డ్ యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'అవతార్: ఫ్రాంటియర్స్ ఆఫ్ పండోర' విడుదల అయింది. అవతార్: ది గేమ్(2009) ఫ్రాంచైజ్‌లో వస్తున్న రెండో వీడియో గేమ్ ఇది. ఈ ఫస్ట్-పర్సన్ పర్‌స్పెక్టివ్ గేమ్‌లో ప్లేయర్ పండోరలోని మునుపెన్నడూ చూడని వెస్ట్రన్ ఫ్రాంటియర్ గుండా ప్రయాణం ప్రారంభించాలి. పశ్చిమ సరిహద్దులోని సహజవనరులు దోపిడి కాకుండా స్థానిక నావి తెగలను సంఘటితం చేయాలి. పోరాటం వైపు తీసుకువెళ్లాలి. ఈ ఆట పాక్షికంగా 'అవతార్' సినిమాను పోలి ఉన్నప్పటికీ స్వతంత్రంగా ఉంటుంది.

ఇంజిన్: స్నోడ్రాప్

ప్లేస్టేషన్స్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

జానర్: యాక్షన్-అడ్వెంచర్



• మ్యూజిక్ వరల్డ్

సుస్వరాయల్

పదహారు సంవత్సరాల వయసులోనే రకరకాల మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను ప్లే చేసే నైపుణ్యం జస్లీన్ రాయల్ సొంతం అయింది. ఆ తరువాత ఒకే సమయంలో మల్టీపుల్ మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లే చేస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేసేది. 'పంచి హో జవాన్' సింగిల్‌తో సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకుంది. 'బార్ బార్ దేఖో' (2015)తో బాలీవుడ్‌లో కంపోజర్‌గా బ్రేక్ వచ్చింది. 'ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే మ్యూజిక్ కంపోజర్ అయ్యాను. నా మీద నాకు ఉన్న నమ్మకమే దీనికి కారణం. కాలేజీ రోజుల్లో అందరూ ప్లాన్ బీ గురించి ఆలోచిస్తున్న సమయంలో కూడా నా మార్గం మ్యూజిక్ మాత్రమే అనుకున్నాను. రియాల్టీ షోలో సెమీ-ఫైనల్స్ వరకు వెళ్లడం ద్వారా తొలిసారి గుర్తింపు లభించింది' అంటున్న జస్లీన్‌కు మెలోడీలు అంటే ఇష్టం. ప్రయాణాలు అంటే ఇష్టం. ప్రయాణమార్గాలలో తట్టే ట్యూన్‌లను పాటలుగా మలచడం అంటే ఇష్టం. కంపోజర్, సింగర్ అయిన జస్లీన్ రాయల్ తన తొలి ప్రాధాన్యత కంపోజింగ్ మాత్రమే అంటుంది.

సినిమా

2023 రౌండప్

మురిసే మురిసే... తెర మెరిసే

2023 సిల్వర్ స్క్రీన్ మురిసేలా చేసింది. మరి.. పదికి పైగా కొత్త తారలు తెరపై మెరిస్తే మురిసిపోవడం సహజం కదా. తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ్, హిందీ.. ఇలా పలు భాషలకు చెందిన కొత్తమ్మాయిలు ఈ ఏడాది తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఆ కథానాయికల గురించి తెలుసుకుందాం.



● వైష్ణవీ చైతన్య ● ప్రియా భవానీ శంకర్ ● ఆషికా రంగనాథ్

● కేరళలో పుట్టి, తమిళనాడులో పెరిగిన అమ్మాయి ఐశ్వర్యా మీనన్. తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో పలు సినిమాలు చేసిన ఐశ్వర్య యాక్షన్ ఫిల్మ్ 'స్పై'తో తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఈ సినిమాలో చాలా బోల్డ్‌గా కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా చేశారు ఐశ్వర్యా మీనన్. ఈ చిత్రంలో నిఖిల్ హీరోగా నటించారు. రానా అతిథి పాత్ర చేశారు. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖరరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.

● ఈ ఏడాది సూపర్ హిట్‌గా నిలిచిన తెలుగు సినిమాల్లో 'సామజ వరగమన' ఒకటి. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు మలయాళ బ్యూటీ రెబా మోనికా జాన్. సాయిధరమ్ తేజ్ ఓ హీరోగా నటించిన 'బ్రో' సినిమా లుక్ టెస్ట్‌కు వచ్చిన రెబా మోనికాకి ఆ అవకాశం దక్కలేదు. అదే టైమ్‌లో 'సామజ వరగమన' నిర్మాత రాజేశ్ దండాను కలవడం, ఆయన ద్వారా రెబాకి చిత్రదర్శకుడు రామ్ అబ్బరాజు కథ వినిపించడం, ఆమె ఓకే అనడం, ఈ సినిమా హిట్ కావడం అన్నీ చకా చకా జరిగిపోయాయి. నిజానికి ఈ సినిమాలో హీరోగా నటించిన శ్రీ విష్ణుతో అంతకు ముందే ఓ సినిమా చేయాల్సిందట రెబా. కానీ ఆ చాన్స్ చేజారినప్పటికీ ఫైనల్‌గా శ్రీవిష్ణు 'సామజ వరగమన' ద్వారానే టాలీవుడ్‌కి వచ్చారు రెబా.



● రెబా మోనికా జాన్

***

● 'ది సాఫ్ట్‌వేర్ డెవలప్పర్స్' (2020) వెబ్ సిరీస్‌తో నటిగా కెరీర్‌ను డెవలప్ చేశారు యంగ్ బ్యూటీ వైష్ణవీ చైతన్య. అల్లు అర్జున్ 'అల.. వైకుంఠపురములో', నాని 'టక్ జగదీష్', అజిత్ 'వలిమై' వంటి సినిమాల్లో సపోర్టింగ్ క్యారెక్టర్స్ చేసే అవకాశాలు వచ్చినప్పుడు, అవి తన కెరీర్‌కు సపోర్ట్ చేస్తాయని నమ్మి, ఆ పాత్రల్లో నటించారు వైష్ణవి. ఆ నమ్మకమే ఆమెను హీరోయిన్‌ని చేసింది. లీడ్ హీరోయిన్‌గా 'బేబి' సినిమా చేశారు వైష్ణవి. ఈ సినిమాలో ఎంత బాగా నటించారంటే.. ఇప్పుడు 'బేబి' అంటే దాదాపు కుర్రకారు అంతా టక్కున వైష్ణవీ చైతన్య పేరునే గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఇక ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన ఈ 'బేబి' సినిమాకు సాయి రాజేశ్ దర్శకత్వం వహించగా, ఎస్‌కేఎన్ నిర్మించారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. వైష్ణవీ చైతన్య కెరీర్ కూడా బ్లాక్ బస్టర్ అనేలా మారింది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ, ఆనంద్ దేవరకొండ హీరోలుగా నటిస్తున్న చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తూ బిజీగా ఉన్నారీ సిల్వర్ స్క్రీన్ బేబి. మామూలుగా తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావని అంటుంటారు. కానీ వరుస సినిమాలతో జోష్‌గా ఉన్నారు వైష్ణవీ చైతన్య.

● కన్నడ పరిశ్రమలో హీరోయిన్‌గా నిరూపించుకున్న ఆషికా రంగనాథ్ 'అమిగోస్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించారు. ఈ శాండిల్‌వుడ్ బ్యూటీ నటనకు ఆడియన్స్ ఓకే అన్నారు. ఆషికా కూడా తెలుగులో మరో అవకాశం తెచ్చుకోగలిగారు. ప్రస్తుతం నాగార్జున హీరోగా నటిస్తున్న 'నా సామి రంగ'లో ఆషిక ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇక కల్యాణ్‌రామ్ హీరోగా రాజేందర్ రెడ్డి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ 'అమిగోస్' చిత్రాన్ని నిర్మించారు.

● బుల్లితెర నుంచి తమిళ వెండి తెరపై దర్శనమిచ్చి సక్సెస్ ట్రాక్‌లో కొనసాగుతున్న వారిలో ప్రియా భవానీ శంకర్ ఒకరు. తమిళంలో ఫుల్ ఫామ్‌లో ఉన్న ఈ బ్యూటీ 'కళ్యాణం కమనీయం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించారు. సంతోష్ శోభన్ హీరోగా అనిల్ కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని యూవీ కాన్సెప్ట్స్ నిర్మించింది. జనవరిలో సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం విడుదలైంది. ఆ తర్వాత తెలుగులో ఒకట్రెండు సినిమాలు సైన్ చేశారు ప్రియా భవానీ శంకర్.

● తెలుగు తెరపై ఈ ఏడాది మెరిసిన హరియాణా బ్యూటీ యుక్తీ తరేజ. ఢిల్లీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఈ బ్యూటీ ఆ తర్వాత మోడల్‌గా కెరీర్‌ను ఆరంభించారు. 2019లో సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచి, అందరి చూపూ తనవైపు తిప్పుకున్నారు యుక్తి. ఆ తర్వాత ఇమ్రాన్ హష్మితో కలిసి ఈ బ్యూటీ చేసిన 'లుట్ గయే..' సాంగ్ ఇంటర్‌నెట్‌లో సంచలనమైంది. అంతే.. వెండితెర అవకాశాలు వచ్చాయి. అలా 'రంగబలి' సినిమాతో తెలుగు తెరపై మెరిశారు యుక్తీ తరేజ. తన నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. నాగశౌర్య హీరోగా పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి 'రంగబలి' చిత్రాన్ని నిర్మించారు.

***



● నూపుర్ సనన్ ● గాయత్రీ భరద్వాజ్



● యుక్తీ తరేజ



● ఐశ్వర్యా మీనన్

● రెండు చిత్రాలతో ఈ ఏడాది తెరపై మెరిశారు సాక్షీ వైద్య. ఈ ముంబై మోడల్ నాయికగా టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'ఏజెంట్'. అఖిల్ హీరోగా నటించారు. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించిన చిత్రం ఇది. అలాగే సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించిన మరో తెలుగు చిత్రం 'గాండీవధారి అర్జున' కూడా ఈ ఏడాదే రిలీజైంది. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు.

వీరే కాదు.. కిరణ్ అబ్బవరం 'మీటర్' సినిమాతో తమిళ హీరోయిన్ అతుల్యా రవి, దగ్గుబాటి అభిరామ్ హీరోగా పరిచయమైన 'అహింస'తో మధ్యప్రదేశ్ అమ్మాయి గీతికా తివారి, బెల్లంకొండ గణేశ్ 'నేను స్టూడెంట్ సర్!'తో అలనాటి తార భాగ్య శ్రీ తనయ అవంతికలతో పాటు మరికొందరు హీరోయిన్లు ఈ ఏడాది తెలుగు తెరపై మెరిశారు.



● సాక్షీ వైద్య



● మ్యూజిక్ వీడియోల్లో అక్షయ్ కుమార్ సరసన నటించి, బాలీవుడ్‌ను ఆకట్టుకున్నారు నూపుర్ సనన్. అయితే హీరోయిన్‌గా తొలి సినిమాను మాత్రం తెలుగులో చేశారు. రవితేజ టైటిల్ రోల్ చేసిన 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రంలో నూపుర్ సనన్ ఓ హీరోయిన్‌గా నటించారు. అలాగే ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా నటించిన ఢిల్లీ అమ్మాయి గాయత్రీ భరద్వాజ్‌కు సైతం తెలుగులో తొలి సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీకృష్ణ దర్శకత్వంలో ఈ సినిమాను అభిషేక్ అగర్వాల్ నిర్మించారు. అన్నట్లు మరో మాట.. మహేశ్‌బాబు, నాగచైతన్య, ప్రభాస్‌లతో సినిమాలు చేసిన హీరోయిన్ కృతీ సనన్ సోదరే నూపుర్ సనన్.

● బాల నటిగా, ఆ తర్వాత సహ నటిగా తమిళ, మలయాళం భాషల్లో సినిమాలు చేశారు అనిఖా సురేంద్రన్. గత ఏడాది విడుదలైన నాగార్జున 'ది ఘోస్ట్' చిత్రంలోనూ ఓ సపోర్టింగ్ రోల్ చేశారు. బాల నటిగా పేరు తెచ్చుకున్న అనిఖా హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమైన సినిమా 'బుట్టబొమ్మ'. అర్జున్ దాస్, సూర్య వశిష్ట ఇతర లీడ్ రోల్స్ చేశారు. మలయాళ హిట్ ఫిల్మ్ 'కప్పెలా'కు తెలుగు రీమేక్‌గా రూపొందిన ఈ సినిమాకు చంద్రశేఖర్ టి. రమేశ్ దర్శకత్వం వహించగా, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు.

● అనిఖా సురేంద్రన్

రీల్స్

డెవిల్ డేట్ ఫిక్స్



● కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటించిన పీరియాడికల్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటించారు. అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లుగా గురువారం చిత్ర యూనిట్ వెల్లడించింది. ''ఈ చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ పాత్రలో కల్యాణ్ రామ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.


దళారి రాజకీయం



● షకలక శంకర్, రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, 'షకలక' శంకర్, అక్షా ఖాన్ ప్రధాన పాత్రల్లో కాచిడి గోపాల్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'దళారి'. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాతలు సి. కల్యాణ్, దామోదర ప్రసాద్ విడుదల చేశారు. సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''వెంకట్ రెడ్డిగారిలాంటి కొత్తవారు వస్తేనే ఇండస్ట్రీ బాగుంటుంది. 'దళారి' ట్రైలర్ బాగుంది.. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాని ఆకృతి క్రియేషన్స్ పతాకంపై రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు వెంకట్ రెడ్డి. ''సమాజంలో ఏ పని జరగాలన్నా ఒక దళారి ఉంటాడు. అలాంటి దళారి పాత్ర రాజకీయంలో ఉంటే ఎలా ఉంటుందో తెలిపేదే మా సినిమా'' అన్నారు గోపాల్ రెడ్డి.

ఐదు భాషల్లో జాలరి



● శ్రీహరి, రాజ్ తాళ్లూరి

శ్రీహరి హీరోగా రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో తెరకెక్కనున్న 'జాలరి' సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి దర్శకుడు సముద్ర కెమెరా స్విచ్చాన్ చేసి, స్క్రిప్ట్‌ను నిర్మాతలకు అందించారు. ఐదు భాషల్లో 'జాలరి'ని ఎమ్‌వైఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ఆదిత్య పల్లా, రఘు కుడితిపూడి, సాయికిరణ్ బత్తుల, రక్తం దశరథ్ గౌడ్ నిర్మించనున్నారు. ''1980 నేపథ్యంలో కమర్షియల్ ఫార్మాట్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఫిబ్రవరిలో ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మతిమరుపు...



● రామకృష్ణ, యాని, రేఖ, హరికృష్ణ

కవలలు హరికృష్ణ, రామకృష్ణ హీరోలుగా యాని, రేఖా నిరోషా హీరోయిన్లుగా వెంకట్ దర్శకత్వం వహించిన చిత్రం 'తికమక తాండ'. తిరుపతి సత్యం సమర్పణలో తిరుపతి శ్రీనివాసరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాతలు సి. కల్యాణ్, దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్ అతిథులుగా హాజరై, హిట్టవ్వాలన్నారు. ''తికమక తాండ అనే ఊర్లోని ప్రజలకు మతిమరుపు అనే కథాంశంతో రూపొందించాం'' అన్నారు వెంకట్. ''మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు తిరుపతి శ్రీనివాసరావు.



సాక్షి బిజినెస్
శుక్రవారం
8-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	132	69,522
నిఫ్టీ ▽	37	20,901

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,339	△	192
డోజోన్స్	36,113	△	59
ఎఫ్‌టీఎస్ఈ 100	7,514	▽	2
డాక్స్	16,289	▽	27
షాంఘై	2,966	▽	3
నికాయ్	32,858	▽	588

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	62,462	△	318
బంగారం (22 క్యారట్)	62,212	△	317
వెండి (కిలో)	73,888	▽	380

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.28	82.61
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.09	106.45
€	యూరో	ఒకటి	88.30	91.35
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.95	57.67
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.34	55.69
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.32	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.78	23.88
¥	చైనా యువాన్	భారతీయ	10.38	12.33

హ్యుందాయ్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా కార్ల ధరలను పెంచుతోంది. భారమవుతున్న తయారీ వ్యయం, ప్రతికూల మారకపు రేటు, వస్తువుల ధరల పెరుగుదల ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. సవరించిన ధరలు 2024 జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయని గురువారం ప్రకటించింది. అయితే ఎంత మొత్తం పెంచేదీ సంస్థ వెల్లడించలేదు. రూ.5.84 లక్షల ప్రారంభ ధరలో గ్రాండ్ ఐ10తో మొదలుకుని రూ.45.95 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ అయానిక్–5 మోడళ్లను కంపెనీ భారత్‌లో విక్రయిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లోనే ధరలు పెంచాల్సి వస్తోందని హ్యుందాయ్ మోటార్ ఇండియా సీవోవో తరుణ్ గర్గ్ వెల్లడించారు. జనవరి నుంచి ధరలను సవరిస్తున్నట్టు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా, ఆడి ఇప్పటికే ప్రకటించాయి.

లంబోర్గినీ రెవెల్టో.. రూ.8.89 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సూపర్ లగ్జరీ కార్ల తయారీలో ఉన్న ఇటలీ దిగ్గజం ఆటోమొబైల్ లంబోర్గినీ తాజాగా భారత్‌లో తొలి ప్లగ్ ఇన్ హైబ్రిడ్ సూపర్ స్పోర్ట్స్ కారు రెవెల్టో ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.8.89 కోట్లు. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో ఎలక్ట్రిక్+పెట్రోల్ వేరియంట్‌లో లభిస్తుంది. ఇంధనం, డ్రైవింగ్ తీరునుబట్టి మైలేజీ లీటరుకు 10 కిలోమీటర్లు. ఇద్దరు మాత్రమే కూర్చునే వీలుంది. రెండు డోర్లున్న ఈ కారులో పౌచ్ సెల్స్‌తో లిథియం అయాన్ హై స్పెసిఫిక్ పవర్ బ్యాటరీ, 6,498 సీసీ వీ12 ఇంజన్ పొందుపరిచారు. గరిష్ట వేగం గంటకు 350 కిలోమీటర్లు.

ఫిబ్రవరి బడ్జెట్‌లో భారీ ప్రకటనలేమీ ఉండవు..

- జూలై తర్వాతే పూర్తి బడ్జెట్
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో సమర్పించే బడ్జెట్ .. ఓట్ ఆన్ అకౌంట్ మాత్రమేనని, అందులో ఎటువంటి అద్భుతమైన ప్రకటనలు ఉండబోవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అలాంటి వాటి కోసం, ఎన్నికలయ్యాక ఏర్పడే కొత్త ప్రభుత్వం జూలైలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే దాకా ఎదురు చూడాల్సిందేనని ఆమె తెలిపారు. సీఐఐ గ్లోబల్ ఎకనమిక్ పాలసీ ఫోరమ్‌లో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. ఎన్నికల ముంగిట్లో ప్రవేశపెట్టే బడ్జెట్ .. కొత్త సర్కార్ కొలువు తీరే వరకు అయ్యే ప్రభుత్వ వ్యయాలకు ఆమోదం పొందేందుకు ఉద్దేశించి ఉంటుంది. దీన్ని ఓట్ ఆన్ అకౌంట్‌గా వ్యవహరిస్తారు. సాధారణంగా ఇలాంటి వాటిలో ప్రభుత్వం భారీ ప్రతిపాదనలేమీ చేయదు. మరోవైపు, అన్ని రంగాల్లో కార్యకలాపాలు పుంజుకోవడంతో రెండో క్వార్టర్‌లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అత్యధికంగా నమోదైనట్లు రాజ్యసభలో చర్చ సందర్భంగా నిర్మలా సీతారామన్ తెలిపారు. తద్వారా ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎకానమీగా భారత్ కొనసాగుతోందని ఆమె చెప్పారు. గత ఎనిమిదేళ్ల వ్యవధిలో ప్రపంచంలోనే అతి పెద్ద ఎకానమీల జాబితాలో భారత్ 10వ స్థానం నుంచి అయిదో స్థానానికి చేరిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మేకిన్ ఇండియా, పీఎల్‌ఐ (ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాల స్కీము) వంటి తోడ్పాటు చర్యలతో తయారీ రంగం కూడా ఎకానమీ వృద్ధిలో గణనీయంగా పాలుపంచుకుంటోందని మంత్రి చెప్పారు. నిరుద్యోగిత రేటు 2017–18లో దాదాపు 18 శాతంగా ఉండగా ప్రస్తుతం 10 శాతానికి దిగి వచ్చిందన్నారు.

జాయ్ అలుక్కాస్ ఆత్మకథ పుస్తకావిష్కరణ



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ ఆత్మకథ(ఆటోబయోగ్రఫీ) 'స్ప్రెడింగ్ జాయ్–హౌ జోయాలుక్కాస్ బికమ్ వరల్డ్ ఫేవరేట్ జ్యువెలర్'ను షార్జా పుస్తక మేళాలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులతో పాటు, భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. అద్భుతమైన ఈ ఆత్మకథ అమెజాన్‌లో బెస్ట్ సెల్లర్‌గా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

8-12-2023	
విశాఖ	550–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545–00
విజయవాడ	545–00
రిటైల్ ధర (డజను)	72.00
7-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

ఏడు రోజుల ర్యాలీకి బ్రేక్..!

- గరిష్ట స్థాయి వద్ద లాభాల స్వీకరణ
- ఆర్‌బీఐ పాలసీ వెల్లడికి ముందు అప్రమత్తత
- ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు



ముంబై: ఆసియా మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి(నేడు)కి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా స్టాక్ సూచీల ఏడు రోజుల వరుస లాభాలకు గురువారం ముగింపు పడింది. సెన్సెక్స్ 132 పాయింట్లు నష్టపోయి 69,522 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు పతనమైన 20,901 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఎఫ్‌ఎంసీజీ, మెటల్, టెక్ షేర్ల అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. యుటిలిటీ, విద్యుత్, కన్జూమర్ డ్యూరబుల్స్, ఇంధన షేర్లు కొనుగోళ్లకు మద్దతు లభించింది. చైనా ఆర్థిక వ్యవస్థ మందగమన ఆందోళనలతో ఆసియా మార్కెట్లు 2% పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు అరశాతం నష్టపోయాయి.

- ఆర్‌బీఐ కన్జూమర్ రుణ నిబంధనలు కఠినతరం చేసిన నేపథ్యంలో పేటీఎం రూ.50,000 లోపు వ్యక్తిగత రుణాల జారీని తగ్గించుకుంటామని ప్రకటించింది. దీంతో కంపెనీ షేరు 19% నష్టపోయి రూ.661 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% క్షీణించి రూ.651 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. షేరు భారీ పతనంతో ఒక్కరోజులో రూ.9,642 కోట్ల(1.15 బిలియన్ డాలర్లు) మార్కెట్ క్యాప్ తుడిచిపెట్టుకుపోయింది.
- ఎల్‌ఐసీ షేరు ఇంట్రాడేలో 7% లాభపడి రూ.800 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. దీంతో 2022 తర్వాత బీఎస్ఈలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ తిరిగి రూ.5 లక్షల కోట్ల మార్కు అందుకుంది. మార్కెట్ ముగిసే సరికి 5% లాభపడి రూ.786 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.4.96 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. మొత్తం నాలుగు ట్రేడింగ్‌లో ఈ షేరు 19% ర్యాలీ చేసింది.
- ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,000 కోట్ల నుంచి రూ.1,200 కోట్ల నిధుల సమీకరణ సిద్ధమైనట్లు వార్తలు వెలువడటంతో స్పైస్‌జెట్ షేరు 20% ఎగసి రూ.52.29 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

ఇర్కాన్ ఆఫర్‌కు భారీ స్పందన

4.63 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్

రైల్వే రంగ కంపెనీ ఇర్కాన్ ఇంటర్నేషనల్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు సంస్థాగత ఇన్వెస్టర్లనుంచి భారీ స్పందన లభించింది. ప్రభుత్వం మొత్తం 7.53 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. వీటిలో 3.38 కోట్ల షేర్లను నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసింది. ఈ కేటగిరీలో 15.66 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి 4.63 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. వీటి విలువ రూ. 2,400 కోట్లుకాగా.. షేరుకి రూ. 154 ఫ్లోర్ ధరలో ప్రభుత్వం మొత్తం 8 శాతం వాటాను ఆఫర్ చేస్తోంది. నేడు(శుక్రవారం) రిటైల్ ఇన్వెస్టర్లకు విండో ఓపెన్ కానుంది. ప్రస్తుతం ఇర్కాన్‌లో ప్రభుత్వం 73.18 శాతం వాటాను కలిగి ఉంది. ఓఎఫ్ఎస్‌కు నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లు రూ. 157.24 సగటు ధరలో దరఖాస్తు చేయడం గమనార్హం!

ఓఎఫ్ఎస్ నేపథ్యంలో ఇర్కాన్ షేరు బీఎస్ఈలో 6.5% పతనమై రూ. 161 దిగువన స్థిరపడింది.

డోమ్స్ @ రూ. 750–790

- 13 నుంచి ఐపీవో షురూ
- రూ. 1,200 కోట్ల సమీకరణ లక్ష్యం



ముంబై: పెన్సిళ్ల తయారీ దిగ్గజం డోమ్స్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 750–790 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 13న ప్రారంభమై 15న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 350 కోట్ల విలువైన ఈక్విటీని కంపెనీ కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో రూ. 850 కోట్ల విలువైన షేర్లను డోమ్స్‌లో 51 శాతం వాటా కలిగిన ఇటాలియన్ దిగ్గజం ఫిలాతోపాటు ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 1,200 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ప్రధానంగా ఫిలా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని ఆఫర్ చేస్తోంది. కాగా.. అర్హతగల కంపెనీ ఉద్యోగులకు రూ. 5 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేసింది. వీటిని షేరుకి రూ. 75 డిస్కౌంట్ ధరలో ఆఫర్ చేస్తోంది.

కొత్త ప్లాంటు ఏర్పాటు..: ఈక్విటీ జారీ నిధులను గుజరాత్‌లోని అంబర్‌గావ్‌వద్ద కొత్త తయారీ ప్లాంటు ఏర్పాటు, కార్పొరేట్ అవసరాలకు డోమ్స్ వినియోగించనుంది. ప్రధానంగా డోమ్స్ బ్రాండుతో కంపెనీ స్టేషనరీ, ఆర్ట్ ప్రొడక్టులను విక్రయిస్తోంది. గతేడాది (2022–23) డోమ్స్ ఆదాయం రూ. 684 కోట్ల నుంచి రూ. 1,212 కోట్లకు జంప్‌చేయగా.. రూ. 103 కోట్ల నికర లాభం ఆర్జించింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి పరివార్ అకౌంట్

ముంబై: సేవింగ్స్, కరెంటు ఖాతాలకు సంబంధించి బీవోబీ పరివార్ అకౌంటును ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడించింది. దీని ప్రకారం ఒకే కుటుంబానికి చెందిన సభ్యులందరి ఖాతాలను ఒక గ్రూపుగా పరిగణిస్తారు. ప్రతి ఖాతాను ఎవరికి వారు వేర్వేరుగా నిర్వహించుకుంటున్నప్పటికీ కనీస త్రైమాసిక బ్యాలెన్స్ (క్యూఏబీ)ని గ్రూప్/కుటుంబ స్థాయిలో లెక్కిస్తారు. తద్వారా ప్రతి ఖాతా వేర్వేరుగా క్యూఏబీ పాటించక్కర్లేదు. పరివార్ ఖాతాలో కనిష్టంగా ఇద్దరు, గరిష్టంగా ఆరుగురు కుటుంబ సభ్యులు



ఉండవచ్చు. సిల్వర్, గోల్డ్, డైమండ్ అని 3 కేటగిరీల్లో ఈ ఖాతాలు ఉంటాయి. ఈ ఖాతాదారులు తక్కువ వడ్డీపై రిటైల్ రుణాలు, ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు వంటి ప్రయోజనాలను పొందొచ్చని బ్యాంక్ సీజీఎం రవీంద్ర సింగ్ నెగి తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



గౌతమ్‌కు ఐదు స్వర్ణాలు

తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లా జూనియర్, సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ స్విమ్మర్ గౌతమ్ శశివర్ధన్ ఐదు స్వర్ణ పతకాలతో అదరగొట్టాడు. విక్కీ స్విమ్మింగ్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న 14 ఏళ్ల గౌతమ్ బరిలోకి దిగిన ఐదు ఈవెంట్లలోనూ విజేతగా నిలిచాడు. గ్రూప్–2 వయో విభాగంలో గౌతమ్ 50, 100, 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ ఈవెంట్లలో పసిడి పతకాలు గెలిచాడు. ఈ ప్రదర్శనతో గౌతమ్ ఈనెల 27 నుంచి 29 వరకు బెంగళూరులో జరిగే జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్టులోకి ఎంపికయ్యాడు.

రెండో రోజు ఆట వర్షార్పణం

బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మిర్పూర్‌లో జరుగుతున్న రెండో టెస్టు తొలిరోజు ఆటను ఇరుజట్ల బౌలర్లు శాసిస్తే, రెండో రోజు ఆటను వాన ఆపేసింది. గురువారం భారీ వర్షం వల్ల స్టేడియం చిత్తడిగా మారింది. దీంతో ఒక బంతి అయిన పడకుండానే అంపైర్లు ఆటను రద్దు చేయాల్సి వచ్చింది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'



శ్రీనగర్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు రెండో 'డ్రా' నమోదు చేసింది. రియల్ కశ్మీర్ ఎఫ్‌సీ జట్టుతో గురువారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి డెక్కన్ జట్టు 0–0తో 'డ్రా'గా ముగించింది. రెండు జట్లకు గోల్ చేసే అవకాశాలు లభించినా ఫినిషింగ్ లోపంతో సాధ్యపడలేదు. 13 జట్ల మధ్య జరుగుతున్న ఐ–లీగ్‌లో ఇప్పటి వరకు శ్రీనిధి జట్టు తొమ్మిది మ్యాచ్‌లు ఆడింది. ఐదు మ్యాచ్‌ల్లో గెలిచింది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి, మరో రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని ఓవరాల్‌గా 17 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఈనెల 11న జరిగే తదుపరి మ్యాచ్‌లో ఢిల్లీ ఎఫ్‌సీతో హైదరాబాద్‌లో శ్రీనిధి జట్టు తలపడుతుంది.

అజేయంగా కీర్తిక



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి బి.కీర్తిక ఐదో విజయం సాధించింది. గురువారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో కీర్తిక 44 ఎత్తుల్లో మీరా సింగ్ (ఢిల్లీ)పై గెలిచింది. ఏడో రౌండ్ తర్వాత నిహిరా కౌల్ (మహారాష్ట్ర), ఆముక్త (ఆంధ్రప్రదేశ్)లతో కలసి కీర్తిక ఆరు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉంది. కీర్తిక ఐదు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నైనా గొర్లి 6.5 పాయింట్లతో రెండో స్థానంలో... శ్రేయా హిప్పరాగి (మహారాష్ట్ర) 7 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తెలంగాణకే చెందిన సంహిత పుంగవనం, శివాంశిక 5.5 పాయింట్లతో మరో ఎనిమిది మందితో కలిసి ఉమ్మడిగా నాలుగో స్థానంలో ఉన్నారు.

భారత్‌కు స్పెయిన్ షాక్

- రెండో మ్యాచ్‌లో 1–4తో ఓడిపోయిన యువ భారత్
- జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ



గోల్ చేసిన ఆనందంలో భారత బృందం

కౌలాలంపూర్: జూనియర్ పురుషుల అండర్–21 ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత్‌కు ఊహించని ఫలితం ఎదురైంది. గురువారం వరుసగా రెండో విజయం సాధించి దర్జాగా క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోవాలని ఆశించిన యువ భారత్ గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో 1–4 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో ఓడిపోయింది. వరుసగా రెండో విజయంతో స్పెయిన్ జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై 4–2తో నెగ్గి శుభారంభం చేసిన భారత జట్టుకు రెండో మ్యాచ్‌లో స్పెయిన్ నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. ఆట తొలి నిమిషంలోనే పాల్ క్యాబిర్ వెర్డెల్ గోల్‌తో స్పెయిన్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 18వ నిమిషంలో ఆండ్రెస్ రాఫి గోల్‌తో స్పెయిన్ ఆధిక్యం 2–0కు పెరిగింది. 33వ నిమిషంలో రోహిత్ గోల్ సాధించడంతో భారత్ ఖాతా తెరిచింది. అయితే స్పెయిన్ జోరు తగ్గించకుండా ఆడుతూ ఎనిమిది నిమిషాల తర్వాత మూడో గోల్ చేసింది. పాల్ క్యాబిర్ వెర్డెల్ గోల్‌తో స్పెయిన్ 3–1తో ముందంజ వేసింది. మ్యాచ్ చివరి నిమిషంలో ఆండ్రెస్ రాఫి గోల్‌తో స్పెయిన్ 4–1తో విజయాన్ని ఖాయం చేసుకుంది. భారత జట్టుకు ఈ మ్యాచ్‌లో ఏడు పెనాల్టీ కార్నర్‌లు రాగా కేవలం ఒక దానిని సద్వినియోగం చేసుకుంది. మరో మ్యాచ్‌లో దక్షిణ కొరియా 4–1తో కెనడాను ఓడించి క్వార్టర్ ఫైనల్ రేసులో నిలిచింది. శనివారం జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో కెనడాతో భారత్; కొరియాతో స్పెయిన్ తలపడతాయి. కొరియా–స్పెయిన్ మ్యాచ్ తర్వాతే భారత జట్టు మ్యాచ్ జరుగుతుంది. ఒకవేళ స్పెయిన్ చేతిలో కొరియా ఓడితే భారత్ తమ మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంటే చాలు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటుంది. ఒకవేళ స్పెయిన్‌పై కొరియా గెలిస్తే మాత్రం భారత్ భారీ తేడాతో కెనడాపై తప్పనిసరిగా విజయం సాధించాల్సి ఉంటుంది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	4	3	1	0	16
పట్నా పైరేట్స్	2	2	0	0	10
బెంగాల్ వారియర్స్	2	1	0	1	8
యూపీ యోధాస్	2	1	1	0	6
యు ముంబా	2	1	1	0	6
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
పుణేరి పల్టన్	1	1	0	0	5
జైపూర్ పింక్ పాంథర్స్	2	0	1	1	4
బెంగళూరు బుల్స్	2	0	2	0	2
తెలుగు టైటాన్స్	2	0	2	0	1
దబంగ్ ఢిల్లీ	1	0	1	0	0
హరియాణా స్టీలర్స్	1	0	1	0	0

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు

గుజరాత్‌పై పట్నా పైచేయి



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో వరుసగా మూడు విజయాలతో జోరు మీదున్న గుజరాత్ జెయింట్స్ జట్టుకు పట్నా పైరేట్స్ బ్రేక్ వేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ 33–30 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. ఈ లీగ్‌లో పట్నాకిది వరుసగా రెండో విజయంకాగా... గుజరాత్ జట్టుకిది తొలి పరాజయం. గుజరాత్‌తో మ్యాచ్‌లో పట్నా సమష్టి ఆటతో రాణించింది. పట్నా పైరేట్స్ తరఫున సుధాకర్ (6 పాయింట్లు), సచిన్ (4), నీరజ్ కుమార్ (4), అంకిత్ (4), సందీప్ కుమార్ (4 పాయింట్లు) ఆకట్టుకున్నారు. గుజరాత్ తరఫున రాకేశ్ 11 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా ఫలితం లేకపోయింది. అంతకుముందు బెంగాల్ వారియర్స్, జైపూర్ పింక్ పాంథర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 28–28తో 'డ్రా'గా ముగిసింది. బెంగాల్ తరఫున శ్రీకాంత్ జాదవ్ (7), నితిన్ కుమార్ (5), మణీందర్ సింగ్ (4)... జైపూర్ తరఫున భవాని రాజ్‌పుత్ (10) అర్జున్ దేశ్వాల్ (6) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో దబంగ్ ఢిల్లీ; పుణేరి పల్టన్‌తో యు ముంబా తలపడతాయి.

'నన్ను ఫిక్సర్ అన్నాడు'

గంభీర్‌పై శ్రీశాంత్ ఆరోపణ





శ్రీశాంత్

సూరత్: గౌతమ్ గంభీర్...ఎస్.శ్రీశాంత్...భారత జట్టు తరఫున కలిసి 49 మ్యాచ్‌లు ఆడారు. 2007 టి20, 2011 వన్డే వరల్డ్ కప్ విజయాల్లో భాగస్వాములు. రిటైర్మెంట్ తర్వాత 'సీనియర్లు'గా లెజెండ్స్ లీగ్ క్రికెట్ (ఎల్ఎల్‌సీ)లో ఆడుతున్నారు. కానీ ఆవేశకావేశాలకు మారుపేరైన వీరిద్దరు ఇలాంటి వెటరన్ టోర్నీలో కూడా గొడవ పడ్డారు. గంభీర్ తనను పదే పదే 'ఫిక్సర్' అంటూ దూషించాడని శ్రీశాంత్ ఆరోపించాడు. బుధవారం ఇండియా క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల మధ్య జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. మ్యాచ్ తర్వాత ఒక వీడియో విడుదల చేసిన శ్రీశాంత్ 'నా తప్పు ఏమీ లేకపోయినా గంభీర్ నన్ను అనరాని మాటలు అన్నాడు. అది సరైంది కాదు' అని అన్నాడు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే మరో వీడియోలో దానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాడు. 'ఫిక్సర్, ఫిక్సర్, నువ్వు ఫిక్సర్‌వి అంటూ పదే పదే గంభీర్ అన్నాడు. నేను నవ్వుతూ ఉన్నా అతను మాత్రం అలాంటి దూషణలు కొనసాగించాడు. నేను ఒక్క చెడు మాట కూడా మాట్లాడలేదు. అసలు అతనికి ఎందుకు కోపం వచ్చిందో, ఎందుకు అలా అన్నాడో నాకు అస్సలు అర్థం కాలేదు' అని వివరించాడు. ఈ ఘటనపై గంభీర్ వైపు నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు కానీ తాను చిరునవ్వులు చిందిస్తున్న ఫొటోను ట్విట్టర్‌లో పెట్టాడు. ఎల్ఎల్‌సీలో తగిన నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తున్నామని, ఘటనపై విచారణ చేస్తామని మాత్రం టోర్నీ నిర్వాహకులు ప్రకటించారు. ఆ తర్వాత దీనిని కొనసాగించిన శ్రీశాంత్... 'నువ్వు అందరితో ఇలాగే ఉంటావు, సీనియర్లను కూడా గౌరవించవు. నన్ను అలా అనే హక్కు నీకు లేదు. అయినా నువ్వు సుప్రీం కోర్టుకంటే ఎక్కువా' అని ప్రశ్నించాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంలో శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధం విధించగా... సుప్రీం కోర్టు ఆదేశాలతో దానిని ఏడేళ్లకు తగ్గించడంతో 2020లో అతని నిషేధం ముగిసింది.

క్వార్టర్స్‌లో అచ్యుతాదిత్య–హర్షవర్ధన్ జోడీ

గువాహటి: హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కీలక దశలో పాయింట్లు గెలిచిన దొడ్డవరపు అచ్యుతాదిత్య రావు–వెంకట హర్షవర్ధన్ (భారత్) జోడీ... గువాహటి ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తెలంగాణకు చెందిన అచ్యుతాదిత్య, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్షవర్ధన్ ద్వయం 24–22, 23–21తో నాలుగో సీడ్ వె చున్ వె–వు గువాన్ జున్ (చైనీస్ తైపీ) జంటను బోల్తా కొట్టించింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ అమ్మాయి సామియా 15–21, 21–18, 13–21తో రెండో సీడ్ వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ 21–13, 19–21, 17–21తో చూంగ్ హోన్ జియాన్–గో పె కీ (మలేసియా) జంట చేతిలో పరాజయం పాలైంది.

రెండో వన్డేలో ఇంగ్లండ్ విజయం

రాణించిన స్యామ్ కరన్, జాక్స్, బట్లర్



స్యామ్ కరన్

అంటిగ్వా: ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన ఇంగ్లండ్ జట్టు వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో ఆరు వికెట్ల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 39.4 ఓవర్లలో 202 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (3/33), లివింగ్‌స్టోన్ (3/39), అట్కిన్సన్ (2/28), రేహన్ (2/40) వెస్టిండీస్‌ను దెబ్బతీశారు. అనంతరం ఇంగ్లండ్ దూకుడుగా ఆడి 32.5 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 206 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ విల్ జాక్స్ (72 బంతుల్లో 73; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ జోస్ బట్లర్ (45 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. ముందుగా ఓపెనర్లు జాక్స్, ఫిల్ సాల్ట్ (21) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. అనంతరం క్రాలీ (3), డకెట్ (3) నిరాశ పరిచారు. ఈ దశలో హ్యారీ బ్రూక్ (49 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), బట్లర్ అబేధ్యమైన ఐదో వికెట్‌కు 90 పరుగుల జోడించి జట్టును గెలిపించారు.

క్లుప్తంగా...

శబరిమలకు ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. కాచిగూడ–కొల్లాం (07187/07188) స్పెషల్ ట్రైన్ ఈ నెల 11వ తేదీ సోమవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరి బుధవారం ఉదయం 5.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 13వ తేదీ బుధవారం ఉదయం 10.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.45కు కాచిగూడకు చేరుకుంటుంది. సికింద్రాబాద్–కొల్లాం (07193/ 07194)స్పెషల్ ట్రైన్ ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం 10.40 గంటలకు బయ లుదేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంట లకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయా ణంలో 15వ తేదీ శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉద యం 9.40కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

డాక్టర్ లాస్య సాయి సింధుకు నేషనల్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: నగరంలోని సిటీన్యూరో ఆసుపత్రిలో న్యూరోటాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ లాస్య సాయి సింధుకు ఆరోగ్యరంగంలో జాతీయ అవార్డు లభించింది. కేంద్ర ప్రభు త్వం దీన్ని అందజేసింది. జీ–20లో భాగంగా నేషనల్ అచీవర్స్ రికగ్నిషన్ ఫోరం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక 'నేషనల్ అచీవర్స్ అవార్డ్ ఫర్ హెల్త్ ఎక్సలెన్స్ – 2023'అవా ర్డును ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తిరథ్ సింగ్ రావత్ చేతుల మీదుగా డాక్టర్ లాస్య సాయి సింధు గురువారం ఢిల్లీలో అందుకున్నారు. ఆమెకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. న్యూరోటాలజిస్ట్‌గా ఆమె అందిస్తున్న సేవ లకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కరోనా తర్వాత అనేక మంది బాధితులు కళ్లు తిరగ డం (వర్టిగో) వంటి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. ఇటువంటి వారికి తక్కువ మందులు ఇచ్చి నిర్ణీత వ్యాయామాలతో ఆమె నయం చేస్తున్నారు.

'ధరణి' పోర్టల్‌లో దొంగలు పడ్డారు!

- రంగారెడ్డి జిల్లాలో భారీ భూ బాగోతం
- అక్టోబర్ 14 నుంచి నవంబర్ 11 మధ్య 98 దరఖాస్తులకు ఆమోదం
- కలెక్టర్ అనుమతి, క్షేత్రస్థాయి రిపోర్టు లేకుండా వ్యవహారం
- ఇద్దరు ఉద్యోగులపై వేటు.. పోలీసులకు ఫిర్యాదు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లో దొంగలు పడ్డారు. జిల్లా కలెక్టర్ సహా తహసీల్దార్లంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉండగా.. సదరు వెబ్‌సైట్‌ను పర్యవేక్షిస్తున్న ఇద్దరు వ్యక్తులు అడ్డదారులు తొక్కారు. అక్టోబర్ 14 నుంచి నవంబర్ 11 మధ్య రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఈ తంతులో భారీగా భూములు చేతులు మారినట్లు తెలుస్తోంది. కలెక్టర్ పరిశీలన, అనుమతి లేకుండా దరఖాస్తులకు ఆమోదం (డిజిటల్ సంతకంతో) తెలిపినట్లు సమాచారం. ఇలా నిషేధిత జాబితాలో ఉన్న 98 దరఖాస్తులను ఈ తరహాలో జాబితా నుంచి తొలగిస్తూ అక్రమాలకు పాల్పడినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ అంశంపై పోలీసులు కూడా విచారణ ప్రారంభించినట్లు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. సాంకేతికతను అడ్డుపెట్టుకుని నడిపిన ఈ వ్యవహారంలో కీలక భూమిక పోషించిన ఇద్దరు ఉద్యోగులకు ఇంటిదొంగలు ఎవరైనా సాయపడ్డారా? ఈ భూ బాగోతంలో ఇతరుల పాత్ర ఏమైనా ఉందా? అనే కోణాల్లో అధికారులు ఆరా తీస్తున్నారు.

28 రోజుల్లో 98 దరఖాస్తులకు ఆమోదం

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై అప్పటి జిల్లా కలెక్టర్ హరీశ్‌పై కేంద్ర ఎన్నికల కమిషన్ అక్టోబర్ 11న వేటు వేసింది. ఆ తర్వాత ఆయన స్థానంలో కొత్తగా భారతీ హోళికేరి కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఆ వెంటనే జిల్లా ఎన్నికల అధికారిగా ఆమె బిజీగా మారారు. ధరణి పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తులను పక్కన పెట్టి.. పూర్తిగా ఎన్నికలపైనే దృష్టిని కేంద్రీకరించారు. ఇదే అదనుగా భావించిన ధరణి సిబ్బంది భారీ అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. జిల్లాలో పలు చోట్ల ఉన్న భూదాన్ భూములను పట్టా భూములుగా మారుస్తూ ఆమోదముద్ర వేసినట్లు తేలింది. నిజానికి ఏదైనా ధరణి దరఖాస్తును ఆమోదించాలన్నా.. తిరస్కరించాలన్నా.. క్షేత్రస్థాయి రిపోర్టులే కీలకం. కానీ అక్టోబర్ 14 నుంచి నవంబర్ 11 మధ్యన ఎలాంటి రిపోర్టులు లేకుండానే సుమారు వంద అర్జీలకు ఆమోదం లభించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు.. దర్యాప్తు ముమ్మరం

కోర్టు కేసులు, అసైన్డ్, భూదాన్, మ్యూటేషన్లు, పాసు పుస్తకాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన వివాదాస్పద భూ సమస్యల అప్లికేషన్లకు పోర్టల్‌లో ఆమోదం రావడంపై కొందరు ఆరా తీయగా.. అసలు విషయం బయటపడింది. ఇంటి దొంగలే ఈ ఉదంతానికి పాల్పడినట్లు తేలింది. దీంతో ఉన్నతాధికారులు ధరణి సమన్వయకర్త నరేశ్, ఆపరేటర్ మహేశ్‌లను సస్పెండ్ చేశారు. ఈ అంశంపై లోతైన దర్యాప్తు జరపాల్సిందిగా కోరుతూ ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు అందడంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే ఇందులో కేవలం సమన్వయకర్త, ఆపరేటర్ల పాత్ర మాత్రమే ఉందా? లేక జిల్లా ఉన్నతాధికారులు, ఇతర అధికారుల పాత్ర ఏమైనా ఉందా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుప కంచె తొలగింది

ప్రజాభవన్‌గా మారిన ప్రగతి భవన్ ఎదుట ఉన్న ఇనుప గ్రిల్స్‌ను తొలగించిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్‌గా మారిన ప్రగతి భవన్ ఎదుట సుదీర్ఘకాలంగా ఉన్న ఇనుప కంచెను జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం తొలగించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నారు. సిటీ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు సైతం ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఒకట్రెండు రోజుల్లో ఆ రోడ్డును పూర్తిస్థాయిలో వాహన చోదకుల కోసం అందుబాటులోకి తీసుకురానున్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో మొదలు..

బేగంపేటలోని గ్రీన్‌లాండ్స్ చౌరస్తా సమీపంలో చాలా ఏళ్లుగా ముఖ్యమంత్రి నివాసం, క్యాంప్ ఆఫీస్ కొనసాగుతున్నాయి. వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో అక్కడ ముఖ్యమంత్రి నివాసం నిర్మితమైంది. ఆయన అందులో బస చేసినప్పుడు రహదారిపై ఎలాంటి అడ్డంకులు ఉండేవి కాదు. కేవలం సీఎం నివాసంలోకి ప్రవేశించడానికే అనుమతులు అవసరమయ్యేవి. అయితే నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక అప్పటి ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో తొలిసారిగా ఆ రహదారిలో బారికేడ్లు వెలిశాయి. తొలినాళ్లలో తాత్కాలికంగా 8 అడుగుల ఎత్తున వాటిని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ప్రగతి భవన్ నిర్మించిన తర్వాత రోడ్డుపైకి ఇనుప గ్రిల్స్ వచ్చాయి. వాటి ప్రభావంతో బేగంపేట మార్గంలో పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడేవి.

సీఎం రేవంత్ ఆదేశంతో...

మంగళవారం తనను ముఖ్యమంత్రిగా ప్రకటించిన వెంటనే మాట్లాడిన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మారుస్తున్నట్లు, అక్కడే ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం నుంచి ప్రజాదర్బార్ ప్రారంభం కానుండటంతో అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు అడ్డంకులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం ఉదయం నుంచి అవసరమైన చర్యలు ప్రారంభించారు.

'సెట్' చేద్దాం..

- సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు ముందస్తుగానే అర్హత పరీక్షలు
- వచ్చే ఏడాది పంచాయతీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సొసైటీల నిర్ణయం !
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, పరీక్షల నిర్వహణకు ప్రణాళిక రూపకల్పన



సాక్షి, హైదరాబాద్: ఈసారి సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ముందస్తుగానే అర్హత పరీక్షలు నిర్వహించే అవకాశముంది. వివిధ తరగతులు, కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(సెట్) నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఏప్రిల్– మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. వీటికంటే ముందుగానే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకా శం ఉంది. అదే సమయంలో అర్హత పరీక్షల నిర్వ హణ అంటే క్లిష్టతరమే అవుతుంది. దీంతో ఎన్నికల కంటే ముందుగానే అర్హత పరీక్షలు నిర్వహించేందు కు సొసైటీ అధికారులు కార్యాచరణ రూపొందిస్తు న్నారు. ఇందులో భాగంగానే నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ తదితరాలను వీలైన ంత వేగంగా పూర్తి చేసే దిశగా యోచిస్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల పరిధిలో 960 గురుకుల విద్యా సంస్థలున్నాయి. ఇందులో గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలతో పాటు పరిమిత సంఖ్యలో పీజీ కాలేజీలు, ప్రత్యేక ఇంటర్మీడియట్ కాలేజీలున్నాయి. వివిధ కేటగిరీల్లో ఏటా దాదాపు 1.75లక్షల మందికి ప్రవేశాలు కల్పిస్తారు.

వచ్చే నెలలో నోటిఫికేషన్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యా శాఖ పరిధిలోని గురుకులాల్లో ఐదో తరగతి ప్రవే శాలకు ఉమ్మడిగా సెట్ నిర్వహిస్తారు. ఇక సొసై టీల వారీగా పాఠశాలల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి సైతం సొసైటీలు వేటికవే వేర్వేరు నోటిఫికేషన్లు ఇస్తాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సొసైటీల వారీగా సెట్‌లు నిర్వహించి అడ్మిషన్లు పూర్తి చేస్తారు. వీటికి సంబంధించిన నోటిఫికే షన్లు వచ్చే నెలలో జారీ చేసేందుకు సొసైటీలు కసరత్తు చేస్తున్నాయి. ఉమ్మడి ప్రవేశ పరీక్షకు సంబంధించి నాలుగు సొసైటీల అధికారులు ఇప్పటికే సమావేశమై నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. జూనియర్ కాలేజీలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లో ప్రవేశాలకు నోటిఫి కేషన్ల జారీకి సంబంధించిన ప్రక్రియ దాదాపు పూర్త య్యింది. డిగ్రీ కాలేజీల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశా లకు సంబంధించిన నోటిఫి కేషన్లు వచ్చే నెలలో జారీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నోటిఫికేషన్ల తర్వాత ఆసక్తి ఉన్న అభ్యర్థులు దర ఖాస్తు చేసుకోవడం, ఆన్ లైన్‌లో వివరాలు నమోదు చేయడం, ఫీజు చెల్లింపు నకు సంబంధించిన గడువు గరిష్టంగా నెల రోజులు ఇస్తారు. ఆ తర్వాత నెలన్నర వ్యవధిలో అర్హత పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ తయారు చేస్తున్నారు. ఈ నెలాఖరు కల్లా నోటిఫికేషన్ల జారీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

తెలంగాణ గిరిజన వర్సిటీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గిరిజన యూనివర్సిటీ బిల్లుకు లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది. తెలంగాణలో సమ్మక్క–సారక్క యూనివర్సిటీ ఏర్పాటు నిమిత్తం ప్రవేశపెట్టిన 'కేంద్రీయ విశ్వవిద్యాలయాల(సవరణ) బిల్లు–2023'పై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఈ బిల్లుకు ఎలాంటి సవరణలు లేకుండా ఆమోదం లభించింది. కేంద్ర యూనివర్సిటీల జాబితాలో సమ్మక్క–సారక్క విశ్వవిద్యాలయం చేర్చుతూ ప్రస్తుతం ఉన్న చట్టానికి సవరణ చేశారు. తెలంగాణలో ఈ వర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా మరింతమందికి ఉన్నత విద్య అందుబాటులోకి రావడంతో పాటు గిరిజన కళలు, సంస్కృతి, సంప్రదాయాలపై పరిశోధనలు చేయవచ్చని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం ఈ గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని వివరించారు. సెంట్రల్ యూనివర్సిటీ చట్టాన్ని సవరించి అందులో ఈ వర్సిటీని చేర్చుతున్నట్లు లోక్‌సభలో జరిగిన చర్చలో కేంద్రమంత్రి తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.